

అమరవీరులకు అరుణాంజలి
రూ॥ 220/-
పేజీలు: 230
నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్), హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ, హిమాయత్‌నగర్ (హైదరాబాద్) హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం 03

ఉపాధి హామీ పథకం రద్దు చేయాలనుకుంటున్న మోదీ ఈ చర్య ప్రజాస్వామ్య మూలాలపై దాడి 05



సంపుటి 28, సంచిక: 209 | బుధవారం | 21-01-2026 | హైదరాబాద్

Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar

పేజీలు: 12 | వెల రూ. 5.00





# వామపక్ష ఐక్యతే దేశ ప్రగతికి మూలాధారం

## బలమైన ఐక్యఉద్యమాల నిర్మాణానికి నడుంకట్టాలి

## ఖమ్మంలో జరిగిన సిపిఐ సెమినార్‌లో వామపక్షపార్టీల అగ్రనాయకుల ఉద్ఘాటన



వామపక్షాల సెమినార్ దృశ్యాలు 12

కె.సంతోష్ కుమార్

**ఖమ్మం :** వామపక్ష పార్టీలతోనే భారతదేశ భవిష్యత్తు ముడిపడి ఉందని వామపక్ష పార్టీల అగ్రనేతలు అభిప్రాయపడ్డారు. వామపక్షాల బలోపేతం ద్వారానే పీడిత వర్గాలకు న్యాయం జరుగుతుందని, అసమానతలులేని నవ సమాజ నిర్మాణానికి అవకాశం కలుగుతుందని ఉద్ఘాటించారు. భారతదేశంలో పేట్రేగిపోతున్న ఫాసిస్టు శక్తులకు, అత్యంత ప్రమాదకరంగా మారిన మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా వామపక్షాలు బలమైన ఐక్య పోరాటాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఒక వైపు దేశంలో పాతుకుపోయిన కుల వ్యవస్థ నిర్మూలనకు పోరాడుతూ, మరోవైపున ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ అత్యంత ప్రమాదకరంగా మారిన మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ఐక్య కార్యాచరణతో ముందుకు సాగాలని, అప్పుడే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని వారు చెప్పారు.

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా ఖమ్మం పట్టణంలోని ఎస్.ఆర్.గార్డెన్‌లో 'వర్తమాన భారతదేశం—వామపక్షాల ముందున్న సవాళ్లు' అనే అంశంపైన సిపిఐ మంగళవారం జాతీయ సదస్సును నిర్వహించింది. సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సిపిఐ (ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబి, సిపిఐ(ఎం.ఎల్) లిబరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఎఐఎఫ్‌బి) జాతీయ ప్రధాన కార్యదర్శి డి.దేవరాజన్, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రసంగించారు. సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి అతిథులకు తరువాయి 3లో

## ప్రజాస్వామ్యానికి సవాళ్లను ఐక్యంగా ఎదుర్కొందాం : భట్టి



ఏనుగు వెంకటేశ్వరరావు

**ఖమ్మం :** ప్రజాస్వామ్యానికి కార్పొరేట్ శక్తులు సరికొత్త సవాళ్లు విసురుతున్నాయని, ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ల చేతిలో బందీగా మారిందని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. మతాన్ని అడ్డుపెట్టుకుని లబ్ధి పొందేందుకు కార్పొరేట్, ఫాసిస్టు శక్తులు ప్రయత్నిస్తున్నాయని ఆయన తెలిపారు. మంగళవారం సిపిఐ ఆధ్వర్యంలో 'వర్తమాన భారతదేశం— వామపక్షాల ముందున్న సవాళ్లు' అనే అంశంపై ఖమ్మం ఎస్ ఆర్ గార్డెన్స్‌లో తరువాయి 2లో

## ఐక్యతపై వామపక్ష నేతలు..

బొమ్మగాని కిరణ్‌కుమార్

**ఖమ్మం :** ఖమ్మంలో జరిగిన సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా మంగళవారం 'వర్తమాన భారతదేశం – వామపక్షాల ముందున్న సవాళ్ళు' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో వామపక్షాల ఐక్యతపై వివిధ పార్టీల నాయకులు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు.

సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా ప్రారంభోపన్యాసం చేస్తూ కమ్యూనిస్టుల ఐక్యత నేటి తక్షణావసరమని, ఐక్యత మరింత బలోపేతం కావాలని అన్నారు. చంద్ర రాజేశ్వరరావు కాలంలోనే కమ్యూనిస్టు ఉద్యమ పునరేకీకరణకు పిలుపునిచ్చారని, హరికిషన్ సింగ్ సూర్జీత్, ప్రకాశ్ కారాత్, ఏచూరి, బేబీ, దీపాంకర్‌లతో నిరంతరం చర్చలు జరుగుతున్నాయని చెప్పారు. దీనిపై మనం మరింత ముందుకు పోవాలన్నారు. వామపక్షాల భవిష్యత్తు ఏమిటని కొందరు ప్రశ్నిస్తుంటారని, వామపక్షాల భవిష్యత్తుతోనే భారతదేశ భవిష్యత్తు ముడిపడి ఉందని తెలిపారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మితవాద బిజెపి ప్రభుత్వాన్ని సాధ్యమైనంత త్వరగా దింపేసేందుకు వామపక్షాలు కలిసి పని చేయాలని, లౌకిక, ప్రజాతంత్ర పార్టీలను ఏకం చేసి, వారిలో మరింత స్పష్టతను తీసుకురావాల్సిన బాధ్యత వామపక్షాలపై ఉందన్నారు.

సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ ప్రసంగిస్తూ వివిధ సమస్యలు, అంశాలపై వామపక్షాల అవగాహనలో ఎలాంటి తేడాలు లేవని, కొంత లోతుగా ఆలోచించినప్పుడు ఏమైనా ఉండవచ్చునని అన్నారు. అయితే, మితవాద ప్రతీఘాత శక్తులకు వ్యతిరేకంగా, కలిసి పోరాటం చేయడంలో అవేవి అడ్డురాబోవని చెప్పారు. మావోయిస్టులతో తమకు తీవ్రమైన రాజకీయ, సైద్ధాంతిక భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, వారిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్మూలిస్తున్న తీరు అనాగరికమైనదని, దానిని తీవ్రంగా వ్యతిరేకించామని తెలిపారు. మితవాద శక్తులపై పోరాటంలో వామపక్షాలు, ప్రజాతంత్ర పార్టీలు స్వంతంగా బలం పెంచుకోవాలని, అది మరింత విస్తరించాలన్నారు. సైద్ధాంతిక అంశాలలో వామపక్షాల మధ్య తేడాలు ఉన్నప్పటికీ, అంశాల విషయంలో ఐక్యంగానే ఉన్నాయన్నారు.

సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య ప్రసంగిస్తూ తాము కూడా సిపిఐ తరహాలోనే దేశవ్యాప్తంగా సంఘటిత కమ్యూనిస్టు ఉద్యమ వందేళ్ళ ఉత్సవాలను ఏడాది పాటు ఘనంగా నిర్వహించామని తెలిపారు. కమ్యూనిస్టు పార్టీలన్నీ ఒకే పార్టీగా ఎందుకు కాకూడదని అంటారని, 1925 తరహాలో 2030 నాటికి ఒకే పార్టీగా అవ్వొచ్చని అన్నారు. ఒకటి అవడం పైనే ఆలోచన చేస్తున్నారని, ఏకమైన తరువాత ఏమి చేయాలనే అంశంపై కూడా ఆలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు. 1925లో సిపిఐ ఆవిర్భావం నాటి పరిస్థితులే నేడు మరోసారి తలెత్తుతున్నాయని, మరోసారి ఫాసిజం, తరువాయి 3లో



## ఖరీఫ్ నాటికి రాష్ట్రమంతా యూరియా యాప్

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన ఈ యాప్‌ను కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ ప్రశంసించిందని వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన యూరియా యాప్‌ను వచ్చే ఖరీఫ్ నాటికి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయనున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన ఈ యాప్‌ను కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ ప్రశంసించిందన్నారు. మంగళవారం సచివాలయంలో వ్యవసాయ, మార్కెటింగ్, కోఆపరేషన్, హార్టికల్చర్ శాఖల పురోగతిపై వ్యవసాయశాఖ కారదర్శి, ఆయా శాఖల డైరెక్టర్లు, ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అమలు చేస్తున్న వ్యవసాయ యాంత్రీకరణ, ప్రకృతి వ్యవసాయం, తెలంగాణ విజన్ 2047 కార్యాచరణ ప్రణాళికలను మరింత సమర్ధవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పథకాలు రైతులకు పూర్తిస్థాయిలో చేరేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో ఆర్గానిక్ పంటలు పండిస్తున్నప్పటికి, మార్కెట్లో నకిలీ ఆర్గానిక్ లేబుల్లతో నకిలీ ఉత్పత్తులు చలామణీలో ఉండడంతో నిజమైన ఆర్గానిక్ పంటలు పండించే రైతులకు నష్టం చేకూరుతుందని , దీనిని నివారించడానికి వ్యవసాయశాఖ ఆర్గానిక్ ఉత్పత్తులకు సర్టిఫికేషన్ ఇచ్చే విధంగా ఒక యాప్ తీసుకురానుందని అన్నారు. ఈ యాప్ ద్వారా కొనుగోలుదారు తాను కొనబోయే ఉత్పత్తి ఎక్కడ, ఏ రైతు, ఎలా పండించాడో తెలుసుకుంటాడని అన్నారు. అదేవిధంగా వ్యవసాయ విశ్వవిద్యాలయాల తరువాయి 2లో

## హెల్త్, అగ్రిటెక్, సైబర్ సెక్యూరిటీ, ఏరోస్పేస్‌లో

# తెలంగాణ స్టార్టప్‌లకు ఇజ్రాయెల్ మద్దతు




ప్రజాపక్షం/హైదరాబాద్

దావోస్‌లో తెలంగాణ రైజింగ్ ప్రతినిధుల బృందం మొదటి రోజున బిజీ బిజీగా గడిపారు. ఇజ్రాయెల్ ఇన్నోవేషన్ అథారిటీ ఛైర్మన్ అలోన్ స్టోపెల్‌తో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. సిఎంతో పాటు మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. వ్యవసాయం, వాతావరణ మార్పులకు సంబంధించిన ఇన్నోవేషన్ స్టార్టప్‌లకు సహకారాలపై విస్తృతంగా చర్చించారు. ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్, డీప్టెక్ ఇన్నోవేషన్ తో పాటు హెల్త్‌టెక్, అగ్రిటెక్, సైబర్ సెక్యూరిటీ, ఏరో స్పేస్ వంటి సాంకేతిక రంగాల్లో తెలంగాణ స్టార్టప్‌లకు ఇజ్రాయెల్ మద్దతు ఇవ్వడంతో పాటు భాగస్వామ్యం పంచుకుంటుంది. ఆర్టిఫిసియల్ ఇంటెలిజెన్స్ సహా పలు రంగాల్లో ఇజ్రాయిలీ స్టార్టప్‌లతో కలిసి తెలంగాణ పైలట్ ప్రోగ్రామ్‌లను ప్రారంభించనుంది.

**ఎఐ రంగంలో రాయల్ ఫిలిప్స్ ఆసక్తి:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) రంగంలో తెలంగాణతో భాగస్వామ్యమయ్యేందుకు ప్రముఖ హెల్త్ టెక్ సంస్థ రాయల్ ఫిలిప్స్ ఆసక్తి వ్యక్తం చూపింది. హైదరాబాద్‌లో నాలెడ్జ్ హబ్ ఏర్పాటు అవకాశాలపై కూడా చర్చించేందుకు ముందుకొచ్చింది. ప్రపంచ ఆర్థిక వేదిక–2026 వార్షిక సమావేశాల్లో భాగంగా స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందం ఫిలిప్స్ గ్లోబల్ నాయకత్వంతో భేటీ అయ్యారు. రాయల్ ఫిలిప్స్ వైస్ ప్రెసిడెంట్ , గ్లోబల్ హెడ్ జాన్ విల్లెమ్– స్కీజ్ గ్రోండ మాట్లాడుతూ.. ఏఐ రంగంలో తెలంగాణ చేపడుతున్న కార్యక్రమాలు తమను ఆకట్టుకున్నాయని చెప్పారు. ముఖ్యంగా ఆరోగ్య రంగంలో తెలంగాణ అమలు చేస్తున్న ఏఐ ఆధారిత సేవలపై ప్రశంసలు కురిపించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన 'తెలంగాణ నెక్స్–జెన్ లైఫ్ సైన్సెస్ తరువాయి 2లో

## ఎఐతో మెరుగైన పౌర సేవలు అందించడమే లక్ష్యం

### ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగం

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ)ను వినియోగించి తెలంగాణ రాష్ట్రంలో పౌర సేవలను మరింత సమర్థవంతంగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఎఫ్) ఆధ్వర్యంలో దావోస్‌లో నిర్వహించిన 'ఇంటెలిజెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫర్ బిల్డింగ్ కంపెటిటివ్‌నెస్' అంశంపై జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ రైతు భరోసా వంటి సబ్సిడీల ట్రాకింగ్ నుంచి మొదలుకుని ఆస్తి తరువాయి 2లో





## సిట్ విచారణలో ఏడు గంటలు

- హరీశ్‌రావును ప్రశ్నించిన దర్యాప్తు అధికారులు
- సిట్ విచారణ ఒక ట్రాష్ అంటూ మాజీ మంత్రి మండిపాటు

ప్రజాపక్షం/హైదరాబాద్

దేశ వ్యాప్తంగా సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో బిఆర్ఎస్ ముఖ్యనేత, మాజీ మంత్రి హరీష్ రావును సిట్ అధికారులు మంగళవారం ఏడు గంటలకుపైగా విచారించారు. జూబ్లీహిల్స్ ఎసిపి కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ప్రారంభమైన విచారణ సాయంత్రం 6.30 గంటల వరకు కొనసాగింది. ఈ సమయంలో బిఆర్ఎస్ నేతలు జూబ్లీహిల్స్ ఎసిపి కార్యాలయం బయట ఆందోళనకు దిగారు. దీంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రోడ్డుపై బైఠాయించిన బిఆర్ఎస్ నేతలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో పోలీసులు వారిని అరెస్టు చేసి అనంతరం స్వంత పూచీకత్తుపై విడుదల చేశారు. సిట్ అధికారులు హరీష్‌రావును ఏడు గంటలకు పైగా పలు ప్రశ్నలు వేసి విచారించారు. పలు కీలక ప్రశ్నలకు హరీష్ రావు చెప్పిన తరువాయి 2లో

## యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు

# ప్రపంచంలోనే ఆదర్శవంతంగా నిలువబోతున్నాయ్

- రూ.200 కోట్ల వ్యయంతో చేపట్టిన పనులు ఈ ఏడాది చివరి నాటికి పూర్తి చేయాలి
- నాణ్యతలో రాజీపడే ప్రసక్తే లేదు
- పాఠశాల నిర్మాణ పనులు నెలకొకసారి తనిఖీ చేస్తా
- దేశ అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులు పోటీపడే విధంగా సిబిఎస్ఇ సెలబస్ అమలు
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



ప్రజాపక్షం/గరిడేపల్లి /హుజూర్‌నగర్

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు ప్రపంచంలోనే ఆదర్శవంతమైన విద్యాసంస్థలుగా నిలవబోతున్నాయని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం తరువాయి 2లో




## మేడారం జాతరకు 4000 ప్రత్యేక బస్సులు

### భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు : మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాపక్షం/హైదరాబాద్

మేడారం జాతరకి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమర్థవంతంగా బస్సుల ఆపరేషన్స్ నిర్వహించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. ఆర్‌టిసి ఉన్నతాధికారులతో సెక్రటేరియట్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. గత మేడారం జాతరలో 3491 తరువాయి 2లో

## ఇక శాంతి గురించి ఆలోచించ!



- అమెరికాకు ఏది మంచిది అనుకుంటే దాని గురించే నిర్ణయం తీసుకుంటా
- నోబెల్ ఇవ్వలేదని నార్వే ప్రధానిపై నోరు పారేసుకున్న ట్రంప్

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ గ్రీన్‌లాండ్ దురాక్రమణ ఆలోచనకు, గత ఏడాది తనకు రాని నోబెల్ బహుమతికి లింకు పెట్టారు. నార్వే ప్రధానమంత్రికి పంపిన సందేశంలో ఆ దేశంపై నిందలు వేశారు. తనకు నోబెల్ బహుమతి రాకుండా చేశారని, అందువల్ల ఇక తాను శాంతి గురించి ఆలోచించాల్సిన అవసరం లేదని, అమెరికా దేశానికి ఏది మంచి అనుకుంటే దాని గురించే ఆలోచించి నిర్ణయాలు తీసుకోవచ్చునని పేర్కొన్నారు. నార్వే దేశ ప్రధానమంత్రి జోనాస్ గహర్ స్టోర్‌కు ట్రంప్ ఒక సందేశం పంపారు. ఆ సందేశంలో నోబెల్ కమిటీ తనకు బహుమతి (2025) ఇవ్వలేదని నిందించారు. అందువల్ల ఇక తాను శాంతి గురించి మాత్రమే ఆలోచించాల్సిన అవసరం లేదని, అమెరికా మంచి చెడ్డల గురించి మాత్రమే ఆలోచిస్తే సరిపోతుందంటూ గ్రీన్‌లాండ్‌ను వ్యూహాత్మకంగా తమదేశం స్వాధీనం చేసుకోవాల్సిన అవసరం ఉందని పునరుద్ఘాటించారు. ఐతే ట్రంప్ వేసిన నిందలకు నార్వే ప్రధానమంత్రి స్టోర్ కూడా దీటుగా సమాధానం చెప్పారు. 2025వ సంవత్సరానికిగాను నోబెల్ బహుమతిని వెనిజులా ప్రతిపక్ష నాయకురాలు మచాడోకు ఇచ్చారని, ఐతే ఈ బహుమతికి నోబెల్ కమిటీ ఆమెను ఎంపిక చేసింది తప్ప, నార్వే ప్రభుత్వం కాదని, అందువల్ల నోబెల్ బహుమతి ట్రంప్‌కు రాకపోవడానికి నార్వే ప్రభుత్వం కారణం కాదని ఆ దేశ ప్రధానమంత్రి స్టోర్ వివరణ ఇచ్చారు. ''ప్రపంచవ్యాప్తంగా తరువాయి 2లో

## యూరియా యాప్ (మొదటి పేజీ తరువాయి)

ఖాళీ ప్రదేశాలలో ఆర్గానిక్ పంటలు పండించి, అక్కడే స్టాల్స్ పెట్టి అమ్మినట్లైతే రైతులు ఆర్గానిక్ పంటలవైపు వెళ్లే అవకాశాలు ఉంటాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా ఇప్పటికే రూ. 50 కోట్లు ఖర్చు చేశామని, మరో రూ.50 కోట్లు ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. రైతులకు కావాల్సిన యంత్రాలు మార్కెట్ ధరలకే లభించేలా, ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ నేరుగా రైతులకు చేరేలా నిబంధనలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. వచ్చే ఖరీఫ్ నాటికి పెద్ద మొత్తంలో యూరియా బఫర్ స్టాక్ ను సిద్ధంగా ఉంచుకోవాలని, భవిష్యత్తులో యూరియా ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని, రైల్వే రేక్ పాయింట్లను కూడా ఎరువుల పంపిణీకి తగ్గట్లుగా ఉండేలా, మరికొన్ని రైల్వే రేక్ పాయింట్లను అదనంగా ఏర్పాటు చేసేవిధంగా రైల్వే అధికారులను కోరాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సన్నాలకు బోనస్ ఇస్తున్నందున, పంటకాలనికి అనుగుణంగా వ్యవసాయశాఖ ద్వారా సన్న వడ్లలో మేలైన వంగడాలను సూచించాలని, రైతులు అట్టి రకాలను ఉత్పత్తి చేసి మంచిధర పొందేటట్లు చూడాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన అన్ని శాఖల డిపాజిట్లు ప్రైవేట్ కమర్షియల్ బ్యాంకులలో కాకుండా కోఆపరేటివ్, అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకులలో చేసేలా చూడాలని అధికారులను సూచించారు. అందుకోసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి లేఖ రాయాలని అధికారులను ఆదేశించారు. ఆయిల్ పై దిగుమతి సుంకాన్ని 44 శాతానికి పెంచేలా కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.రాష్ట్ర అవసరాల కోసం కూరగాయలను ఇతర రాష్ట్రాల నుండి దిగుమతి చేసుకునే పరిస్థితి మారాలని, ఇందుకు డిమాండ్ కు తగ్గట్లుగా కూరగాయల సాగును ప్రోత్సహించాలని సూచించారు. రైతు వేదికల దగ్గర సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఇప్పటికే ప్రయోగాత్మకంగా రెండు రైతువేదికలలో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయగా, నెలకు 400 యూనిట్ల వరకు మిగులు కరెంట్ ఉత్పత్తి అవుతుందని అన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి, ఉద్యానవన శాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా, హెచ్‌ఏసిఏ ఎండి చంద్రశేఖర్ రెడ్డి, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీ బాయి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ప్రత్యేక బస్సులు (మొదటి పేజీ తరువాయి)

ఆర్టీసీ బస్సులు నడిపించగా 16.82 లక్షల మంది ప్రయాణికులు ప్రయాణించగా, ఈ ఏడాది 20 లక్షల మంది ప్రయాణించవచ్చన్న అంచనా తో 4వేల బస్సులను నడిపిస్తున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. అయితే ప్రధానంగా మేడారం వెళ్లే రూట్లలో వరంగల్ ,హనుమకొండ , ఖమ్మం, కరీంనగర్ రూట్లలో రద్దీ ఎక్కువగా ఉండనుండడంతో రద్దీకి తగిన విధంగా బస్సులు నడపనున్నట్లు సూచించారు. మేడారం లో ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్ స్టాప్ లో క్యాబిన్ ల వద్ద ప్రయాణికులకు జిల్లాల వారిగా వెళ్లే బస్సుల డిస్ప్లే అయ్యేలా చూడాలని అక్కడ పోలీసులతో సమన్వయం చేసుకుంటూ సమర్థవంతంగా పని చేయాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు.

**అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి :** జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో పెద్ద ఎత్తున రోడ్డు ప్రమాదాలు తగ్గించడానికి జరుగుతున్న అవగాహన కార్యక్రమాల్లో భాగంగా మేడారం వచ్చే భక్తులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించేలా హోర్డింగ్లు, బస్ స్టేషన్లలో, బస్సుల్లో టీవీ ల ద్వారా ప్రచారాలు నిర్వహించాలని సూచించారు..ఆర్టీసీ లో పెండింగ్ పనులు బస్ స్టేషన్ ల అభివృద్ధి పనుల పురోగతి పై ఆరా తీసిన మంత్రి. పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. హైదరాబాద్ నగరంలో రాబోయే కాలంలో పూర్తిస్థాయిలో ఈవి బస్సులు రానుండడంతో అందుకు తగిన విధంగా మౌలిక సదుపాయాలు, ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇప్పుడున్న జెబిఎస్ , ఎంజిబిఎస్ మాదిరి నగరంలో మరిన్ని బస్ టెర్మినల్ రావాల్సిన అవసరముందని దానిని స్టడీ చేయాలని ఆర్టీసీ కి సంబంధించిన భూ బదలాయింపు పై జిల్లా కలెక్టర్ల తో మాట్లాడాలని సూచించారు.. విజన్ 2047 లో ఆర్టీసీ లక్ష్యానికి అనుగుణంగా ఇప్పుడున్న బస్సుల సంఖ్యను మరింత పెంచడం , ఉద్యోగుల సంఖ్యను పెంచడం తదితర వాటిపై కార్యాచరణ తో ముందుకు పోవాలని ఆదేశించారు. మహా లక్ష్మీ ద్వారా 90 కి పైగా డిపోలు లాభాల బాటలో ఉన్నప్పటికీ మిగిలిన డిపో లు నష్టానికి గల కారణాలపై అధ్యయనం చేసి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.సమీక్షా సమావేశంలో స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్, ఆర్టిసి ఎండి నాగిరెడ్డి, ఈడిలు , ఆర్ఎంలు ,ఇతర ఆర్టిసి అధికారులు పాల్గొన్నారు.

## ఏడు గంటలు (మొదటి పేజీ తరువాయి)

జవాబులను సిట్ అధికారులు వీడియో రికార్డు చేశారు. సిట్ అధికారులు అడిగిన మరికొన్ని ప్రశ్నలకు హరీష్‌రావు జవాబు చెప్పకుండా దాటవేసినట్లు సమాచారం. ఇదే కేసులో గతంలో సిట్ అధికారుల విచారణలో నిందితులు వెల్లడించిన అంశాలను నివృత్తి చేసుకునే క్రమంలో హరీష్‌రావును ప్రశ్నించినట్లు సమాచారం. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎవరెవరి ఫోన్‌లు రికార్డు చేసేందుకు హరీష్ రావు ఏమైనా ప్రతిపక్ష నేతల ఫోన్ నెంబర్లు ఇచ్చాడా అనే అంశంపై కూడా సిట్ అధికారులు కూపీ లాగినట్లు తెలిసింది. ముఖ్యంగా శాసనసభ ఎన్నికలకు ముందు ఫోన్ ట్యాపింగ్ చేస్తున్న విషయం హరీష్‌రావుకు తెలిసిందా, దీని వెనుక ఎవరెవరి హస్తం ఉందనే పలు ప్రశ్నలను సిట్ అధికారుల సందించినట్లు తెలిసింది. అలాగే హరీష్‌రావు ఫోన్ నుంచి ఆ సమయంలో ఎవరెవరికి ఫోన్‌లు వెళ్లాయి, ఈ కేసులో ఉన్న నిందితులు పోలీసు అధికారులైన భుజంగరావు, ప్రభాకర్‌రావు, తిరుపతన్న, ప్రణీత్‌రావు, రాధాకిషన్‌రావులకు ఫోన్‌లు చేశారా అనే విషయంపై ఆరా తీసినట్లు తెలిసింది.హరీష్‌రావు డ్రైవర్, పిఎలకు సంబంధించిన ఫోన్ కాల్ లీస్టులో ఉన్న నెంబర్‌లపై కూడా ప్రశ్నించినట్లు తెలిసింది.

**సిట్ విచారణ ఒక 'ట్రాష్' – హరీశ్ రావు నిప్పులు :** సిట్ విచారణ అంతా సొల్లు పురాణమని బిఆర్ఎస్ ఎల్పి ఉపనేత హరీశ్ రావు అన్నారు. సిట్ విచారణ ముగిసిన అనంతరం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తనను రాజకీయంగా వేధించేందుకే ఇలాంటి 'లట్టు పొట్టు' సిట్‌లతో వేస్తోందన్నారు. సిట్ అధికారుల విచారణ తీరును హరీశ్ రావు ఎద్దేవా చేశారు. 'విచారణలో కొత్తగా ఏమీ లేదు, అడిగిందే మళ్లీ మళ్లీ అడిగారు. మధ్యలో అధికారులకు బయటి నుంచి ఫోన్లు రావడం, వారు బయటకు వెళ్లి చర్చించుకుని రావడం చూస్తుంటే రేవంత్ రెడ్డి లేదా సజ్జనార్ నుంచి ఆదేశాలు అందుతున్నట్లు అర్థమవుతోంది' అని విమర్శించారు. తనపై గతంలో పెట్టిన ప్రైవేటు కేసులను సుప్రీంకోర్టు, హైకోర్టు కొట్టివేసినా, మళ్లీ అదే అంశంపై విచారణ పేరిట కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బామ్మర్దికి సంబంధించిన బొగ్గు కుంభకోణాన్ని ఉదయం బయటపెట్టినందుకే, సాయంత్రానికి తనకు నోటీసులు ఇచ్చారని హరీశ్ రావు ఆరోపించారు. 'రింగ్ కింగ్ మీ బామ్మర్దే. నీకు దమ్ముంటే, నువ్వు తప్పు చేయకపోతే హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించు. అన్ని ఆధారాలు ఇచ్చేందుకు మేము సిద్ధంగా ఉన్నాం' అని సవాల్ విసిరారు.

## ఆలోచించ


(మొదటి పేజీ తరువాయి)

ఎనిమిది యుద్ధాలు ఆపినందుకుగాను నార్వే దేశం నాకు నోబెల్ బహుమతి ఇవ్వలేదు, అందువల్ల ఇకమీదట నేను శాంతి గురించి మాత్రమే ఆలోచించాల్సిన బాధ్యత నాకు ఉండదు, ఐనప్పటికీ కూడా నా అజెండాలో అది ప్రధానాంశంగానే ఉంటుంది, కానీ అమెరికా దేశానికి ఏది ముఖ్యమో అదే చేస్తాను, ఆ నిర్ణయాలే తీసుకుంటాను'' అని నార్వే ప్రధానమంత్రికి ట్రంప్ ఒక సందేశం పంపిస్తూ, ''గ్రీన్‌లాండ్‌ను మనం స్వాధీనం చేసుకోకపోతే, ప్రపంచం సురక్షితంగా ఉండదు'' అని కూడా చివర తన సందేశంలో రాశారు. ట్రంప్ పెట్టిన ఈ సందేశానికి నార్వే ప్రధానమంత్రి సమాధానం చెబుతూ, ''గ్రీన్‌లాండ్‌పై పది శాతం సుంకాలు విధించినందుకు మా దేశం నిరసన తెలియజేసింది. కానీ అదే సమయంలో ఫోన్ ద్వారా త్రైపాక్షిక సంభాషణలను కూడా ప్రతిపాదించింది'' అని గుర్తుచేశారు. నోబెల్ శాంతి బహుమతి కావాలన్న తన కోరికను ట్రంప్ రహస్యంగా తనలో మాత్రమే దాచుకోకుండా పదే పదే దాని గురించి ప్రకటనలు చేశారు. అదేవిధంగా గ్రీన్‌లాండ్ దీవిని అమెరికా రక్షణ ప్రయోజనాల నిమిత్తం ఆక్రమించాల్సిన అవసరం ఉందని ఆయన పదే పదే చెబుతూ వస్తున్నారు. అమెరికా రక్షణ నిమిత్తం గ్రీన్‌లాండ్‌లో శక్తిమంతమైన ఆయుధాలను మోహరించాల్సిన అవసరం ఉందని, అలా మోహరిస్తే, శత్రువు అమెరికా దగ్గరకు రాకముందే హెచ్చరికలు వస్తాయని, అందువల్ల అనివార్యంగా గ్రీన్‌లాండ్ దీవిని కొనుగోలు చేస్తామని ట్రంప్ వాదిస్తున్నారు. ఒకవేళ గ్రీన్‌లాండ్ దీవిని అమెరికాకు విక్రయించకపోతే, దానికి ఆక్రమించేందుకు సైనిక చర్య తీసుకోవడానికి కూడా తమదేశం వెనుకాడదని ఆయన బాహాటంగానే హెచ్చరికలు చేస్తున్నారు.

# స్వతంత్ర యూరప్ నిర్మాణానికి ఇదే తరుణం

## యూరోపియన్ కమిషన్ ఛైర్మన్ ఉర్సులా పిలుపు

**దావోస్:** అమెరికాపై ఆధారపడకుండా ఒక స్వతంత్ర యూరప్‌ను నిర్మించుకోవడానికి ఇదే సరైన తరుణమని యూరోపియన్ కమిషన్ ఛైర్మన్ ఉర్సులా వోండర్ లేయన్ దావోస్ ప్రపంచ ఆర్థిక వేదికపై పిలుపు ఇచ్చారు. ప్రాదేశిక భౌగోళిక రాజకీయాల్లో ఎదురవుతున్న దిగ్భ్రాంతికర ఘటనలు అనివార్యంగా యూరప్‌కు ఒక అవకాశమని అన్నారు. ''సమకాలీన ప్రపంచం చూస్తున్న భౌగోళిక రాజకీయ ప్రకంపనలు స్వంతంత్ర యూరప్ నిర్మాణానికి ఒక మంచి అవకాశం, ఇది కొత్త విషయం కాదు, పైగా ఇటీవల జరుగుతున్న పరిణామాలకు ప్రతిస్పందన అంతకన్నా కాదు, ఇది ఒక అవసరం, చాలాకాలంనాటి వ్యవస్థాగత యూరప్ నిర్మాణ అత్యవసరానికి ఇదే సరైన తరుణం'' అన్నారు. ఈ మార్పు శాశ్వతమైతే, యూరప్ కూడా ఈ రూపంలో అనివార్యంగా శాశ్వతం కావాలన్నారు. మెర్కోసర్ ఒప్పందం, చైనాతో వాణిజ్య సంబంధాలు, స్వతంత్రంగా సైనిక బలగాలను, సైనిక వ్యవస్థను పటిష్టం చేసుకోవడానికి యూరప్ ఆలోచనలు, ప్రయత్నాలు ఇటీవలికాలంలో వేగం పుంజుకున్నాయి.





**డెన్మార్క్–గ్రీన్‌లాండ్‌లతో చేయి చేయి కలిపి పనిచేస్తాం**

ఆర్కిటిక్ ప్రాంత రక్షణకోసం డెన్మార్క్, గ్రీన్‌లాండ్‌లతో చేయి చేయి కలిపి యూరోపియన్ యూనియన్ పనిచేస్తుందని యూరోపియన్ కమిషన్ ఛైర్మన్ ఉర్సులా వోండర్ లేయన్ దావోస్ వేదికపై చెప్పారు. గ్రీన్‌లాండ్‌కోసం ఆ దేశ ప్రజలు చేస్తున్న వాదనను ఆమె బాహాటంగా సమర్థించారు. గ్రీన్‌లాండ్ దురాక్రమణను ఎదిరించిన దేశాలపై పదిశాతం సుంకాలు విధిస్తామని ట్రంప్ చెప్పడం అతిపెద్ద తప్పిదమని ఆమె ఉద్ఘాటించారు. డెన్మార్క్,గ్రీన్‌లాండ్‌లకు యూరోపియన్ యూనియన్ పూర్తి సంఘీభావాన్ని ప్రకటిస్తోందన్నారు. గ్రీన్‌లాండ్ సార్వభౌమాధికారంపై చర్చకు ఎలాంటి అవకాశం లేదని, వారి సార్వభౌమాధికారం తిరుగులేనిది, చెక్కు చెదరనిదన్నారు. వారి ఆర్థిక వ్యవస్థకు, మౌలిక సదుపాయాలకు ఉత్తమస్థాయిలో మద్దతు ఇచ్చేందుకు వారితో కలిసి పనిచేస్తామన్నారు. విస్తారమైన ఆర్కిటిక్ భద్రతకోసం అమెరికాతో కలిసి పనిచేస్తామన్నారు. ఆర్కిటిక్ భద్రతకోసం తమ రక్షణ బడ్జెట్‌ను భారీగా పెంచుతామన్నారు. ఇవన్నీ తమ ఉమ్మడి ప్రయోజనాలని కూడా ఆమె చెప్పారు. కెనడా,నార్వే, బ్రిటన్ సహా యూరోపియన్ భాగస్వాములమధ్య ఉమ్మడి భద్రత ముఖ్యమైన విషయమన్నారు. యూరప్‌కు సరికొత్త భద్రతా వ్యవస్థ నిర్మాణం ముఖ్యమని తాను నమ్ముతున్నానన్నారు. యూరప్–అమెరికా మధ్య గత ఏడాది జులైలో జరిగిన వాణిజ్య ఒప్పందాన్ని కేవలం ఒక ఒప్పందం మాత్రమేనన్నారు. ఐతే గ్రీన్‌లాండ్ విషయంలో మిత్రులందరూ వెనక్కు లాగుతున్నందువల్ల మీ వైఖరిలో మార్పు ఉందా? అని పాత్రికేయులు ప్రశ్నించినప్పుడు ట్రంప్ స్పందిస్తూ, గ్రీన్‌లాండ్ అమెరికాకు కావాలి, ఈ విషయంలో వెనక్కు తగ్గేదేలేదు, దానిని ఎవరూ రక్షించలేరు, నయానో, భయానో ఆ దీవిని తమ స్వాధీనంలోకి తెచ్చుకుంటాం అని మరోసారి ఉద్ఘాటించారు.

# గ్రీన్‌లాండ్‌పై వెనక్కు తగ్గేదే లేదు: ట్రంప్

## దావోస్ వేదికపై చెబుతా

**వాషింగ్టన్:** దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదికపై ప్రసంగించేందుకు వెళుతున్నానని, ఆ వేదికపై నుండే గ్రీన్‌లాండ్ అమెరికా అధీనంలో ఉండాల్సిన ఆవశ్యకతను ప్రపంచదేశాలకు గట్టిగా చాటి చెబుతానని డోనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియా వేదికగా చెప్పారు. గ్రీన్‌లాండ్ విషయంలో వెనక్కు తగ్గే ప్రశ్నే లేదని అన్నారు. ఈ విషయం దావోస్ వేదికపై ప్రకటిస్తానన్నారు. అమెరికా భద్రతకు గ్రీన్‌లాండ్ చాలా ముఖ్యమైనది, గ్రీన్‌లాండ్‌లో అమెరికా కీలక సైనిక స్థావరం ఉంటే అది శత్రువును అరికట్టేందుకు సైరన్‌లా ముందస్తు హెచ్చరికలకు దోహదం చేస్తుందన్నారు.రాయిటర్స్ వార్తాసంస్థ చెప్పిన సమాచారం ప్రకారం ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ తన సందేశంలో, ''అసలు గ్రీన్‌లాండ్ విషయంలో మీరు ఏం చేద్దాం అనుకుంటున్నారో మాకు అర్థం కావడంలేదు, దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశం తర్వాత ఈ వారంలోనే జి–7 సమావేశం ఏర్పాటు చేయండి'' అని మేక్రాన్ కోరారు. ట్రంప్‌కు మేక్రాన్ పంపిన సందేశం స్క్రీన్ షాట్‌ను సోషల్ మీడియా ద్వారా ఆయన షేర్ చేశారు. గాజా శాంతి మండలం (గాజా బోర్డు)లో చేరాలని ట్రంప్ ఇచ్చిన ఆహ్వానాన్ని మేక్రాన్ తిరస్కరించడంతో ఫ్రాన్స్‌పై 200 శాతం సుంకాలు విధిస్తానని ట్రంప్ బెదిరించారు. దీనిని కూడా మేక్రాన్ తిరస్కరించారు.




ఈ నేపథ్యంలో గ్రీన్‌లాండ్‌పై వెనక్కు తగ్గేదే లేదని ట్రంప్ చెప్పడంతో యూరప్ అంతటా మళ్లీ గందరగోళం రేగింది. దౌత్యకార్యకలాపాలు, పరస్పర ప్రకటనలు ఉద్ధృతమయ్యాయి. ట్రంప్ టారిఫ్‌లు అన్యాయం, అసంబద్ధమైనవని డెన్మార్క్ మంత్రులు విమర్శించగా,యూరోపియన్ కమిషన్ ఛైర్మన్ ఉర్సులా కూడా ఈ టారిఫ్‌లు అతిపెద్ద తప్పిదమని విమర్శించారు. ఇదేసమయంలో దావోస్ ఆర్థిక వేదిక సమావేశాలకు వెళ్ళిన అమెరికా కోశాధికారి స్కాట్ బెస్సెంట్ కూడా స్పందిస్తూ, గ్రీన్‌లాండ్‌పై వివాదం జరుగుతున్నప్పటికీ అమెరికా, యూరప్ మధ్య అసాధారణమైన మైత్రి కొనసాగుతోందన్నారు. ఒక్క నిమిషం గుండెనిండుగా గాలి పీల్చుకుని యూరప్ నాయకులు ప్రశాంతంగా ఆలోచించాలని కోరారు.

# ఛాగోస్ దీవులను మారిషస్‌కు ఇవ్వడం బ్రిటన్ తెలివితక్కువ పని : ట్రంప్ విమర్శ



**వాషింగ్టన్ :** హిందూమహాసముద్రంలో బ్రిటన్–అమెరికా వైమానిక స్థావరం ఉన్న డియెగో గార్సియాతో సహా ఛాగోస్ (60 గొలుసుకట్టు దీవులు) దీవులపై ఆధిపత్యాన్ని ఎలాంటి కారణం లేకుండా వదులుకుని ఆ సార్వభౌమాధికారాన్ని మారిషస్‌కు స్వాధీనం చేయడం ''బ్రిటన్ చేసిన అతిపెద్ద తెలివి తక్కువ పని'' అని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియా వేదికగా ధ్వజమెత్తారు. ఐతే దీనిపై బ్రిటన్ వెంటనే తీవ్రంగా స్పందించింది. ఛాగోస్ దీవులపై సార్వభౌమాధికారాన్ని వదులుకోవడం తప్పుకాదని బ్రిటన్ ప్రభుత్వం తనను తాను సమర్థించుకుంది. ఐతే గత ఏడాది బ్రిటన్ చర్యకు ట్రంప్ మద్దతు ఇవ్వడం గమనార్హం. గ్రీన్‌లాండ్ వివాదం నేపథ్యంలో ట్రంప్ మాట మార్చి పైవిధంగా స్పందించారు. అలాంటి తెలివితక్కువ పని (మారిషస్‌కు ఛాగోస్ దీవుల స్వాధీనం) గ్రీన్‌లాండ్ విషయంలో తాను చేయనని అన్నారు. శత్రువులను అదుపుచేసే విషయంలో డెన్మార్క్,గ్రీన్‌లాండ్ తెలివిగా వ్యవహరించాలని ట్రంప్ కోరారు. 1814లోకుదిరిన ఒప్పందం ప్రకారం ఫ్రాన్స్‌దేశం ఈ 60 గొలుసుకట్టు దీవుల సమూహాన్ని బ్రిటన్‌కు అప్పటించింది. గత ఏడాది మారిషస్‌తో బ్రిటన్ చేసుకున్న ఒప్పందం ప్రకారం ఛాగోస్ దీవులను స్వాధీనం చేసింది. ఈ విధంగా మొత్తం దీవులను వదులుకోవడం అతిపెద్ద తెలివితక్కువ పని అని ట్రంప్ ధ్వజమెత్తారు. ఐతే డియెగో గార్సియాలో బ్రిటన్–అమెరికాలకు చెందిన ఉమ్మడి వైమానికదళ,సైనికస్థావరం ఉంది. కానీ మొత్తం దీవులను మన దగ్గరే ఉంచుకుంటే హిందూమహాసముద్రంలో పెత్తనం మనకే ఉండేదన్నది ట్రంప్ వాదన. ఛాగోస్ దీవుల విషయంలో బ్రిటన్ తరహాలో తాను తెలివి తక్కువ పనులు చేయనని, అందుకే గ్రీన్‌లాండ్ దీవిని స్వాయత్తం చేసుకునేందుకు అమెరికా గట్టి ప్రయత్నాలు చేస్తోందని ట్రంప్ అసలు విషయం చెప్పారు. తమ ప్రమేయం లేకుండా ఈ దీవులపై అమెరికాకు పెత్తనం ఇస్తున్నారని మారిషస్ చాలా కాలంగా అల్లరిపెడుతోంది. ఈ అల్లరి వెనుక చైనా హస్తం ఉందని ట్రంప్ బలంగా నమ్ముతున్నారు. ఐతే ట్రంప్ చెప్పినట్టు డియెగో గార్సియా దీవిలో సైనికస్థావరంపై మాత్రమే పెత్తనం కొనసాగేలా మారిషస్‌తో బ్రిటన్ ఒప్పందం చేసుకుందన్నది ముఖ్యసమాచారం. డియెగో గార్సియా దీవిని తన వద్దనే 99 సంవత్సరాలపాటు ఉంచుకున్నందుకుగాను ప్రతి సంవత్సరం మారిషస్‌కు 101 మిలియన్ పౌండ్లు బ్రిటన్ చెల్లించాల్సి ఉంటుంది. ఐతే బ్రిటన్ కొత్తగా చేసిన ప్రకటన ప్రకారం ఈ దీవుల్లో స్థానిక కోర్టు తీర్పుల ప్రకారం బ్రిటన్–అమెరికా సైనిక స్థావరం ఉనికి చిక్కుల్లో పడింది. దీంతో ఇప్పుడు ట్రంప్ బ్రిటన్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నారు. చైనా,రష్యా దేశాలు బలహీన చర్యలను బాగా గమనిస్తాయి, ఆ రెండు దేశాలూ బలాన్ని అంచనావేస్తాయి, వాటిని గుర్తిస్తాయి, అందుకే నేను అధికారంలోకి వచ్చాక అమెరికాకు గుర్తింపు వచ్చింది, అమెరికా బలోపేతమైంది, మరింత ఎక్కువ గౌరవం సంపాదించింది అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

## ఐక్యంగా ఎదుర్కొందాం (మొదటి పేజీ తరువాయి)

జరిగిన సెమినార్‌లో భట్టి విక్రమార్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని బిజెపి నేతృత్వంలోని మతతత్వ శక్తులు నిర్వీర్యం చేస్తున్నాయని, ఆర్థిక సామాజిక అంశాలను పక్కదారి పట్టిస్తున్నాయన్నారు. లౌకిక ప్రజాతంత్ర శక్తుల ఐక్యతతోనే మతతత్వ శక్తులను అడ్డుకోగలమని ఆయన స్పష్టం చేశారు. దేశంలో మారిన పరిస్థితులకు అనుగుణంగా వామపక్షాలు ఐక్యంగా కదలాలని, మార్క్స్ చెప్పినట్లుగా వర్గ పోరాటాల ద్వారానే సమసమాజం నిర్మితమవుతుందని మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. భారతదేశంలో ప్రస్తుతం పార్లమెంటరీ వ్యవస్థ ప్రశ్నార్థకమైందని, ఒక పక్క ఫాసిస్టు శక్తులు, మరోపక్క కార్పొరేట్‌లు ఈ దేశాన్ని చిన్నాభిన్నం చేయాలని ప్రత్నిస్తున్నాయని ఇటువంటి సమయంలో వామపక్షాలు బలపడటం ఈ దేశానికి అవసరమన్నారు. ఖమ్మం జిల్లా అనేక భావజాలాకు నిలయంగా ఉందని అదే సమయంలో అతిథ్యం అందించడంలో ఖమ్మం ముందు వరుసలో ఉంటుందని, ఖమ్మంలో జాతీయ స్థాయి సెమినార్ నిర్వహించడం వామపక్ష జాతీయ నేతలు హాజరుకావడం సంతోషకరమన్నారు. వందేళ్ల సిపిఐ చరిత్రలో ఎన్నో అటుపోట్లు ఉన్నాయని విక్రమార్క తెలిపారు. ఈ దేశానికి స్వాతంత్ర్యం సాధించడంలో సిపిఐ ప్రముఖ భూమిక పోషించిందని ఆయన తెలిపారు. 1947లో ఈ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని తెలంగాణ ప్రాంతానికి స్వాతంత్ర్యం రాలేదని ఇక్కడి నిజాం రాజును కూల్చడానికి కమ్యూనిస్టులు సాయుధ పోరాటం చేశారని ఆ పోరాటం ప్రపంచ చరిత్రలో నిలిచిపోయిందన్నారు. తెలంగాణలో భూమి కోసం భుక్తి కోసం పేదల విముక్తి కోసం పోరాడడంతో పాటు దున్నేవానికే భూమి దక్కాలని కమ్యూనిస్టులు పోరాడారని, మహోత్తర పోరాటాలతో విలసిల్లిన నేల తెలంగాణ అని ఆయన తెలిపారు. ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాల్లో ఏ ఇంటి తలుపు తట్టిన ఒక వీరగాథ వినిపిస్తుందన్నారు. కమ్యూనిస్టుల పోరాట ఫలితంగానే కాంగ్రెస్ పార్టీ కౌలుదారి చట్టాన్ని, భూ సంస్కరణ చట్టాన్ని, 20 సూత్రాల ఆర్థిక పథకాన్ని , బ్యాంకుల జాతీయ కరణతో పాటు ఇటీవల కాలంలో సమాచార హక్కు చట్టం, జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కూడా కాంగ్రెస్ తీసుకు వచ్చిందన్నారు. రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య రక్షణ కర్తవ్యాలుగా వామపక్షాలు ఇతర లౌకిక శక్తులు కలిసి పనిచేయాలన్నారు. ఇప్పటికే హక్కులు హరించబడుతున్నాయని, ఓటు హక్కు సైతం ప్రమాదంలో పడిందని ఆయన తెలిపారు. ఈ దేశంలో కాంగ్రెస్, వామపక్షాలు కలిసి సుదీర్ఘకాలం పయనించాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా కార్యాచరణ చేపట్టాలని విక్రమార్క తెలిపారు. ఈ సందర్భంగా వందేళ్ల సిపిఐ సిడిని భట్టి విక్రమార్క ఆవిష్కరించారు.

## నిలువబోతున్నాయ్ (మొదటి పేజీ తరువాయి)

సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండ లం గడ్డిపల్లి గ్రామం సమీపంలో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణ పనులను తనిఖీ చేశారు. గడ్డిపల్లిలో రూ.200 కోట్ల వ్యయంతో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలు ఈ సంవత్సరం చివరి నాటికి పూర్తి చేయాలని మంత్రి ఇంజనీరింగ్ శాఖ అధికారులకు అదేశించారు. 5లక్షల 36వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో 2500 మంది విద్యార్థులకు విద్యతో పాటు వసతి కల్పించే విధంగా అన్ని హంగులతో పాఠశాల భవనాలు, హాస్టళ్లు, స్టాఫ్ క్వార్టర్స్‌తో ఈ పాఠశాలను నిర్మిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలలో దేశ అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులు పోటీపడే విధంగా ఇంగ్లీష్ మీడియంతో పాటు సిబిఎస్ఈ సిలబస్‌ను ఈ పాఠశాలల్లో అమలు చేయనున్నట్లు వెల్లడించారు. గడ్డిపల్లి గ్రామానికి ఇంతమంచి విద్యాసంస్థ రావడం గర్వకారణమన్నారు. భవన నిర్మాణం వేగవంతం చేయడంతో పాటు నాణ్యత ఉండేలా చూసుకోవాలని, నాణ్యతలో రాజీపడే ప్రసక్తే లేదని తాను నెలకొకసారి పాఠశాల నిర్మాణ పనులు తనిఖీ చేస్తానని, పాఠశాల నిర్మాణానికి అవసరమైన ఇసుక, బిల్స్ సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానని మంత్రి వెల్లడించారు. గడ్డిపల్లి వద్ద నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ నిర్మాణ పాఠశాల నిర్వహనపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని రాష్ట్ర విద్య మౌలిక సదుపాయల సంస్థ నుండి గణపతిరెడ్డిని ఆయన కోరారు. ఈ పాఠశాల నిర్మాణంలో భాగంగా రూ.20 కోట్లతో మంజూరు చేసిన బిటి డబుల్ రోడ్డును వేసవిలోగా పూర్తి చేయాల్సిందిగా ఇంజనీరింగ్ అధికారులను అదేశించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్, జిల్లా ఎస్‌పి కె.నర్సింహా, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బాలప్రసాద్, ఆర్‌అండ్‌బి అధికారులు ఈఈ సీతరామయ్య, ఆర్డీవో శ్రీనివాసులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

**పేదల జీవితాల్లో వెలుగు నింపడమే ప్రభుత్వ ధ్యేయం**

మహిళల జీవితాల్లో ప్రత్యేకించి పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని అందులో భాగంగానే వడ్డీలేని రుణాల పంపిణీ ఇస్తున్నట్లు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మున్సిపల్ ఆవరణలో నేరేడుచర్ల మున్సిపల్ పరిధిలోని 404 స్వయం సహాయక మహిళ సంఘాలకు 52,07,399 రూపాయలు వడ్డీలేని రుణాల చెక్కులను మంత్రి పంపిణీ చేశారు.

అలాగే ఇందిర మహిళ శక్తి పథకం కింద 5498 మహిళలకు ఇందిరమ్మ చీరెలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ప్రజా జీవితంలో తప్పసులా ముందుకెళ్తున్నానని నేరేడుచర్ల మున్సిపాలిటి పరిధిలో వడ్డీలేని రుణాల పంపిణీతో పాటు 5498 మందికి ఇందిరమ్మ చీరెలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, జిల్లా ఎస్‌పి కె.నర్సింహా, మార్కెట్ కమిటి చైర్మన్ బెల్లంకొండ విజయలక్ష్మి , వైస్ చైర్మన్ సురేష్ రెడ్డి, ఆర్డీవో శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ అశోక్‌రెడ్డి, మోప్మా సిబ్బంది పాల్గొన్నారు.

## లక్ష్యం (మొదటి పేజీ తరువాయి)

పన్ను వసూళ్లు, మహిళలకు అందించే సంక్షేమ పథకాల అమలు, పట్టణ మున్సిపల్ సమస్యల పరిష్కారం వరకు అనేక రంగాల్లో ఏఐ ఆధారిత పరిష్కారాలను తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తోందని వివరించారు. వ్యవస్థలోని మేధస్సే ఒక వైపు సమస్యగా, మరోవైపు పరిష్కారంగా మారుతోందని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఏఐని సరైన దిశలో వినియోగిస్తే పాలన మరింత సమర్థవంతంగా మారుతుందని అన్నారు. అదునాతన ఏఐ యుగంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా ఉండలేవని, ముందస్తు చర్యలు తీసుకోవడం, వేగంగా నిర్ణయాలు అమలు చేయడమే కీలకమని ఏఐ ప్రభావం గురించి మాట్లాడారు. ఈ సమావేశంలో ఈజిప్ట్ పెట్టుబడులు, విదేశీ వాణిజ్య మంత్రి హస్సన్ ఎల్కహతీబ్, ఎమరాల్ ఏఐ సిఈఓ వరుణ్ శివరామ్, ప్రపంచ మేధోసంపత్తి సంస్థ (డబ్ల్యుపిఓ) డైరెక్టర్ జనరల్ డారెన్ టాంగ్, జర్మనీ డిజిటల్ మంత్రిత్వ శాఖ మంత్రి కార్ స్టెన్ వైల్ బెర్గర్, నోకియా సిఈఓ జస్టిన్ హోటార్డ్, హిటాచి సిఈఓ తోషియాకి టోకునాగా సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## ఇజ్రాయిల్ మద్దతు

(మొదటి పేజీ తరువాయి)

పాలసీ 2026–2030' గురించి ప్రతినిధి బృందం వివరించింది. 2030 నాటికి 250 బిలియన్ డాలర్ల లైఫ్ సైన్సెస్ ఆర్థిక వ్యవస్థ నిర్మించడమే ఈ విధాన లక్ష్యమని, మెడికల్ ఎలక్ట్రానిక్స్ సహా అనుబంధ రంగాలకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని తెలిపారు.సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఔషధ తయారీ, పరిశోధనాభివృద్ధి (ఆర్ డి) రంగాల్లో ప్రపంచ స్థాయి, స్థిరమైన పారిశ్రామిక క్లస్టర్‌ను తెలంగాణలో నిర్మిస్తున్నామని చెప్పారు. 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌లో భాగంగా ఔటర్ రింగ్ రోడ్ (ఒఆర్ఆర్) , రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) మధ్యనున్న ప్రాంతంలో పెరి–అర్బన్ రీజియన్ ఎకానమీ (పుర్) తయారీ, లాజిస్టిక్స్ కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ కొత్త లైఫ్ సైన్సెస్ విధానం, ఔషధ తయారీ వ్యూహాలు కలిసి తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు పునాది వేస్తాయని చెప్పారు. తెలంగాణలో ఇప్పటికే 2,000కు పైగా లైఫ్ సైన్సెస్ సంస్థలు, బలమైన ఐటి–లైఫ్ సైన్సెస్–హెల్త్ కేర్ టాలెంట్ బేస్, జీనోమ్ వ్యాలీ, 300 ఎకరాలకుపైగా విస్తరించిన మెడికల్ డివైసెస్, మెడికల్ ఎలక్ట్రానిక్స్ పార్క్ ఉన్నాయని మంత్రి వివరించారు. హైదరాబాద్ వైద్య పర్యాటకానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని, ఇక్కడి ఆస్పత్రులు ఇప్పటికే క్రిటికల్ కేర్, అంబులెన్స్ సేవలు వంటి రంగాల్లో ఏఐను సమర్థవంతంగా వినియోగిస్తున్నాయని చెప్పారు. భవిష్యత్తులో హైదరాబాద్‌ను ఏఐకు కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఏఐ సిటీని నిర్మిస్తున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఇదే సరైన సమయం. హైదరాబాద్‌లో నాలెడ్జ్ హబ్ ఏర్పాటు చేయడానికి ఇది ఉత్తమ అవకాశమని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణకు వచ్చి.. జీనోమ్ వ్యాలీని సందర్శించాలని మంత్రి ఫిలిప్స్ నాయకత్వాన్ని ఆహ్వానించారు. తెలంగాణ లైఫ్ సైన్సెస్ డైరెక్టర్ శక్తి నాగప్పన్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో ఇప్పటికే మెడ్ ట్రానిక్, ఒలంపస్, జీఈ వంటి అగ్రశ్రేణి సంస్థల ఎంబెడెడ్ ఇంజినీరింగ్, ఆర్ అండ్ డీ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. రాయల్ ఫిలిప్స్ వైస్ ప్రెసిడెంట్ జాన్ విల్లెమ్– స్కీజ్ గ్రాండ మాట్లాడుతూ.. ఆరోగ్య రంగంలో తెలంగాణ చేపడుతున్న ఏఐ ఆధారిత మార్పు అత్యంత ప్రశంసనీయమని అన్నారు. తమ నెదర్లాండ్స్ ప్రధాన కార్యాలయాన్ని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం సందర్శించాలని ఈ సందర్భంగా ఆహ్వానించారు.

**యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో భాగస్వామ్యానికి సౌదీ సంస్థ ఆసక్తి**

సౌదీ అరేబియాకు చెందిన ప్రముఖ పారిశ్రామిక సంస్థ 'ఎక్స్ పర్టైజ్' స్కిల్ యూనివర్సిటీతో భాగస్వామ్యేందుకు ఆసక్తి వ్యక్తం చూపింది. సంస్థ ప్రెసిడెంట్, సీఈఓ మొహమ్మద్ ఆశిఫ్, దావోస్‌లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందంతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ విద్యా వ్యవస్థకు ఉద్యోగ అవకాశాలకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించాలనే లక్ష్యంతోనే యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా పాఠ్యాంశాలు, ప్రాక్టికల్ శిక్షణ అందించడమే స్కిల్ యూనివర్సిటీ ప్రధాన ఉద్దేశమన్నారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ 2047 విజన్‌కు అనుగుణంగా తెలంగాణను భవిష్యత్‌కు సిద్ధమైన ప్రతిభా కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ప్రాథమిక విద్య, ఆధునిక నైపుణ్యాలు, శిక్షణ, మెంటార్‌షిప్ ద్వారా 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక లక్ష్యం సాధించడమే ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. భారతదేశంలో పూర్తిగా పరిశ్రమల ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న తొలి విశ్వవిద్యాలయం స్కిల్ యూనివర్సిటీయేనని ఆయన పేర్కొన్నారు. ఎక్స్ పర్టైజ్ సంస్థ సిఇఒ మొహమ్మద్ ఆశిఫ్ మాట్లాడుతూ ప్రతి ఏటా సుమారు 5వేల మంది నైపుణ్య కలిగిన సిబ్బందిని నియమించుకునే అవసరం తమకు ఉందని, ఆ అవసరాలను తీర్చేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో భాగస్వామ్యం చేసుకోవాలని ప్రతిపాదించారు. అవసరమైన అన్ని విభాగాల్లో శిక్షణను యూనివర్సిటీ తో కలిసి ప్రారంభించాలనుకుంటున్నామని ఆయన స్పష్టం చేశారు. మిడిల్ ఈస్ట్ ప్రాంతంలో ఈ సంస్థ, పెట్రో కెమికల్స్, ఆయిల్ అండ గ్యాస్, ఎరువులు, స్టీల్, సిమెంట్, వాటర్ ట్రీట్‌మెంట్, విద్యుత్ ఉత్పత్తి వంటి నైపుణ్యాధారిత రంగాల్లో ప్లాంట్ నిర్వహణ సేవలను అందిస్తోంది.

**భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి తెలంగాణతో కలిసి పనిచేస్తాం : యూఏఈ**

భారత్ ఫ్యూచర్ సిటీని ప్రపంచ స్థాయి నగరంగా అభివృద్ధి చేసేందుకు తెలంగాణతో కలిసి పనిచేయడానికి యూఏఈ ప్రభుత్వం సిద్ధంగా ఉందని యూఏఈ ఆర్థిక, పర్యాటక శాఖ మంత్రి హెచ్.ఇ. అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మార్రీ తెలిపారు. ప్రపంచ ఆర్థిక వేదిక 2026 సదస్సులో భాగంగా దావోస్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో యూఏఈ మంత్రి మంగళవారం భేటీ అయ్యారు. 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందంతో కలిసి రాష్ట్రంలో చేపట్టే భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, ముఖ్యంగా భారత్ ఫ్యూచర్ సిటీపై చర్చించారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ ను వివరించారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని చెప్పారు. భారత్ ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్ అభివృద్ధి అవకాశాలపై సిఎం ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఇది దేశంలోనే తొలి నెట్‌జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీగా రూపుదిద్దుకోనుందని తెలిపారు. సుమారు 30 వేల ఎకరాల్లో విస్తరించే ఈ నగరంలో ఏఐ, విద్య, ఆరోగ్యం, పరిశ్రమలు, నివాస, వినోద రంగాలకు ప్రత్యేక జోన్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఈ ప్రాజెక్ట్ లో మారుబేని, సెమ్ కార్ప్ వంటి అంతర్జాతీయ సంస్థలు భాగస్వాములుగా ఉన్నాయని, రిలయన్స్ గ్రూప్ వంతారాతో ఫ్యూచర్ సిటీలో కొత్త జూ ఏర్పాటు కోసం అవగాహన ఒప్పందం కుదిరిందని సిఎం వెల్లడించారు. తెలంగాణతో వ్యూహాత్మక భాగస్వామ్యం ఏర్పాటుకు తమ ప్రభుత్వం ఆసక్తిగా ఉందని అబ్దుల్లా బిన్ తెలిపారు. ప్రాజెక్ట్ వేగవంతమయ్యేందుకు రెండు ప్రభుత్వాల అధికారులతో సంయుక్త టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. యూఏఈ ఫుడ్ క్లస్టర్‌తో తెలంగాణ కలిసి పనిచేసి గ్రామీణ, వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు.

# తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు
# ముందుకొచ్చిన గూగుల్




## సిఎం రేవంత్ రెడ్డితో గూగుల్ ఎపిఎసి ప్రెసిడెంట్ సంజయ్ గుప్తా సమావేశం
## ట్రాఫిక్, సైబర్ సెక్యూరిటీ, స్టార్టప్‌లు, వ్యవసాయం తదితర రంగాల్లో సహకారం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రపంచ టెక్ దిగ్గజం గూగుల్ సంస్థ వివిధ రంగాల్లో తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకొచ్చింది. వ్యవసాయం, వాతావరణ మార్పు, పట్టణ కాలుష్య సమస్యల పరిష్కారంలో తెలంగాణ ప్రభుత్వంతో భాగస్వామ్యం పంచుకుంటామని తెలిపింది. ట్రాఫిక్ నియంత్రణ, సైబర్ సెక్యూరిటీ, వ్యవసాయం, స్టార్టప్‌లలో భాగస్వామ్యం పంచుకునేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. దావోస్ వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్‌లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గూగుల్ ఆసియా పసిఫిక్ ఏరియా (ఎపిఎసి) ప్రెసిడెంట్ సంజయ్ గుప్తాతో సమావేశమయ్యారు. ప్రధానంగా వాతావరణంలో పెను మార్పులు, వ్యవసాయంపై దాని ప్రభావం, పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న కాలుష్యం వంటి సమస్యల పరిష్కారాలపై సమగ్రంగా చర్చలు జరిపారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రాంతీయ ఆర్థిక వృద్ధికి తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న క్యూర్, ప్యూర్, రెర్ అభివృద్ధి నమూనాను వివరించారు. కోర్ హైదరాబాద్ సిటీని కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దే ప్రణాళికలను వివరించారు. ట్రాఫిక్ కంట్రోల్, సైబర్ సెక్యూరిటీ, స్టార్టప్ ఇన్నోవేషన్‌కు మరింత మద్దతు వంటి రంగాల్లో పరస్పర సహకారానికి ఉన్న అవకాశాలను ముఖ్యమంత్రి ప్రస్తావించారు. తొలి గూగుల్ ఫర్ స్టార్టప్స్ హబ్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసినందుకు గూగుల్ బృందానికి ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. వ్యవసాయ రంగంలో ఎరువుల అతిగా వినియోగం వల్ల ఏర్పడుతున్న సమస్యలు, రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరంపై ఈ సమావేశంలో ప్రతినిధుల బృందం చర్చించింది. సమస్యల పరిష్కారానికి, సమస్యలు తలెత్తకుండా నివారించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. గూగుల్ ఎపిఎసి ప్రెసిడెంట్ సంజయ్ గుప్తా మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణ, సైబర్ సెక్యూరిటీ, వ్యవసాయం, స్టార్టప్లు, వాతావరణ మార్పు అంశాల్లో తెలంగాణకు పూర్తి స్థాయిలో మద్దతు అందించేందుకు గూగుల్ సిద్ధంగా ఉందని తెలిపారు. సిఎంతో పాటు సమావేశంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన విస్తృత నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, బిఎఫ్‌ఎస్‌ఐ స్కిల్లింగ్, ఖాన్ అకాడమీ, ఫిజిక్స్ వాలాతో భాగస్వామ్యం, ఏఐ పాఠ్యాంశాల అమలును ప్రధానంగా ప్రస్తావించారు. ప్రభుత్వం పాఠశాలలకు ఉచిత విద్యుత్ సరఫరా, టీఫైబర్ ద్వారా హైస్పీడ్ ఇంటర్నెట్ అందిస్తుందని వివరించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో పాటు ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

**హైదరాబాద్‌లో జిసిసి ఏర్పాటుపై యూనిలీవర్ పరిశీలన**

ప్రపంచ వ్యాప్తంగా వస్తు వినియోగరంగంలో అగ్రగామిగా ఉన్న యూనిలీవర్ సంస్థ, హైదరాబాద్‌లో గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ (జిసిసి) ఏర్పాటు చేసే అవకాశాలపై ఆసక్తి వ్యక్తం చేసింది. ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఇఎఫ్)2026 సదస్సులో భాగంగా మంగళవారం దావోస్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందం యూనిలీవర్ చీఫ్ సప్లై చైన్ అండ్ ఆపరేషన్స్ ఆఫీసర్ విల్లెమ్ ఉయిజెన్‌తో సమావేశమైంది. తెలంగాణలో జిసిసి ఏర్పాటు అంశంపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లకు కేంద్రంగా హైదరాబాద్ వేగంగా మారుతుందని వివరించారు. దీనిపై స్పందించిన విల్లెమ్ ఉయిజెన్ హైదరాబాద్‌లో జిసిసి ఏర్పాటు అవకాశాలను తమ సంస్థ సానుకూలంగా పరిశీలిస్తుందని తెలిపారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఇప్పటికే మెక్‌డొనాల్డ్స్, హైనెకెన్, కాస్టకో వంటి ప్రముఖ ఎఫ్‌ఎంసిజి (త్వరగా వినియోగ వస్తువుల) సంస్థల జిసిసిలు విజయవంతంగా పనిచేస్తున్నాయని చెప్పారు. తెలంగాణకు యూనిలీవర్ విలువైన భాగస్వామి అని, వేగవంతమైన అనుమతులు, లైసెన్సింగ్ ప్రక్రియలతో తెలంగాణ వ్యాపారాలకు అనుకూల రాష్ట్రంగా నిలుస్తోంది అని మంత్రి పేర్కొన్నారు. సమావేశంలో పాల్గొన్న రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహా తెలంగాణ రైజింగ్ బృందం, తెలంగాణలోని పారిశ్రామిక పార్కుల్లో త్వరగా వినియోగ వస్తువుల (ఎఫ్‌ఎంసిజి) తయారీ రంగంలో పెట్టుబడుల అవకాశాలను పరిశీలించాలని యూనిలీవర్‌ను ఆహ్వానించారు. వాతావరణ పరిరక్షణ, నీటి వినియోగంలో సానుకూలత, ప్లాస్టిక్ వినియోగ తగ్గింపు వంటి యూనిలీవర్ లక్ష్యాలను, తెలంగాణ రాష్ట్రం చేపడుతున్న పునరుత్పాదక శక్తి, నీటి సంరక్షణ, సర్క్యులర్ ఎకానమీ కార్యక్రమాలతో అనుసంధానం చేసే అంశాలపై కూడా చర్చలు జరిగినట్లు తెలిపారు.



# 'తెలంగాణ రైజింగ్'లో భాగస్వామ్యం అవ్వండి

## 'ఇండియా పెవిలియన్' ప్రారంభోత్సంలో దిగ్గజ పారిశ్రామికవేత్తలను ఆహ్వానించిన మంత్రి శ్రీధర్ బాబు

ప్రజాపక్షం/హైదరాబాద్

'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా నిలిచిన రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి 'తెలంగాణ రైజింగ్'లో భాగస్వామ్యం కావాలని దిగ్గజ పారిశ్రామికవేత్తలను రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. పారిశ్రామికాభివృద్ధికి అన్ని రకాలుగా అనుకూలంగా ఉన్న తెలంగాణతో కలిసి పని చేసేందుకు, రాష్ట్రాభివృద్ధిలో పాలు పంచుకునేందుకు ముందుకు రావాలని వారిని సాదరంగా ఆహ్వానించారు. మంగళవారం వరల్డ్ ఎకనామిక్ ఫోరం(డబ్ల్యూఇఎఫ్) వార్షిక సదస్సులో భాగంగా దావోస్‌లో ఏర్పాటు చేసిన 'ఇండియా పెవిలియన్' ప్రారంభోత్సవంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, భవిష్యత్తు కోసం ఎదురు చూడకుండా దానిని నిర్మించాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమన్నారు. 2047 నాటికి దేశ జిడిపిలో తెలంగాణ వాటాను 10 శాతానికి చేర్చాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుని, అందుకు అనుగుణంగా దార్శనికతతో కూడిన ప్రణాళికాబద్ధమైన అడుగులు వేస్తున్నామన్నారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చేలా నిపుణులు, పారిశ్రామికవేత్తలు, ప్రజల భాగస్వామ్యంతో కాంప్రహెన్సివ్ రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేశామన్నారు. ఈ విజన్ డాక్యుమెంట్‌లో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చే కీలక రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చామన్నారు. ఫార్మాస్యూటికల్స్, లైఫ్ సైన్సెస్, బయో టెక్నాలజీ, హెల్త్ కేర్ ఇన్నోవేషన్, ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్స్, హార్డ్ వేర్ మాన్యుఫ్యాక్చరింగ్, ఐటి, ఐటిఇఎస్, ఏరో స్పేస్, డిఫెన్స్, టెక్స్ టైల్, అప్పారెల్ మాన్యుఫ్యాక్చరింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, ఆగ్రో బేస్డ్ ఇండస్ట్రీస్, రెన్యువబుల్ ఎనర్జీ, గ్రీన్ టెక్నాలజీస్ తదితర రంగాల్లో తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అనుకూలతలు, అవకాశాలు, ఇక్కడి ఎకో సిస్టం గురించి వివరించారు. రాష్ట్రానికి కొత్త పరిశ్రమలను తీసుకొచ్చి, ఇక్కడి యువతకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. దావోస్ వేదికగా తమ ప్రభుత్వం గత రెండేళ్లలో సుమారు రూ.2.5 లక్షల కోట్ల పెట్టుబడులను సమీకరించిందన్నారు. ఈ ఏడాది కూడా అదే స్ఫూర్తితో పారిశ్రామికాభివృద్ధికి ఉత్తమిచ్చేలా రూపొందించిన పాలసీలను వివరించి, దిగ్గజ కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చేలా కృషి చేస్తామన్నారు. 'తెలంగాణ బ్రాండ్ మరింత విశ్వవ్యాప్తం అయ్యేలా లైఫ్ సైన్సెస్ పాలసీ 2.0, తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్(టిఎఐహెచ్) ను దావోస్ వేదికగా లాంఛనంగా ఆవిష్కరిస్తామన్నారు.

---

తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డులకు

# దరఖాస్తుల ఆహ్వానం

## ఫిబ్రవరి 3 వరకు స్వీకరణ : మంత్రి కోమటిరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ 2025 నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఆదేశాలు జారీ చేసింది. 2025 జనవరి 1 నుంచి డిసెంబర్ 31 వరకు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సిబిఎఫ్‌సి) ద్వారా సర్టిఫికేషన్ పొం దిన చిత్రాలకు ఈ అవార్డులు ప్రదానం చేయనున్నట్లు రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు. ఇప్పటివరకు ఉన్న అవార్డు విభాగాలకు తోడు ఈసారి కొత్త విభాగాలను కూడా ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. సామాజిక స్పృహను ప్రతిబింబించే చిత్రాలకు 'ఉత్తమ సామాజిక సందేశ చిత్రం' అవార్డు, ప్రత్యేక విభాగంలో డా.సి. నారాయణ రెడ్డి అవార్డులను అందజేయనున్నామన్నారు. అర్హులైన నిర్మాతలు, ఇతర దరఖాస్తుదారులు అవార్డులకు సంబంధించిన దరఖాస్తు పత్రాలు, మార్గదర్శకాలను జనవరి 31వ తేదీ వరకు పొందవచ్చని, ఎంట్రీల సమర్పణకు ఫిబ్రవరి 3 చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. నిర్దేశిత మార్గదర్శకాలను పాటిస్తూ నిర్ణీత గడువులోపే దరఖాస్తులను సమర్పించాలని, అర్హులైన నిర్మాతలను ప్రభుత్వం తరుపున మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు.

---

# తెలంగాణకు 6 కొత్త అర్బన్ ఫారెస్ట్‌లు

## 'నగర్ వన్ యోజన' కింద రూ.8.26 కోట్లు మంజూరు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పట్టణాల్లో పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'నగర్ వన్ యోజన పథకం' కింద తెలంగాణ రాష్ట్రానికి కీలక ప్రోత్సాహం లభించింది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తెలంగాణలో 6 కొత్త అర్బన్ ఫారెస్ట్‌ల ఏర్పాటుకు గాను మొదటి విడతలో 70 శాతం నిధులను మొత్తం రూ. 8.26 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని అటవీ దళాల ముఖ్య సంరక్షిణాధికారిణి డా.సి సువర్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిధులు తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖ పరిధిలోని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ ద్వారా వినియోగించనున్నారు. నగరాలు, పట్టణాల పరిధిలో అర్బన్ ఫారెస్ట్‌ల ఏర్పాటు ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడడం, కాలుష్యాన్ని తగ్గించడం, ప్రజలకు ఆరోగ్యకరమైన జీవన వాతావరణాన్ని అందించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశ్యమని వివరించారు. నగర్ వన్ యోజన కింద ఏర్పాటయ్యే అర్బన్ ఫారెస్ట్‌లలో స్థానిక వృక్షజాలానికి ప్రాధాన్యం ఇస్తూ విస్తృతంగా మొక్కలు నాటనున్నారు. నడక మార్గాలు, విశ్రాంతి కేంద్రాలు, పచ్చని మైదానాలతో ప్రజలకు ప్రకృతి ఒడిలో విహరించే అవకాశం కల్పించనున్నారు. పిల్లలు, వృద్ధులు, ఉదయ, సాయంత్రపు వాకర్లకు ఈ అర్బన్ ఫారెస్ట్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఆమోదం పొందిన అర్బన్ ఫారెస్ట్‌ల ప్రాంతాలు ఇలా ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లాలోని మావళా, యాపల్‌గూడ–II, మంచిర్యాల జిల్లాలోని ఇందారం, చెన్నూర్, మేడ్చల్ జిల్లాలోని యెల్లంపేట, చెంగిచెర్ల అర్బన్ ఫారెస్ట్‌ల ఏర్పాటు వల్ల పట్టణాల్లో హరితావరణం విస్తరించడంతో పాటు గాలి నాణ్యత మెరుగుపడనుంది. అలాగే ఉష్ణోగ్రతల పెరుగుదలను నియంత్రించడం, వర్షపు నీటి సంరక్షణ, జీవ వైవిధ్య పరిరక్షణ వంటి అంశాలకు కూడా ప్రాధాన్యత ఉంటుంది. నగర్ వన్ యోజన ద్వారా తెలంగాణ రాష్ట్రాన్ని పర్యావరణ పరిరక్షణలో ముందంజలో నిలిపే దిశగా ఈ అర్బన్ ఫారెస్ట్‌లు కీలక పాత్ర పోషిస్తాయని డాక్టర్ సువర్ణ తెలిపారు.

---

# స్కామ్‌లు డైవర్ట్ చేసేందుకే.. ఫోన్ ట్యాపింగ్ డ్రామాలు

## బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఫల్యాలను, భారీ కుంభకోణాలను కప్పిపుచ్చుకోవడానికి 'అటెన్షన్ డైవర్షన్' రాజకీయాలకు పాల్పడుతోందని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామావు అన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి టెండర్లలో ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డి కేంద్రంగా భారీ రిగ్గింగ్ జరుగుతోందని ఆరోపించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 'సైట్ విజిట్ సర్టిఫికెట్' అనే నిబంధనను పెట్టి, టెండర్ వేసే కంపెనీలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. కేంద్రం వాటా ఉన్న సింగరేణిలో ఇంత దోపిడీ జరుగుతుంటే కిషన్ రెడ్డి ఎందుకు మౌనంగా ఉన్నారని, ఇందులో బిజెపికి కూడా వాటాలు ఉన్నాయా ? అని ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కెటిఆర్ డిమాండ్ చేశారు. బొగ్గు కుంభకోణాన్ని హరీశ్ రావు బయటపెట్టినందుకే, ఆయనకు నోటీసులు ఇచ్చి వేధించడమే కాకుండా అటెన్షన్ డైవర్ట్ చేస్తున్నారని మండిపడ్డారు. ఒక మంత్రి 20 శాతం కమీషన్ అని, ఇంకో మంత్రి బ్యాగ్ మాన్ అని విమర్శించారు. రాజకీయ క్రీడలో పోలీసులు బలి కావొద్దని, అక్రమ కేసులు పెట్టే అధికారులను భవిష్యత్తులో వదిలిపెట్టే ప్రసక్తే లేదని కెటిఆర్ హెచ్చరించారు. బిఆర్‌ఎస్ పార్టీ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి చిహ్నమని, ఎన్ని నోటీసులు ఇచ్చినా, ఎన్ని లీకులు ఇచ్చినా భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. న్యాయస్థానాల్లోనే తేల్చుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

---

# వామపక్ష ఐక్యతే దేశ ప్రగతికి మూలాధారం


(మొదటి పేజీ తరువాయి)



స్వాగతం పలుకగా, సిపిఐ జాతీయ కార్యదర్శి ప్రకాశ్‌బాబు వందనసమర్పణ చేశారు.

డి.రాజా మాట్లాడుతూ వర్తమాన భారతదేశం వర్గం, కుల వివక్ష, మత విద్వేషాలు, అసమానతలు, ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపై దాడి అనే సవాళ్ళను ఎదుర్కొంటోందని, కమ్యూనిస్టులను రక్షించుకుంటూనే, ప్రమాదకరమైన బిజెపిని అడ్డుకోవడం లాంటి అనేక సవాళ్లు వామపక్షాల ముందున్నాయని వివరించారు. ప్రస్తుతం ఐక్య ఉద్యమాలు చేపడుతున్నప్పటికీ ప్రస్తుత ప్రమాదకర పరిస్థితుల్లో వామపక్షాలు మరింత బలమైన శక్తిగా ఎదిగినప్పుడే భారతదేశ సంక్లిష్ట పరిస్థితుల నుంచి బయటపడేందుకు అవకాశం ఉంటుందని సూచించారు. వామపక్షాలు బలమైన శక్తిగా ఎదిగినప్పుడే పేదలు, కూలీలు, రైతులు, కార్మికులు, నిరుద్యోగులు, మహిళలు తదితర తరగతులకు ఉపయుక్తంగా ఉంటుందని సూచించారు. త్వరలో ఎన్నికలు జరగనున్న కేరళలో వామపక్ష, ప్రజాతంత్ర ప్రభుత్వాన్ని నిలబెట్టుకోవాలని, తమిళనాడులో బిజెపిని అడుగుపెట్టనివ్వకూడదని, పశ్చిమబెంగాల్‌లో వామపక్షాలు మరింత బలంగా ఎదగాలన్నారు. మనిషి మదిలోనే కులం ఉన్నదని ఆర్‌ఎస్‌ఎస్ నాయకుడు మోహన్ భాగవత్ చెబుతున్నారని, కాని కులాన్ని నిర్మూలించాలని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చెప్పిన విషయాన్ని రాజా గుర్తు చేశారు. ' ఎస్ఐఆర్ ' పేరుతో బిజెపికి ప్రతికూలంగా ఉన్న ఓటర్లను ఓటరు జాబితా నుంచి తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, రాష్ట్రాల హక్కులను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం హరిస్తోందని, పార్లమెంట్‌లో ప్రజాస్వామిక వాతావరణం లేదని, ఇలాంటి చర్యలతో భారతదేశంలో ప్రజాస్వామ్యం ఉన్నదా అనే పరిస్థితులను తీసుకొచ్చారని రాజా దుయ్యబట్టారు. కృత్రిమ మేధస్సు ఆగమనంతో కార్మిక వర్గ స్వభావం మారిందని, దీనిని కూడా పరిగణలోకి తీసుకొని పోరాట స్వరూపాలను రూపొందించుకోవాలని చెప్పారు.

**ఎస్ఐఆర్ అంటే ...: ఎం.ఎ.బేబి**



ఎం.ఎ.బేబి మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ ఆలోచన మేరకు వారి లెక్కల ప్రకారమే జనగణన జరుగుతుందని, వాటి ఆధారంగానే నియోజకవర్గాల పునర్విభజన జరిగే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాల అవసరం లేకుండానే బిజెపికి మూడింట రెండు వంతుల సీట్లు సాధించే విధంగా నియోజకవర్గాల పునర్విభజన, జనగణన, ఓటరు జాబితాల నుంచి ఓటర్ల తొలగింపు కుట్ర జరుగుతోందని, ఇందుకు కొత్త సాంకేతిక విధానాన్ని కూడా ఉపయోగించుకుంటుందని విమర్శించారు. రాబోయే 2029 సార్వత్రిక ఎన్నికలకు ముందే ఈ ప్రక్రియ పూర్తవుతుందన్నారు. కేంద్రం అమలు చేస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)అంటే స్పెషల్ ఇంటెన్సివ్ రిమూవల్ అని ఎద్దేవా చేశారు. కేరళలో త్రివేంద్రంలో ఎస్ఐఆర్‌లో తన పేరు, తన కుటుంబసభ్యుల పేర్లే ఓటర్ల జాబితాలో కనిపించలేదని, చివరకు వాటిని చేర్చుకోవాల్సి వచ్చిందన్నారు. మాజీ ఎంపిగా ఉన్న తన పరిస్థితి ఇలాగ ఉందన్నారు. వామపక్షాలు లేకుంటే భారతదేశం అనే భావన ఉండబోదని, వామపక్షాలు ఐక్యంగా బలమైన ఉద్యమాలను నిర్మించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకంలో కేవలం ఒక పేరును మాత్రమే మార్చడం కాదని, మొత్తం లక్ష్యాలను మార్చారని విమర్శించారు. అందులో గ్రామీణ భారతాన్ని, అక్కడ ఉపాధిని ప్రశ్నార్థకం చేశారని అన్నారు. మావోయిస్టు పార్టీకి తమకు సైద్ధాంతిక విభేధాలు ఉన్నప్పటికీ ఎన్ కౌంటర్ల పేరుతో కాల్చి చంపడాన్ని నాగరిక సమాజం అంగీకరించబోదని, దానిని తాము వ్యతిరేకించామని బేబీ అన్నారు. భారత ప్రధాని దేశ ప్రయోజనాల కంటే అమెరికా, ఇజ్రాయిల్ ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారని విమర్శించారు. వామపక్షాలు మత ఉన్మాదానికి వ్యతిరేకమని, మతానికి కాదని స్పష్టం చేశారు.

**దీపాంకర్ భట్టాచార్య**



దీపాంకర్ భట్టాచార్య మాట్లాడుతూ ప్రస్తుతం దేశం ఫాసిజం బాటలో ఉందని, అది పూర్తిగా రూపాంతరం చెందక ముందే పోరాటాల ద్వారా అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భారతదేశ చరిత్రలో తెలంగాణ సాయుధ పోరాటం సువర్ణాధ్యాయమని, తమ పార్టీ ఆవిర్భవించినప్పటి నుంచి తెభాగ, తెలంగాణ, నక్సల్బరీ ఉద్యమాలను గుర్తు చేసుకుంటామని తెలిపారు. 'జల్ , జంగిల్, జమీన్' తరహాలో పర్యావరణం, నీరు, ప్రజాస్వామ్యం ఏజెండాగా వామపక్షాలు బలమైన ఉద్యమాన్ని నిర్మించాలన్నారు. దళిత, కమ్యూనిస్టు, ఇతర ఉద్యమాలను ఒక దగ్గరకు చేర్చాలని, తద్వారా బలమైన పోరాటంగా అవతరిస్తామని, దేశంలో ఫాసిజం , అప్రజాస్వామ్యం పూర్తిగా విస్తరించకముందే ఉద్యమాలను నిర్మించాలని సూచించారు. మహాత్మాగాంధీ నరేగా చట్టం రద్దు చేసి తెచ్చిన కొత్త చట్టం కేవలం పేరు మార్పు మాత్రమే కాదని మొత్తం పథకాన్ని తొలగించే కుట్ర అని విమర్శించారు. అదాని కోసమే అణుశక్తి రంగంలో ప్రైవేటీకరణను అనుమతిస్తూ చట్ట సవరణ చేశారని విమర్శించారు. ఎస్ఐఆర్ పేరుతో 12 రాష్ట్రాలలో సుమారు 7 కోట్ల మంది ఓటర్లను తొలగించారని వివరించారు. హిట్లర్ తొలుత ఎన్నికల ద్వారానే అధికారంలోకి వచ్చారని, ఆ తర్వాత రాజ్యాంగాన్ని మార్చి ఒక నియంతగా మారాడని, ప్రస్తుత దేశంలో 'ఒకే దేశం, ఒకే నాయకుడు, ఒకే పార్టీ' అనే మోదీ ఆలోచన కూడా హిట్లర్ లాంటిదే నని భట్టాచార్య విమర్శించారు.

**పోరాట పంథాను మార్చుకోవాలి : దేవరాజన్**



జి. దేవరాజన్ మాట్లాడుతూ పెరిగిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని వామపక్షాలు సద్వినియోగం చేసుకోవాలని, వామపక్షాలన్నీ కేంద్రీకృతమై ఒక ఎజెండాతో పని చేసినప్పుడు. సత్ఫలితాలు వస్తాయని అన్నారు. మారిన కాలం, సమాజం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని పోరాట మార్గాలు నవీకరించుకోవాలని సూచించారు. సోషల్ మీడియాను మితవాద శక్తులు ఉపయోగించుకొని అబద్ధాలనే ప్రచారం చేస్తున్నాయన్నారు. మనం ఇంకా 20వ శతాబ్ద కాలపు పరిజ్ఞానంతో 21వ శతాబ్దపు సమస్యలపై పోరాడ లేమని చెప్పారు. ఐక్య ఉద్యమాలు కేవలం నినాదాలుగా మిగలొద్దన్నారు. సెక్యులర్ శక్తులతో కలిసి పనిచేసేటప్పుడు కూడా వామపక్ష ఐక్యతను ప్రదర్శించాలన్నారు. సిపిఐ వందేళ్ల ప్రస్థానం ఈ దేశానికి ఒక దిక్సూచి అని, రైతులు, కూలీల దగ్గర నుంచి కార్మికుల వరకు అన్ని వర్గాల పక్షాన నిలిచిన చరిత్ర వామపక్షాదేనని అన్నారు.

**వామపక్షాలు కలిస్తే ప్రత్యామ్నాయ శక్తి : కూనంనేని**

కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ వామపక్షాలన్నీ కలిసి ఒక ఎర్ర జెండా గా మారాలని, ఢిల్లీలో ని ఎర్రకోట పైన ఎర్ర జెండా ఎగురాలని అన్నారు. ఎర్ర జెండాలన్నీ ఒకటిగా ఉంటే, దేశంలో ప్రత్యామ్నాయ శక్తిగా ఉంటామని అభిప్రాయపడ్డారు.



రాష్ట్రంలో ఎవరు అధికారంలోకి రావాలో నిర్ణయించే శక్తి వామపక్షాలకు ఉందని ఆయన తెలిపారు. మావోయిస్టులు సిద్ధాంతం పరంగా వేరు అయినప్పటికి వారిని కూడా రక్షించుకోవాలని అన్నారు. ఎర్ర జెండాలన్నీ సురక్షితంగా ఉండాలని చెప్పారు. రావణాసురుడు సీతను తీసుకెళ్లినట్టుగా ట్రంప్ వెనిజుల లో అక్కడి అధ్యక్షుణ్ణి, ఆయన భార్యను తీసుకెళ్లారని అన్నారు.

**ఘనంగా శతాబ్ది ఉత్సవాలు : పల్లా వెంకట్ రెడ్డి**

పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ సిపిఐ శతాబ్ది ఉత్సవాలు రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించామని వివరించారు.



సిపిఐ సభకు లక్షలాది మంది తరలి వచ్చారని తెలిపారు. కాగా పల్లా వెంకట రెడ్డి, ఆహుతులను వేదికపైకి ఆహ్వానించగా, సిపిఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యులు అమర్ జీత్ కౌర్, గిరీష్ శర్మ, రామకృష్ణపండా, సందోష్‌కుమార్, సంజయ్ కుమార్, కె.ప్రకాశ్ బాబు, పల్ల భోసేన్ గుప్తా, కె. రామకృష్ణ వేదికపై ఆసీనులయ్యారు.

---

# ఐక్యతపై వామపక్ష నేతలు..

(మొదటి పేజీ తరువాయి)

సామ్రాజ్యవాదం పొడసూపుతున్నాయని, వాటిపై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఫార్వర్డ్ బ్లాక్ ప్రధాన కార్యదర్శి దేవరాజన్ ప్రసంగిస్తూ వామపక్ష ఐక్యతను నినాదాలకే పరిమితం చేయకుండా రాజకీయ ఆచరణలో పెట్టాలని పేర్కొన్నారు. ప్రగతి శీల శక్తుల చీలికలు ప్రతీఘాత శక్తుల, రాజకీయాలకు ప్రయోజనం చేకూరుస్తుందన్నారు. మామూలు సమయంలోనే వామపక్షాల ఐక్యత అనడమే కాకుండా, ఎన్నికల సమయంలో ఆచరణలో చూపాలని,వామపక్షాలు ఎవరికివారు ప్రాంతీయ పార్టీలతో పొత్తులకు పోకుండా, ఐక్యవామపక్ష సంఘటనగా ఉంటే ఇతర పార్టీలతో ఎక్కువ స్థానాలు పొందవచ్చని అన్నారు. కాగా, ఆర్‌ఎస్‌పి ప్రధాన కార్యదర్శి మనోజ్ భట్టాచార్య అనారోగ్య కారణాలతో సెమినార్‌కు హాజరుకాలేకపోతున్నానని, ఆయన కమ్యూనిస్టు పార్టీ శ్రేణులకు శతవసంతాల సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ పంపిన సందేశాన్ని డి.రాజా చదివి వినిపించారు.

**మున్సిపల్ కౌన్సిల్ కార్యాలయం**
**కొత్తకోట మున్సిపాలిటీ, వనపర్తి జిల్లా, (టిఎస్).**
**ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ ప్రకటన**
''ఇ''ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం కింద 04 పనుల కొరకు టెండర్లను ఆహ్వానించడమైనది. **బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది:** 20.01.2026న ఉ.9.30గం.ల నుండి, **బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ఆఖరి తేదీ:** 23.01.2026న ఉ.10.30గం.ల వరకు. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా https://tender.telangana.gov.inలో చూడవచ్చు. బిడ్లను ఆహ్వానించు కార్యాలయం: కమిషనర్, కొత్తకోట మున్సిపాలిటీ, తెలంగాణ రాష్ట్రం. సెల్: 9440418505, 9440656778.
DIPR R.O. No. : 13988-PP/CL/ADVT/1/2025-26 Date: 20-01-2026 సం/- కమిషనర్, కొత్తకోట మున్సిపాలిటీ.

**శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానము**
**కొడవటంచ గ్రామము, రేగొండ మండలము, జయశంకర్ భూపాలపల్లి జిల్లా.**
లేఖ నెం. ఎస్.ఎల్.ఎన్.ఎస్.డి/ప్రకటన /2026 తేదీ. 20.01.2026
ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా! శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానము, కొడవటంచ గ్రామము, రేగొండ మండలం, జయశంకర్ భూపాలపల్లి జిల్లా నందు పాత ఇనుప సామాగ్రి మరియు ఇత్తడి సామాగ్రి విక్రయించుటకు తేది: 02.02.2026 రోజున మ.3-00 గం.లకు సీల్డ్ టెండర్-కం-బహిరంగ వేలము నిర్వహించబడును. టెండర్ షెడ్యూల్ ధర 300/- మరియు రూ.10,000/-లు చెల్లించవలెను. ఈ టెండర్లలో హిందువులు మాత్రమే పాల్గొనవలెను. వివరములు కార్యాలయంలో నేరుగా కానీ లేదా సెల్ నెం. 9502825595 ద్వారా సంప్రదించగలరు.
DIPR R.O. No. : 14015-PP/CL/ADVT/1/2025-26 Date: 20-01-2026 సం/- కార్యనిర్వహణాధికారి

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్** GHMC
**సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, శేరిలింగంపల్లి జోన్ : జిహెచ్‌ఎంసి.**
**మెయిల్:** sew.ghmc@gmail.com **సెల్ నెం. 9154172331**
**ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన**
**NIT No.42/SE/SLPZ/GHMC/2025-26** **తేది: 20.01.2026**
పని పేరు: (02 ఐటమ్స్) జిహెచ్‌ఎంసి, ఎస్‌ఎల్‌పిజెడ్, సర్కిల్-48లో సిసి రోడ్ వేయడం. **అంచనా మొత్తం / ఇసివి:** రూ.175.50 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** 21.01.2026న మ.1.00గం.ల నుండి, 28.01.2026న మ.1.30గం.ల వరకు. **అధికారి పేరు & చిరునామా:** ఎస్ఇ, ఎస్‌ఎల్‌పిజెడ్, జిహెచ్‌ఎంసి. సెల్ నెం. 9154172331.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, శేరిలింగంపల్లి జోన్ : జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 14029-PP/CL/ADVT/1/2025-26 Date: 20-01-2026



## సన్నాయిల కులస్థుల సమస్యల పరిష్కారానికి కృషి

### సంఘం 2026 సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించిన బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని సన్నాయిల కులస్థుల ఇబ్బందులపై బిసి కమిషన్ తరపున తగిన నిర్ణయాలు తీసుకుని ప్రభుత్వానికి సూచనలు చేసి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలంగాణ రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ చెప్పారు. బిసి కమిషన్ కార్యాలయంలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర సన్నాయిల కుల సంఘం నూతన సంవత్సరం 2026 క్యాలెండర్‌ను బిసి కమిషన్ చైర్మన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ ఉద్యోగాలలో తమకు గుర్తింపులేదని, తమను అనర్హులుగా చూస్తున్నారని అన్ని జిల్లాలలోని కుల సభ్యులు చైర్మన్‌కు నిరంజన్‌కు విన్నవించారు. ఇందుకు చైర్మన్ నిరంజన్ స్పందిస్తూ లిఖితపూర్వమైన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సన్నాయిల కుల సంఘం అధ్యక్షులు వేముల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొమాండ్ల మనోహర్, గౌర వాధ్యక్షులు నరసింహులు, వర్కింగ్ ప్రెసిడెంట్ కోమండ్ల మహేందర్, సత్యనారాయణ, రాష్ట్ర సన్నాయిల కుల సంఘం కమిటీ పిలుపుమేరకు వచ్చిన కరీంనగర్, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, జనగామ, బోనగిరి, నల్గొండ, సంగారెడ్డి, హైదరాబాద్ ప్రాంత సన్నాయి కులస్తులు పాల్గొన్నారు.

## కవిత వ్యాఖ్యలపై బిఆర్ఎస్ సమాధానం చెప్పాలి : కె.లక్ష్మణ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే కల్వకుంట్ల కవిత కుటుంబ సభ్యుల ఫోన్లు ట్యాప్ అయ్యాయని, స్వయంగా కవితే ఈ విషయాన్ని వెల్లడించారని బిజెపి ఎంపి, ఓబిసి మోర్చ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మ ణ్ అన్నారు. మీడియాతో మంగళవారం ఆయన మాట్లాడుతూ సొంత పార్టీ నేతల ఫోన్లనే ట్యాప్ చేశారన్న కవిత ఆరోపణలపై బిఆర్ఎస్ నాయకత్వం ముందుగా సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. అంతర్గత కలహాల వల్లే బిఆర్ఎస్‌లో ఒకరిపై ఒకరు నిఘా పెట్టుకున్నారని, ఆ పార్టీ ప్రస్తుతం ముక్కలైపోయే స్థితికి చేరిందని ఎద్దేవా చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడుతోందనే అనుమానాలు ప్రజల్లో బలంగా ఉన్నాయని లక్ష్మ ణ్ ఆరోపించారు. దర్యాప్తుల పేరుతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. ప్రజల దృష్టిని అసలు సమస్యల నుంచి మళ్లించేందుకే ప్రభుత్వం ఎత్తులకు పైఎత్తులు వేస్తోందన్నారు. బిఆర్ఎస్ నేతలు తిన్న ప్రతి రూపాయిని కక్కిస్తాం అని రేవంత్ రెడ్డి గతంలో చేసిన వ్యాఖ్యలను లక్ష్మ ణ్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. మాటలు చెప్పడం పక్కన పెట్టి, అన్ని అక్రమాలపై పూర్తి స్థాయి దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. కోల్ బ్లాక్ కేటాయింపుల అంశంపై న్యాయపోరాటం చేస్తామని లక్ష్మ ణ్ స్పష్టం చేశారు.

## ఘనంగా 'ఉద్భవ' జాతీయ నృత్యోత్సవం

**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** భారతీయ శాస్త్రీయ నృత్యాలను ఒక పవిత్ర వేదికపై ఏకత్రం చేయాలనే నాట్యాచార్యులు బొంపెల్లి సుధీర్ రావు సాంస్కృతిక శాఖ సౌజన్యంతో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో 'ఉద్భవ' అనే జాతీయ నృత్యోత్సవం రెండురోజులపాటు ఘనంగా జరిగింది. చివరి రోజు మంగళవారం ఉత్తర భారతం, తెలంగాణ, ఆంధ్ర, కేరళ, కర్ణాటక, తమిళనాడు వంటి రాష్ట్రాల నుంచి విచ్చేసిన నర్తకిమనులు తమ ప్రదర్శనలతో సభికులను ఆకట్టుకొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా తెలంగాణ సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ ప్రొ. అలేఖ్య పంజాల, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా.ఏనుగు నరసింహారెడ్డి, సన్నిధ రాజసగి, శ్వేత ప్రసన్న, శ్రావ్య సుబ్రహ్మణ్యం, వెంకట దీక్షితులు హాజరయ్యారు. బొంపెల్లి సుధీర్‌రావు శిష్యబృందం వాల్మీకి రామాయణం ఆధారంగా 'సుందరకాండ' అనే నృత్య ప్రదర్శన చేయగా, సభికులు వీక్షించి, అభినందించారు. ఇప్పటికే సుధీరావు ''సద్గురు శ్రీ శివానంద నృత్యమాల'ను అనే శాస్త్రీ నృత్య శిక్షణ స్థాపించి, 40ఏళ్లుగా ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దారు.

## దామగుండం భూములపై కేంద్రానికి నోటీసులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వికారాబాద్ జిల్లా దామగుండం అటవీ భూముల్లో ఏర్పాటు చేస్తున్నా రాడార్ ప్రాజెక్ట్ 2వ దశ అనుమతులపై స్టేటస్ రిపోర్టును సమర్పించాలని కేంద్రానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. రాడార్ ప్రాజెక్ట్ కేంద్రానికి 2,900 ఎకరాల దామగుండం అటవీ భూములను రాష్ట్ర ప్రభుత్వం బదలాయించింది. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దామగుండం ఫారెస్ట్ ప్రొటెక్షన్ జెఎసి హైకోర్టులో పిల్ దాఖలు చేసింది. దీనిని చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ డివిజన్ బెంచ్ మంగళవారం విచారించింది. తూర్పు నావికాదళ కమాండ్ స్టేటస్ రిపోర్టు దాఖలు చేసిందని, పర్యావరణ, అటవీ, వాతావరణ నివేదిక సమర్పించేందుకు సమయం కావాలని కేంద్రం కోరింది. దీంతో విచారణ ఫిబ్రవరి 18కి వాయిదా పడింది.

## టిక్కెట్ ధరలు 90 రోజులు ముందుగా పెంచవచ్చు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాజా సాబ్ సినిమా టికెట్లు ధరల పెంపు వ్యవహారంలో ఇకపై టిక్కెట్లు ధరలు పెంచరాదన్న ఉత్తర్వులకు విరుద్ధంగా మన శంకర వరప్రసాద్ సినిమా టికెట్ల ధరలను రాష్ట్ర హోం శాఖ పెంచడానికి హైకోర్టు తీవ్రంగా పరిగణించింది. సుమోటోగా హోం శాఖ ముఖ్య కార్యదర్శికి కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేసింది. ఇకపై సినిమా టిక్కెట్ల ధరలను పెంచాలంటే 90 రోజులు ముందుగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కోర్టు ఉత్తర్వులకు విరుద్ధంగా మన శంకర వరప్రసాద్ సినిమా టికెట్ల ధరలను పెంచడానికి సవాల్ చేస్తూ చంద్రబాబు అనే అడ్వకేట్ దాఖలు చేసిన పిటీషన్ జస్టిస్ శ్రవణ్ కుమార్ మంగళవారం విచారించారు. కోర్టు ఆదేశాలు అంటే లెక్క లేకుండా ఉందా అని వ్యాఖ్యానించారు కోర్టు ఉత్తర్వులకు విరుద్ధంగా సినిమా టిక్కెట్ల ధరలను ఎలా పెంచుతారని ప్రశ్నించారు దీనిపై తదుపరి విచారణ నాటికి హోం శాఖ ముఖ్య కార్యదర్శి నగర పోలీస్ కమిషనర్ ఇతర ప్రతివాదులు వివరణ ఇవ్వాలని ఆదేశించారు విచారణను ఫిబ్రవరి 3కు వాయిదా వేశారు.

## బుధవారం నుంచి జిఎస్‌టి ట్రిబ్యునల్

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** రాష్ట్రంలో తొలిసారి జిఎస్‌టి ట్రిబ్యునల్ బుధవారం నుంచి పని చేయనుం ది. జిఎస్‌టి అధికారులు తీసుకునే నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఇప్పటివరకు హైకోర్టులో పిటీషన్లు దాఖలు అయ్యాయి ఇకపై జిఎస్టి ట్రిబ్యునల్ లో పిటీషన్లు దాఖలు చేసుకునే అవకాశం ఉంటుంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది ట్రిబ్యునల్ సభ్యులను ముగ్గురిని నియమించింది. మరొకరిని నియమించాల్సి ఉంది.

## స్మార్ట్ రేషన్ కార్డ్ టెండర్‌పై పిటిషన్ డిస్మిస్

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** పివిసి క్యూఆర్ కోడ్ స్మార్ట్ రేషన్ కార్డుల సేకరణ టెండర్లలో ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. ప్రభుత్వ నిర్ణయంలో జోక్యం చేసుకోవడానికి కారణాలు లేవంది. రోస్మెర్టా టెక్నాలజీస్ లిమిటెడ్ దాఖలు చేసిన పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ జస్టిస్ మాధవి దేవి తీర్పు చెప్పారు . రేషన్ కార్డుల స్థానంలో క్యూఆర్ కోడ్‌తో స్మార్ట్ రేషన్‌కార్డులను అందించేందుకు పౌరసరఫరాల శాఖ టెండర్లు నుంచి అనర్హత వేటు వేయడాన్ని రోస్మెర్టా టెక్నాలజీస్ లిమిటెడ్ సవాల్ చేసిన పిటీషన్ కొట్టి వేశారు.

# బాధితుల ముంగిటకే పోలీస్.. ఇంటి వద్దే ఎఫ్ఐఆర్

### దేశంలోనే మొదటిసారిగా తెలంగాణ

### మహిళలు, చిన్న పిల్లల కేసులో తక్షణ ఊరట

### పోలీస్‌స్టే షన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండానే సేవలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బాధితులకు మరింత చేరువగా, మానవీయ కోణంలో సేవలందించేందుకు తెలంగాణ రాష్ట్ర నేర పరిశోధక విభాగం (సిఐడి) ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై బాధితులు ఫిర్యాదు చేసేందుకు పోలీస్ సేషన్ల చుట్టు తిరగాల్సిన అవసరం లేకుండా పోలీసులే బాధితుల నివాసానికి లేదా వారు కోరిన ప్రదేశానికి వెళ్లి ఎఫ్ఐఆర్ నమోదు చేసే కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. దేశంలోనే మొదటిసారిగా పౌర కేంద్రిత పోలీసింగ్‌లో భాగంగా ఈ విప్లవాత్మక మార్పును తీసుకొచ్చినట్లు సిఐడి చీఫ్ చారుసిన్హా మంగళవారం వెల్లడించారు. ముఖ్యంగా మహిళలు, పిల్లలపై జరిగే నేరాలు, శారీరక దాడులు, ఆస్తి సంబంధిత వివాదాల్లో బాధితులు తీవ్ర మానసిక ఆందోళనకు లోనవుతుంటారని పోలీసులు గుర్తించారు. ఫోక్సో చట్టం, ఎస్‌సిఎస్‌టి అట్రాసిటీ నిరోధక చట్టం, బాల్య వివాహాల నిషేధ చట్టం, ర్యాగింగ్ నిరోధక చట్టం ఇలాంటి కేసులో బాధితులు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయడం ఇబ్బందిగా మారుతున్న తరుణంలో వారి ఇంటి వద్దే ఫిర్యాదు స్వీకరించి న్యాయ ప్రక్రియను వేగవంతం చేయాలని నిర్ణయించారు.

#### ఫోన్‌చేస్తేచాలు.. ఇంటికే అధికారి!

కొత్త విధానం ప్రకారం.. నేరం జరిగినప్పుడు బాధితులు ఫోన్ ద్వారా లేదా మౌఖికంగా సమాచారం అందిస్తే చాలు. వెంటనే సంబంధిత పోలీసు అధికారి బాధితుడి నివాసానికి, ఘటన స్థలానికి లేదా వారు చికిత్స పొందుతున్న ఆసుపత్రికి చేరుకుంటారు. బాధితుల వద్దే ఫిర్యాదు స్వీకరించి, వెంటనే స్టేషన్‌కు పంపి ఎఫ్ఐఆర్ నమోదు చేస్తారు. రిజిస్టర్ అయిన ఎఫ్ఐఆర్ ప్రతిని బాధితులకు వారి ఇంటి వద్దే అందజేస్తారు. భారతీయ నాగరిక సుర క్షా సంహిత నిబంధనల ప్రకారం అక్కడికక్కడే సాక్ష్యాల సేకరణ, బాధితుల స్టేట్‌మెంట్ రికార్డింగ్ వంటి చర్యలు చేపడతారు.

#### పారదర్శకత – వేగవంతమైన దర్యాప్తు

సమాచారం అందిన వెంటనే స్పందించి 'జీరో ఎఫ్ఐఆర్' సహా ఏ రూపంలోనైనా కేసు నమోదు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ విధానం వల్ల దర్యాప్తులో జాప్యం తగ్గుతుందని, సాక్ష్యాధారాలు తారుమారు కాకుండా రక్షించవచ్చని సిఐడి అదనపు డిజి చారుసిన్హా తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీసు యూనిట్లు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు ఈ నూతన ప్రామాణిక ఆపరేటింగ్ విధానాన్ని (ఎస్ఒపి)పాటించాలని స్పష్టం చేసింది. బాధితుల గౌరవానికి హక్కులకు భంగం కలగకుండా వృత్తిపరమైన సేవలు అందించడమే లక్ష్యమని సిఐడి పునరుద్ఘాటించింది.

## మెక్సికో ప్రతినిధులకు తెలంగాణ సిఇఒ స్వాగతం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** భారత్ వేదికగా జరుగుతున్న 'ఇండియా ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ డెమోక్రసీ అండ్ ఎలెక్షన్ మేనేజ్‌మెంట్ 2026' లో మెక్సికో ఎన్నికల ప్రతినిధులకు తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఓ) సి. సుదర్శన్‌రెడ్డి మంగళవారం ఘన స్వాగతం పలికారు. మెక్సికో అంతర్జాతీయ వ్యవహారాల విభాగాధిపతి మారిసా ఆర్లీన్ కాబ్రాల్ పోర్చాస్, ఎన్నికల కౌన్సిలర్ నోర్మా ఐరీన్ డే లా క్రూజ్ మగానాలను ఆయన ప్రత్యేకంగా ఆహ్వానించి, సమావేశం అయ్యారు. ఈ కార్యక్రమంలో అదనపు సిఇఓ వాసం వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రత్యేక ఉప కలెక్టర్లు చెన్నయ్య, ప్రసూన పాల్గొన్నారు. ఎన్నికల సంఘం ఆధ్వర్యంలోని ఐఐఐడిఇఎమ్ నిర్వహిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ సదస్సు జనవరి 21 నుంచి 23 వరకు సాగనుందని తెలిపారు.

ముఖ్య ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు డా. సుఖ్బీర్ సింగ్ సంధు, డా. వివేక్ జోషి ఈ సమావేశాన్ని అధికారికంగా ప్రారంభిస్తారని, ఈ సదస్సులో 70కి పైగా దేశాల నుంచి సుమారు 100 మంది ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఎన్నికల నిర్వహణలో నూతన ఆవిష్కరణలు, అంతర్జాతీయ ప్రమాణాలు, ఉత్తమ విధానాలపై 36 థీమాటిక్ వర్కింగ్ గ్రూపులు లోతైన చర్చలు జరుపుతాయని తెలిపారు. భారత ఎన్నికల ప్రక్రియ వైవిధ్యం, సంక్లిష్టతను వివరించే ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు జరుగుతుందని, మొదటి రోజు 'ఇండియా డిసైడ్స్' డాక్యుసిరీస్ ప్రదర్శన జరుగుతుందన్నారు. అలాగే ఎన్నికల సమాచారానికి సమగ్ర డిజిటల్ వేదిక (ఇసిఐఎన్ఇటి)ను ఇసిఐ అధికారికంగా ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

## 23వేల మంది 'ఇందిరమ్మ' లబ్ధిదారులకు రూ.262.51 కోట్లు విడుదల

### హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ వి.పి.గౌతం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి 23 వేలమంది లబ్ధిదారులకు ప్రభుత్వం ఒకే రోజు రూ.262.51 కోట్లను విడుదల చేసింది. ఈ మొత్తాన్ని ఆధార్ నెంబరు ఆధారంగా లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ చేసినట్లు హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరక్టర్ వి.పి.గౌతం తెలిపారు. ఈ వారం చేసిన చెల్లింపుల్లో, బేస్ మెంట్ స్థాయి నిర్మాణపు పనులను పూర్తి చేసిన లబ్ధిదారులు 2763 ఉండగా, గోడలు శ్లాబ్ కట్టడాల స్థాయి దాటిన వారు 20,186 ఉన్నారని ఆయన వివరించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా ఈ ఏడాది మార్చి నాటికల్లా ఒక లక్ష ఇండ్లను పూర్తి చేయడంతోపాటు, తదుపరి దశను ప్రారంభించడానికి ప్రభుత్వ యంత్రాంగం సన్నద్ధమవుతున్నదని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణపు పనులు జోరుగా కొనసాగుతున్నాయని, మార్గదర్శకాలకు అనుగుణంగా (400600 చదరపు అడుగుల విస్తీర్ణం మొదలైనవి) ఇండ్లు కట్టుకుంటున్న వారందరికీ బిల్లులు సకాలంలో విడుదల అవుతున్నాయన్నారు. పూర్తి పారదర్శకంగా, ఆన్ లైన్ లోనూ, క్షేత్ర స్థాయిలోనూ నిశిత పరిశీలన తర్వాతే బిల్లుల మొత్తం మంజూరు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటీ వరకు 2.50 లక్షల ఇండ్ల పనులు ప్రారంభమయ్యాయని, వీటిలో సుమారు 1.25 లక్షల ఇండ్లు గోడలు, శ్లాబ్ లు అయిపోయి త్వరలోనే పూర్తి కానున్నాయని మరో 75 వేల ఇండ్ల పనులు బేస్ మెంట్ స్థాయిని దాటిపోయాయని వి.పి. గౌతం తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పనుల పురోగతిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న జిల్లాల్లో కలెక్టర్లు తరచు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తున్నారని, ఇదిలా ఉంటే ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇంతవరకు మొత్తం రూ. 4351 కోట్లకు పైగా నిధులను లబ్ధిదారులకు విడుదల చేశామని, బిల్లులను విడుదల చేయడంలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని మేనేజింగ్ డైరక్టర్ గౌతం వివరించారు.

## సింగరేణిలో 'కమీషన్ల రాజ్యం'

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :**సింగరేణి నైనీ బొగ్గు బ్లాక్ టెండర్ల రద్దు వ్యవహారం కాంగ్రెస్ ప్రభుత్వ కమీషన్‌ల కక్కుర్తికి, దోపిడీ పాలనకు నిదర్శనమని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు విమర్శించారు. హైదరాబాద్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణిని అడ్డం పెట్టుకుని అటు కాంగ్రెస్, ఇటు గత బిఆర్ఎస్ ప్రభుత్వాలు భారీ అవినీతికి పాల్పడ్డాయని ఆరోపించారు. నైనీ బ్లాక్ టెండర్ల ప్రక్రియ ద్వారా కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి కంటే కమీషన్లకే ప్రాధాన్యత ఇస్తున్నారనే నిజం బయటపడిందని విమర్శించారు. సొంత మనుషులకు, బంధువులకే కాంట్రాక్టులు కట్టబెట్టేలా 'సైట్ విజిట్' అనే సరికొత్త కుట్రకు తెరలేపారు' అని ఆయన అన్నారు. ఈ పద్ధతి ద్వారా తమకు నచ్చిన వారికే టెండర్లు దక్కేలా ప్రణాళిక ప్రకారం కుంభకోణానికి పాల్పడ్డరని ఆరోపించారు. సింగరేణిలో జరుగుతున్న అవకతవకలకు కాంగ్రెస్‌తో పాటు బిఆర్ఎస్ కూడా సమాన బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రుల మధ్య సమన్వయం లేదని, కేవలం కమీషన్ల పంపకాల్లోనే గొడవలు జరుగుతున్నాయని విమర్శించారు. ముఖ్యమంత్రికి సంబంధించిన వారికా? లేక ఉపముఖ్యమంత్రి మనుషులకా? అనే వాటాల పంచాయతీ వల్లే నైనీ టెండర్లు రద్దయ్యాయన్నారు. దీనిపై డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు.



బిఆర్ఎస్ హయాం నుంచి ఇప్పటివరకు సింగరేణిలో జరిగిన అన్ని అక్రమాలపై సిబిఐ లేదా సిట్ ద్వారా సమగ్ర విచారణ జరపాలని రాంచందర్ రావు డిమాండ్ చేశారు. కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్, కోల్ స్కామ్ వంటి అంశాలపై హోలిస్టిక్ దర్యాప్తు జరగాలని, కేవలం అధికారులను బలిచేసి రాజకీయ నాయకులను తప్పించడం సరికాదన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బిజెపి ఎస్‌సి మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్, బిజెపి రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి గారు, తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష

### ఈనెల 3 నుంచి 21వ తేదీ వరకు 15 విడుతలుగా సాగిన పరీక్షలు

### 2,37,754 మంది అభ్యర్థులకు 1,95,181 హాజరు

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** ఉపాధ్యాయ అర్హత పరీక్ష( టెట్) విజయవంతంగా ముగిసిందని పాఠశాల విద్యా శాఖ ప్రకటించింది. ఈ నెల 3 నుంచి 20వ తేదీ వరకు 15 విడుతల్లో నిర్వహించిన కంప్యూటర్ ఆధారిత పరీక్షలు (సిబిటి) మంగళవారం ముగిశాయని తెలిపింది. ఈ పరీక్షలకు 2,37,754 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 1,95,181 (82.09 శాతం) మంది పరీక్షలకు హాజరు కాగా 42,573 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. ఈనెల 3న జరిగిన మొదటి విడుత పేపర్ 2 మ్యాథ్స్, సైన్స్ పరీక్షలకు 17,605 మందికి గాను 14,089 (80.03శాతం) మంది, రెండవ విడుత పరీక్షలకు 17,856 మందికి, 14127(79.12శాతం), 4వ తేదీన జరిగిన మొదటి విడుత పరీక్షలకు 22,912 అభ్యర్థులకు గాను 18,235 (80.88 శాతం) మంది, రెండవ విడుత పరీక్షలకు 22,912 మందికి గాను 18,819 మంది అభ్యర్థులు హాజరయ్యారు. 5వ తేదీన జరిగిన పేపర్2 ఎస్ఎస్‌టి పరీక్షకు సంబంధించి మొదటి విడుతలో 14,786 మందికి గాను 11,781 (79.68శాతం), రెండవ విడుత పరీక్షకు 12,681 మందికి గాను 10,136 మంది అభ్యర్థులు హాజరు అయ్యారు. 6వ తేదీన జరిగిన ఇదే పరీక్షకు మొదటి విడుత 13,654 మందికి 10,877 (79.93 శాతం), రెండవ విడుత పరీక్షకు 13670 మందికి 11882 (86.22 శాతం) అభ్యర్థులు పరీక్షలు రాశారు. 8వ తేదీన జరిగిన పేపర్1 పరీక్ష మొదటి విడుత 18,025 మందికి, 15,164 (84.13 శాతం),రెండవ విడుత పరీక్షకు 17,461 మందికి గాను14,584 (83.52 శాతం), 9వ తేదీన జరిగిన పరీక్షకు 16010 మందికి, 13,486 (84.23 శాతం),11న జరిగిన పరీక్షకు14447 మందికి 11906 మంది( 82.41 శాతం), రెండవ విడుత పరీక్షకు 13,928 అభ్యర్థులకు గాను 11,436 మంది (82.11 శాతం) పరీక్షలు రాశారు.

అదేవిధంగా 19వ తేదీన జరిగిన పేపర్ 1 పరీక్షకు 5667 మందికి గాను 4622 మంది (81.56 శాతం), 20వ తేదీన జరిగిన పేపర్2 (మ్యాథ్స్, సైన్స్, ఎస్ఎస్‌టి ) పరీక్షకు గాను16,506 మందికిగాను 14,037 మంది (85.04శాతం) అభ్యర్థులు పరీక్షలకు హాజరైనట్లు అధికారులు తెలిపారు.

### బిసి విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు

## తక్షణమే విడుదల చేయాలి

### బిసి విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు విక్రమ్ గౌడ్ డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసి విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలరిషిప్‌లను తక్షణమే విడుదల చేయాలని, అలాగే ఇంజనీరింగ్ విద్యలో బిసి విద్యార్థులకు అన్యాయంగా మారిన 10 వేల ర్యాంకు నిబంధనను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ, బిసి విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్ గౌడ్ మంగళవారం బిసి శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విక్రమ్ గౌడ్ మాట్లాడుతూ కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీని అమలు చేయాలని, ప్రభుత్వం ఏర్పడ్డ సంవత్సరంలో పూర్తి బకాయిలు చెల్లిస్తామన్న మాట నిలుపుకోవాలన్నారు. పేద, మధ్యతరగతి బిసి కుటుంబాలకు చెందిన విద్యార్థులు స్కాలరిషిప్‌లు, ఫీజు రియింబర్స్‌మెంట్ రూ. 5,600 కోట్ల బకాయిలు విడుదల కాక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. విద్యార్థుల చదువులు పూర్తయిన కూడా కాలేజీ యజమాన్యాలు సర్టిఫికెట్స్ ఇవ్వకపోవడంతో అటు ఉద్యోగం చేయలేక, పై చదువులకు వెళ్లలేక అనేక మంది విద్యార్థులు చదువులు మానేసే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్ విద్యలో బిసి విద్యార్థులకు విధించిన 10 వేల ర్యాంకు నిబంధన పూర్తిగా వివక్షతతో కూడినదని, ఇది బిసి విద్యార్థుల ఉన్నత విద్య అవకాశాలను దెబ్బతీస్తోందని అన్నారు. ఈ నిబంధనను వెంటనే ఎత్తివేసి, బిసి విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. బిసిల విద్య, ఉపాధి రంగాల్లో ప్రభుత్వం చొరవ తీసుకుని తక్షణమే నిర్ణయాలు తీసుకోవాలని, లేనిపక్షంలో బిసి విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను చేపడతామని విక్రమ్ గౌడ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిసి యువజన సంఘం జాతీయ అధ్యక్షులు శ్యామ్ కురుమ, జిల్లా అధ్యక్షులు ఇంద్రం రాజక, మహిళా నాయకురాలు సంధ్య, సురేష్ ముదిరాజ్, నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

**దక్షిణ మధ్య రైల్వే**

Follow us on @SCRailwayindia దక్షిణమధ్య రైల్వే టెండరు నోటీసుల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.inలో చూడగలరు.

PUB/1786

**నెం. C/E-Auctions Catalogue/SC/2025-26, తేదీ: 19-01-2026.**

భారత రాష్ట్రపతి తరపున, దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ వాణిజ్య ఆదాయం మరియు NFR కాంట్రాక్టుల కోసం ఇ-వేలాన్ని ఆహ్వానిస్తున్నారు. దీని ప్రకారం, సికింద్రాబాద్ డివిజన్ ఈ క్రింది వర్గాల కోసం ఇ-వేలాన్ని విధానం రూపొందించింది. వీటి వివరాలు **https://www.ireps.gov.in** వెబ్‌సైట్‌లో తెలియజేయబడ్డాయి.

**క్ర.సం. 1. వర్గం:** MISC-STATIC. **కేటలాగ్ నెం. :** SC-CHZ-MSSTWP2. **వేలం ప్రారంభ తేదీ & సమయం:** 22-01-2026 మధ్యాహ్నం 2:00. **సంబంధిత స్టేషన్(లు) / రైలు(లు):** SC, CHZ. **వేలం వివరాలు: సికింద్రాబాద్ మరియు చర్లపల్లి** రైల్వే స్టేషన్లలోని పార్శిల్ కార్యాలయంలో ద్విచక్ర వాహనాలు మరియు ఇతర పార్శిళ్ల ప్యాకింగ్ మరియు ఇతర అనుబంధ పనులు.

**క్ర.సం. 2. వర్గం:** MISC-STATIC. **కేటలాగ్ నెం. :** MSS-BOXN-GZ-26-. **వేలం ప్రారంభ తేదీ & సమయం:** 23-01-2026 మధ్యాహ్నం 1:00. **సంబంధిత స్టేషన్(లు) / రైలు(లు):** OPL, PRPI, BPA, KZJ. **వేలం వివరాలు: 1. ఉప్పల్ గూడ్స్ యార్డ్ (OPL) మరియు పంధర్‌పావని గూడ్స్ యార్డ్ (PRPI) వద్ద వ్యాగన్లు, నిర్దేశిత ట్రాక్లు మరియు ప్లాట్‌ఫారాలలో** మిగిలిపోయిన బొగ్గు మరియు ఇతర పదార్థాలను శుభ్రపరచడం మరియు తొలగించడం కోసం వ్యక్తిగత కాంట్రాక్టులు. **2. బెల్లంపల్లి రైల్వే స్టేషన్ మరియు కాజీపేట రైల్వే స్టేషన్ ప్రాంతంలో** అందుబాటులో ఉన్న సర్క్యులేటింగ్ ఏరియాలో ఫన్ జోన్‌ను ఏర్పాటు చేయడానికి వ్యక్తిగత కాంట్రాక్టులు.

**క్ర.సం. 3. వర్గం:** క్యాటరింగ్. **కేటలాగ్ నెం. :** SC-CATG-01-2026. **వేలం ప్రారంభ తేదీ & సమయం:** 27-01-2026 మధ్యాహ్నం 2:00. **సంబంధిత స్టేషన్(లు) / రైలు(లు):** PDPL, DKJ, CHZ, SC, BMT, HTCY. **వేలం వివరాలు: పెద్దపల్లి, డోర్నకల్ జంక్షన్, చర్లపల్లి, సికింద్రాబాద్, బేగంపేట మరియు హైటెక్ సిటీ** స్టేషన్లలో క్యాటరింగ్ స్టాల్స్ కాంట్రాక్టులు.

**క్ర.సం. 4. వర్గం:** MISC-STATIC. **కేటలాగ్ నెం. :** MSS-MIX-26-2. **వేలం ప్రారంభ తేదీ & సమయం:** 27-01-2026 మధ్యాహ్నం 2:00. **సంబంధిత స్టేషన్లు / రైళ్లు:** BDNH, JET, NDMH, CHZ, SC, BMT, NLRD. **వేలం వివరాలు:** 1. **భూదేవినగర్, జేమ్స్ స్ట్రీట్, నేరెడ్‌మెట్ మరియు చర్లపల్లి** స్టేషన్లలో బ్యాటరీ స్వాపింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేయడానికి మరియు నిర్వహించడానికి ప్రత్యేక కాంట్రాక్టులు. 2. **సికింద్రాబాద్** రైల్వే స్టేషన్‌లలోని ప్లాట్‌ఫారమ్ 10 వైపు ఉన్న VP సైడింగ్‌లో పార్సెల్ స్కానర్‌ను ఏర్పాటు, నిర్వహణ మరియు పర్యవేక్షణ కోసం కాంట్రాక్ట్. 3. **బేగంపేట్ మరియు నెక్లెస్ రోడ్** రైల్వే స్టేషన్లలో ఫుడ్ ట్రక్కులు / జ్యూస్ బార్‌తో పాటు చాట్ స్టాల్‌ను ఏర్పాటు చేయడానికి మరియు నిర్వహించడానికి ప్రత్యేక కాంట్రాక్టులు. 4. **బేగంపేట్** రైల్వే స్టేషన్‌లో ప్రీమియం స్టోర్‌ను ఏర్పాటు చేయడానికి మరియు నిర్వహించడానికి కాంట్రాక్ట్.

**క్ర.సం. 5. వర్గం:** ప్రకటనలు. **కేటలాగ్ నెం. :** ADVT-MIX-26-2. **వేలం ప్రారంభ తేదీ & సమయం:** 28-01-2026 14:00. **సంబంధిత స్టేషన్లు / రైళ్లు:** 12723/24, 12791/92, 12704/03, 12791/92, 12721, 12757/58 WL, SC & CHZ, RDM, BPA & SKZR, ZB, BIDR & BHLK. **వేలం వివరాలు: 1.** రైలు నంబర్ **12723/24** (తెలంగాణ ఎక్స్‌ప్రెస్ HYB-NDLS), **12791-92** (దానాపూర్ ఎక్స్‌ప్రెస్ SC-DNR), **12704/03** (SC-HWH ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ ) ప్రయాణికులకు Infotainment bookletలను పంపిణీ చేయడానికి కాంట్రాక్ట్. **2.** రైలు నెం. **12791/92** సికింద్రాబాద్ - దానాపూర్ ఎక్స్‌ప్రెస్ (పూర్తి ముఖభాగం), రైలు నెం. **12723/24** తెలంగాణ ఎక్స్‌ప్రెస్, రైలు నెం. **12721** హైదరాబాద్-హజరత్ నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్ మరియు రైలు నంబర్: **12757/58:** సికింద్రాబాద్ SKZR - సికింద్రాబాద్ రైళ్లలో వినైల్ ర్యాపింగ్ ప్రకటనల కోసం ప్రత్యేక కాంట్రాక్టులు. **3.** వరంగల్ RUBలలో ఇంటి నుండి బయటకు స్టాటిక్ / డిజిటల్ హోర్డింగ్ ద్వారా వాణిజ్య ప్రకటనల కోసం ఒప్పందం. **4.** చర్లపల్లి మరియు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లలో డిజిటల్ ప్రకటనలతో మొబైల్ ఛార్జింగ్ కియోస్క్ యొక్క సంస్థాపన, ఆపరేషన్ మరియు నిర్వహణ. **5.** రామగుండం, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్ మరియు జమ్మికుంట రైల్వే స్టేషన్లలోపల స్టాటిక్ బోర్డుల ద్వారా వాణిజ్య ప్రకటనల కోసం మరియు క్లస్టర్-IX **(జహీరాబాద్ (ZB), బీదర్ (BIDR) మరియు భాల్కి (BHLK)** రైల్వే స్టేషన్ల కోసం ప్రత్యేక కాంట్రాక్టులు.

**క్ర.సం. 6. వర్గం:** ATM. **కేటలాగ్ నెం.:** ATM-General-26-. **వేలం ప్రారంభ తేదీ & సమయం:** 29-01-2026 ఉదయం 10:00. **సంబంధిత స్టేషన్(లు)/రైలు(లు):** CHZ. **వేలం వివరాలు: చర్లపల్లి** రైల్వే స్టేషన్‌లో ఏటీఎంల నిర్వహణ మరియు పర్యవేక్షణ కోసం కాంట్రాక్టు.

**క్ర.సం. 7. వర్గం:** క్యాటరింగ్. **కేటలాగ్ నెం.:** SC-CATG-02-2026. **వేలం ప్రారంభ తేదీ & సమయం:** 29-01-2026 మధ్యాహ్నం 2:00. **సంబంధిత స్టేషన్(లు)/రైలు(లు):** CHZ, LPI. **వేలం వివరాలు: చర్లపల్లి మరియు లింగంపల్లి** రైల్వే స్టేషన్లలో వాటర్ వెండింగ్ మెషీన్ల ఏర్పాటు మరియు నిర్వహణ కోసం కాంట్రాక్టులు.

**క్ర.సం. 8. వర్గం:** PAY AND USE. **కేటలాగ్ నెం.:** PnU-SC-Toi-26-2. **వేలం ప్రారంభ తేదీ & సమయం:** 30-01-2026 మధ్యాహ్నం 2:00. **సంబంధిత స్టేషన్(లు)/రైలు(లు):** BMT, UDGR. **వేలం వివరాలు: బేగంపేట మరియు ఉద్గిర్** స్టేషన్లలో PAY AND USE.టాయిలెట్ కోసం ప్రత్యేక కాంట్రాక్టులు.

**క్ర.సం. 9. వర్గం:** PAY AND USE. **కేటలాగ్ నెం.:** PnU-ACWH-26. **వేలం ప్రారంభ తేదీ & సమయం:** 04-02-2026 మధ్యాహ్నం 1:00. **సంబంధిత స్టేషన్(లు)/రైలు(లు):** MABD, RDM, SC. **వేలం వివరాలు: మహబూబాబాద్, రామగుండం మరియు సికింద్రాబాద్** ప్లాట్‌ఫారమ్-10 స్టేషన్లలో ఏసీ వెయిటింగ్ హాల్ కోసం ప్రత్యేక కాంట్రాక్టులు.

**క్ర.సం. 10. వర్గం:** MISC-STATIC. **కేటలాగ్ నెం.:** MSS-Mix-2026-2. **వేలం ప్రారంభ తేదీ & సమయం:** 04-02-2026 మధ్యాహ్నం 3:00. **సంబంధిత స్టేషన్(లు) / రైలు(లు):** HFZ, KZJ, JET, BDCR. **వేలం వివరాలు: 1. హఫీజ్‌పేట** రైల్వే స్టేషన్‌లో ఎలక్ట్రిక్ వాహనాల ఛార్జింగ్ స్టేషన్ కోసం కాంట్రాక్ట్. **2. కాజీపేట, జేమ్స్ స్ట్రీట్ మరియు భద్రాచలం రోడ్** స్టేషన్లలో ఫుడ్ ట్రక్కులు/జ్యూస్ బార్‌ను చాట్ స్టాల్‌తో పాటు ఏర్పాటు చేసి, నిర్వహించడం కోసం కాంట్రాక్ట్.

**క్ర.సం. 11. వర్గం:** ప్రకటనలు. **కేటలాగ్ నెం.:** Advt-Mix-26-3. **వేలం ప్రారంభ తేదీ & సమయం:** 04-02-2026 మధ్యాహ్నం 3:00. **సంబంధిత స్టేషన్లు / రైళ్లు:** 12759/60 & 17319/20, KZJ, MABD, YADD, RDM, BPA, SKZR, JMKT, CHZ. **వేలం వివరాలు: 1.** రైలు నెం. **12759/60 & 17319/17320** యొక్క బాహ్య భాగంలో వినైల్ ర్యాపింగ్ కోసం కాంట్రాక్ట్. **2. కాజీపేట** రైల్వే స్టేషన్ యొక్క సర్క్యులేటింగ్ ఏరియాలో డిజిటల్ బోర్డుల ద్వారా వాణిజ్య ప్రకటనల కోసం కాంట్రాక్ట్. **3. మహబూబాబాద్** రైల్వే స్టేషన్ సమీపంలో అవుట్ ఆఫ్ హోమ్ (OOH) (స్టాటిక్ హోర్డింగ్, డిజిటల్ LED బోర్డులు, వాల్ పెయింటింగ్ మొదలైనవి) ద్వారా వాణిజ్య ప్రకటనల కోసం కాంట్రాక్ట్. **4. యాదాద్రి** రైల్వే స్టేషన్‌లో యూనిపోల్ ఏర్పాటు కోసం కాంట్రాక్ట్. **5. రామగుండం, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్ మరియు జమ్మికుంట** రైల్వే స్టేషన్ల సర్క్యులేటింగ్ ఏరియాలో స్టాటిక్ హోర్డింగ్ల ద్వారా వాణిజ్య ప్రకటనల కోసం కాంట్రాక్ట్. **6. చర్లపల్లి** రైల్వే టెర్మినల్ లోపల స్టాటిక్ బోర్డుల ద్వారా వాణిజ్య ప్రకటనల ప్రదర్శన కోసం కాంట్రాక్ట్.

ఆసక్తి గల వారు మరియు కాంట్రాక్టర్లు ఈ విషయాన్ని గమనించి, ఇ-వేలం నోటీసు గురించిన వివరణాత్మక సమాచారం కోసం పైన పేర్కొన్న వెబ్‌సైట్‌ను చూడగలరు.

విచారణలు / వివరణల కోసం, దయచేసి దిగువ సంతకం చేసిన వారి కార్యాలయాన్ని సంప్రదించండి.

A2261 సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, సికింద్రాబాద్.

# 'విబి–జి రామ్ జి'ని రద్దుచేయాలి

### కేంద్ర సర్కార్‌కు తమిళనాడు ప్రభుత్వం విజ్ఞప్తి



**చెన్నై :** ఇటీవల పార్లమెంట్ ఆమోదించిన 'విబి–జి రామ్ జి' చట్టాన్ని ఉపసంహరించుకోవాలని, యుపిఎ కాలం నాటి గ్రామీణ ఉపాధి పథకం 'ఎంజి నరేగా'ను పునరుద్ధరించాలని తమిళనాడు ప్రభుత్వం కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. తద్వారా రాష్ట్ర ఆర్థిక భారాన్ని తగ్గించాలని కోరింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజి నేరగా) నిలిపివేయడం గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధికి ఆటంకం కలిగించడమే కాకుండా రాష్ట్ర ప్రభుత్వంపై ఆర్థిక భారాన్ని కూడా పెంచిందని పేర్కొంది. 'విక్షిత్ భారత్‌రోజ్‌గార్, అజీవిక మిషన్ (గ్రామీణ్) 'విబి– జి రామ్ జి' హామీ కారణంగా తమిళనాడుపై ఆర్థిక భారం సంవత్సరానికి సుమారు రూ. 5,000 కోట్లు పెరుగుతుందని తమిళనాడు అసెంబ్లీ స్పీకర్ ఎం. అప్పావు గవర్నర్ ప్రసంగాన్ని అసెంబ్లీలో చదువుతూ అన్నారు. అయితే డిఎంకె ప్రభుత్వం తయారుచేసిన పాఠ్యాంశంలో 'తప్పులు' ఉన్నాయని పేర్కొంటూ గవర్నర్ ఈ సంవత్సరం తొలి సమావేశంలో రాష్ట్ర అసెంబ్లీ నుండి తన సాధారణ ప్రసంగం చేయకుండానే వాకౌట్ చేశారు. గవర్నర్ ప్రసంగం తమిళ వెర్షన్‌ను చదివిన అప్పావు, కొత్త పథకం 'విబి– జి రామ్ జి' గ్రామీణ ప్రాంతాల్లోని కోట్లాది మంది పేదలు, వెనుకబడిన వర్గాలకు, ముఖ్యంగా మహిళలు, ఆది ద్రావిడర్ వర్గాలకు వేతన ఉపాధిని నిర్ధారించడానికి రూపొందించిన ఎంజి నరేగా ప్రాథమిక లక్ష్యాన్ని దెబ్బతీసిందన్నారు. గ్రామీణ పేదలకు సామాజిక భద్రతను అందించే నరేగా ద్వారా, మౌలిక సదుపాయాల అభివృద్ధి, సహజ వనరుల పరిరక్షణ, పచ్చదనం, వాటర్‌షెడ్ నిర్వహణ వంటి అనేక ప్రాజెక్టులు గ్రామీణ ప్రాంతాల్లో విజయవంతంగా అమలు అయినట్లు తాను గమనించానన్నారు. ఈ పథకాన్ని విజయవంతంగా అమలు చేసినందుకు తమిళనాడు నిరంతరం అనేక జాతీయ అవార్డులను అందుకుంది. 'వివిధ కేంద్ర ప్రాయోజిత పథకాల కింద రాష్ట్ర వాటా పెరిగినందున రాష్ట్ర ప్రభుత్వం తన సొంత పథకాలను అమలు చేయడంలో గణనీయమైన సవాళ్లను ఎదుర్కొంటుందని పరిగణనలోకి తీసుకుంటే, ఈ కొత్త పథకాన్ని ప్రవేశపెట్టడాన్ని కేంద్రం ప్రతికూల ఉద్దేశ్యంలో భాగంగా పరిగణించాలి' అని ఆయన అన్నారు. కొత్త పథకాన్ని ఉపసంహరించుకోవాలని, కేంద్ర ప్రభుత్వం నరేగాకు అదనపు ఆర్థిక వనరులను పునరుద్ధరించి కేటాయించాలని ఆయన అన్నారు. భాషా విధానాన్ని ప్రస్తావిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తమిళనాడు రాష్ట్ర విద్యా విధానం 1968 నుండి కొనసాగించబడిన తమిళం, ఆంగ్లం అనే ద్విభాషా సూత్రాన్ని అనుసరిస్తుందని పునరుద్ఘాటించారు. 'మాజీ ముఖ్యమంత్రి సి ఎన్ అన్నాదురై రూపొందించిన ద్విభాషా విద్యా విధానాన్ని మేము మా స్వంత కళ్ళలాగా కాపాడుకుంటున్నాము. మన జీవితం, భావోద్వేగాల నుండి విడదీయరాని తమిళ భాషను రక్షించే విషయానికి వస్తే, రాజీకి అవకాశం లేదు' అని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి ఎం కె స్టాలిన్ నాయకత్వంలో, ఈ విధానంలో ఎటువంటి మార్పును ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించదని ప్రభుత్వం పేర్కొంది.

## ఉపాధి హామీ పథకం రద్దు చేయాలనుకుంటున్న మోదీ

# ఈ చర్య ప్రజాస్వామ్య మూలాలపై దాడి

### రాయ్‌బరేలీలో రాహుల్‌గాంధీ విమర్శ




**రాయ్‌బరేలీ:** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ) పథకాన్ని రద్దు చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కోరుకుంటున్నారని కాంగ్రెస్ నాయకుడు, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ విమర్శించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి నాయకత్వానగల ప్రభుత్వం ఎంజిఎన్‌ఆర్ ఇజిఎ స్థానంలో మరో మరో చట్టం తెచ్చి మహాత్మా గాంధీని అవమానించిందని, ఈ పథకానికి విలువ లేకుండా చేస్తోందని విమర్శించారు. ఈ చర్య ప్రజాస్వామ్య మూలాలపై దాడిగా ఆయన పేర్కొన్నారు. కొత్తగా తెచ్చిన చట్టం కింద బిజెపి పాలిత రాష్ట్రాలు ఈ పథకానికి తమ వంతు వాటా కేటాయించడంలేదని విమర్శించారు. రాయ్‌బరేలీ పార్లమెంటరీ నియోజకవర్గంలో పర్యటించిన సందర్భంగా మంగళవారం కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి రాహుల్‌గాంధీ ప్రసంగిస్తూ, అధికార కేంద్రీకరణ వాంఛ, పేదలకు రక్షణగా ఉన్న సంక్షేమ పథకాలను బలహీన పరచాలన్న వాంఛతో ఉన్న మోదీ ఉపాధి హామీ పథకాన్ని రద్దుచేయాలనుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మరీ ముఖ్యంగా సమాజంలో అణగారిన వర్గాల ప్రజలకు భద్రత చేకూర్చే పథకాన్ని ఉపసంహరించుకోవడం మహాత్మాగాంధీకి అవమానకరమన్నారు. బిజెపి ప్రభుత్వం 2025 డిసెంబరు 18వ తేదీన పార్లమెంటులో విబి–జి రామ్ జి (వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవిక మిషన్) బిల్లుకు ఆమోద ముద్ర వేసింది. యుపిఎ ప్రభుత్వ హయాంలో తెచ్చిన ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ స్థానంలో ఈ బిల్లును చట్టరూపంలో తెస్తారు. యుపిఎ హయాంలో 20 సంవత్సరాల క్రితం తెచ్చిన ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ చట్టం కింద గ్రామీణ పేద కార్మికులకు ప్రతి సంవత్సరం 125 రోజులు ఉపాధి హామీని ఇప్పటివరకూ అమలు చేశారు. ఈ పథకంలో మహాత్మాగాంధీ పేరు తొలగించి 'విబి–జి రామ్ జి' అనే పొడి అక్షరాలతో చట్టం చేయడాన్ని దేశంలోని ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. 'ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ' పథకాన్ని రద్దుచేయడాన్ని వ్యతిరేకిస్తూ, కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా పెద్ద నిరసన ఉద్యమాన్ని కొనసాగిస్తోంది. జనవరి 10వ తేదీన ఈ ప్రచార ఉద్యమాన్ని కాంగ్రెస్ ప్రారంభించింది. ఫిబ్రవరి 25వ తేదీ వరకూ ఈ ప్రచార ఉద్యమం కొనసాగుతుంది.

**మా పార్టీ కార్మికపక్షాన నిలబడి పోరాటం** చేస్తోంది, కార్మికుల హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్‌పార్టీ కట్టుబడి ఉంది'' అని రాహుల్‌గాంధీ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఉద్ఘాటించారు. గౌతం అదానీ, ముకేష్ అంబానీ వంటి పారిశ్రామికవేత్తల చేతుల్లోకి దేశ సంపదను కేంద్రీకరించాలని ప్రధానమంత్రి మోదీ కోరుకుంటున్నారని విమర్శించారు. ''మేం ఒక చేత్తో దేశ ప్రజలను రక్షిస్తూ ఉంటే, మోదీ మరో చేత్తో దేశ సంపదను ఎంపిక చేసిన కొద్దిమంది చేతుల్లో కేంద్రీకరించాలని కోరుకుంటున్నారు'' అన్నారు. మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం కింద నిర్దేశించిన రోజువారీ వేతనాలకంటే తక్కువ వేతనాలకు ఈ దేశంలో ఏ ఒక్క కార్మికుడూ బలవంతంగా పని చేయకూడదనే లక్ష్యంతోనే యుపిఎ ప్రభుత్వం ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ పథకాన్ని తీసుకువచ్చిందని చెప్పారు. ఈ పథకాన్ని ఢిల్లీలో, లక్నోలో కూర్చున్న అధికారులు ఈ పథకాన్ని నడిపించాలనే ఉద్దేశంతో యుపిఎ ప్రభుత్వం ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎ చట్టాన్ని తీసుకురాలేదని, ఈ పథకాన్ని గ్రామీణస్థాయిలో పంచాయతీరాజ్ ప్రభుత్వాలు అమలు చేయాలనే ఉద్దేశంతో ఈ పథకం తీసుకువచ్చామని చెప్పారు. తద్వారా గ్రామ పంచాయతీ పెద్ద ఈ పథకానికి బాధ్యుడుగా వ్యవహరిస్తారన్నారు. ఈ పథకాన్ని సంబంధించిన ఆర్థిక వ్యవహారాలన్నీ గ్రామ పంచాయతీల ద్వారానే జరగాల్సి ఉందన్నారు. యుపిఎ ప్రభుత్వం తెచ్చిన ఈ ఉపాధి పథకం కార్మికులకు ప్రయోజనం లేదని కొద్ది సంవత్సరాల క్రితం మోదీ పార్లమెంటులో చెప్పారని, ఈ పథకాన్ని రద్దుచేసే ప్రయత్నం చేశారన్నారు. ఇప్పుడు ఈ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పూర్తిగా రద్దుచేయాలని మోదీ కోరుకుంటున్నారని విమర్శించారు. విబి–జి రామ్ జి కొత్త చట్టం కింద రాష్ట్రాల ప్రభుత్వాలు 40 శాతం నిధులను కేటాయించవలసి ఉందని, గతంలో ఇలాంటి పరిస్థితి లేదని అన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాలు ఈ పథకం కింద ఇవ్వాల్సిన వాటాను ఇప్పుడు ఇవ్వడంలేదని విమర్శించారు. కాగా, అంతకుముందు రాహుల్ గాంధీ రాయ్‌బరేలిలో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. తన పార్లమెంటరీ నియోజకవర్గంలో రెండు రోజుల పర్యటనలో ఉన్న కాంగ్రెస్ నాయకుడు పార్టీ ఆఫీస్ బేరర్లు, కార్యకర్తలను కూడా కలిశారు.

**రాయ్‌బరేలిలో క్రికెట్ అకాడమీ ఏర్పాటు చేయండి**

ఇదిలా ఉండగా, బిసిసిఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లాతో మాట్లాడి రాయ్‌బరేలిలో క్రికెట్ అకాడమీ ఏర్పాటు చేయాలని అభ్యర్థించారని జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మనీష్ చౌహాన్ తెలిపారు. రాయ్‌బరేలిలో ఒక క్రీడా కార్యక్రమానికి హాజరైన రాహుల్‌గాంధీ వేదికపై నుండి క్రీడా మైదానం పరిస్థితిని గమనించి, చౌహాన్, సునీల్ సింగ్ భదోరియా, వికాస్ సింగ్‌లతో కూడిన నిర్వాహక కమిటీ సభ్యుల నుండి స్థానిక క్రీడా సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారని చౌహాన్ తెలిపారు. ఆ ప్రాంతంలో సరైన క్రీడా మైదానం లేదని, ఇది ఆటగాళ్లకు గణనీయమైన సవాళ్లను కలిగిస్తుందని వారు అతనికి తెలియజేశారు. ఈ చర్చ తర్వాత, గాంధీ వేదికపై నుండి నేరుగా శుక్లాతో మాట్లాడి, ఆ ప్రాంతంలో క్రికెట్ అకాడమీ ఏర్పాటు చేయాలని అధికారికంగా అభ్యర్థించారని చౌహాన్ చెప్పారు

## 'సర్'..

# సాఫ్ట్‌వేర్ ఇంటెన్సివ్ రిగ్గింగ్

### తృణమూల్ కాంగ్రెస్ ఆరోపణలు

### ఎన్నికల జాబితా సమీక్ష కోసం ప్రక్రియలో మరింత పారదర్శకత :డేరెక్ ఓబ్రెయిన్ డిమాండ్



**న్యూఢిల్లీ :** పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) కొనసాగుతోంది. అయితే ఈ 'సర్' ప్రక్రియను 'సాఫ్ట్‌వేర్ ఇంటెన్సివ్ రిగ్గింగ్'గా తృణమూల్ కాంగ్రెస్ అభివర్ణించింది. ఎన్నికల జాబితా సమీక్ష కోసం కొనసాగుతున్న ప్రక్రియలో మరింత పారదర్శకత అవసరమని రాష్ట్రంలోని అధికారక పార్టీ పేర్కొంది. మంగళవారం ఢిల్లీలో టిఎంసి రాజ్యసభ పక్షనేత డేరెక్ ఓ బ్రెయిన్, ఉపనేత సాగరికా ఘోష్, ఎంపి సాకేత్ గోఖలే విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల పార్టీ ప్రతినిధి బృందం, పోల్ ప్యానెల్ పూర్తి బెంచ్ మధ్య జరిగిన సమావేశాలలో జరిగిన చర్చల ట్రాన్స్‌క్రిప్ట్‌లను ఎన్నికల సంఘం (ఇసి) విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 'సర్' వాస్తవానికి దేనిని సూచిస్తుందని ప్రశ్నిస్తూ.. ఇది 'సాఫ్ట్‌వేర్ ఇంటెన్సివ్ రిగ్గింగ్'గా మారిందని మండిపడ్డారు. మన దేశంలోని గొప్ప సంస్థలలో ఇసి ఒకటని, ఇది చాలా దశాబ్దాలుగా ప్రజాస్వామ్యాన్ని కాపాడుతూ వచ్చిందని, కానీ ఇప్పుడు ఈ గొప్ప సంస్థను కూల్చివేస్తున్నారని ఓ బ్రెయిన్ విలేకరుల సమావేశంలో అన్నారు. గత సంవత్సరం నవంబర్ 28–డిసెంబర్ 31 తేదీలలో ఇసితో జరిగిన సమావేశాలలో టిఎంసి నాయకులు 'సర్' ప్రక్రియను సులభతరం చేయడానికి అనేక నిర్మాణాత్మక సూచనలు చేశారని ఓ బ్రియిన్ అన్నారు. సమావేశాల ట్రాన్స్‌క్రిప్ట్‌లను బయట పెట్టాలని పోల్ ప్యానల్‌ను డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు పోల్ ప్యానెల్‌ను పారదర్శకతతో పనిచేయాలని ఆదేశించిందని, ఎన్నికల కమిషన్ రాజకీయ ప్రయోజనాలతో పనిచేయకూడదని ఘోష్ ఎత్తి చూపారు. పౌరుడి ఓటు హక్కును కాపాడటం ఇసి రాజ్యాంగ విధి అని ఆమె అన్నారు. ఇసి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌ను సాఫ్ట్‌వేర్ ఇంటెన్సివ్ రివిజన్‌గా మార్చకూడదని సూచిస్తున్నామని, సుప్రీంకోర్టు సూచించినట్లుగా ఇసి పారదర్శకతతో పనిచేయాలన్నారు.

## కశ్మీర్‌లో శాంతి పునరుద్ధరణే

# పిడిపి ఏకైక ఎజెండా : ముఫ్తీ

**జమ్ము :** జమ్ముకశ్మీర్‌లో చర్చల ద్వారా శాంతి, శ్రేయస్సును పునరుద్ధరించడం, ఇక్కడి ప్రాంతాలను ఐక్యంగా ఉంచి అభివృద్ధి పర్చాలనేదే తమ తమ పార్టీ ఏకైక ఎజెండా అని పిడిపి అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ పేర్కొన్నారు. పీర్ పంజాల్, చీనాబ్ లోయకు డివిజన్ హోదా కల్పించాలనే ప్రతిపాదనను డిక్సన్ ప్రణాళికతో అనుసంధానించినందుకు నేషనల్ కాన్ఫరెన్స్, బిజెపిలను మాజీ ముఖ్యమంత్రి విమర్శించారు. ఈ డిమాండ్ పూర్తిగా పరిపాలనాపరమైనదని, నిర్లక్ష్యం చేసిన ప్రాంతాల సమతుల్య అభివృద్ధి, మెరుగైన పాలనను నిర్ధారించడం లక్ష్యంగా పెట్టుకున్నారని అన్నారు. 'పిడిపికి ఒకే ఒక ఎజెండా ఉంది: జమ్ముకశ్మీర్‌లో గౌరవప్రదమైన శాంతి పునరుద్ధరణ' అని మంగళవారం ఆమె విలేకరులతో సమావేశంలో అన్నారు. నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా పిర్ పంజాల్ (రాజౌరి, పూంచ్), చీనాబ్ లోయ (రాంబన్, దోడా, కిష్టావర్)లకు డివిజనల్ హోదా మంజూరు చేయాలనే తన ప్రతిపాదనను డిక్సన్ ప్రణాళికతో అనుసంధానించడంపై, ముఫ్తీ తనను గౌరవిస్తానని, జమ్ముకశ్మీర్‌లో ఆయనను ప్రముఖ నాయకుడిగా భావిస్తానని చెప్పారు, కానీ 'తన తండ్రి షేక్ మొహమ్మద్ అబ్దుల్లాను అదే ఫార్ములా కోసం అరెస్టు చేసిన విషయాన్ని అతను మర్చిపోయినట్లు తాను భావిస్తున్నానన్నారు. 'ఇది నేషనల్ కాన్ఫరెన్స్, దాని వ్యవస్థాపకుడి ఎజెండా కావచ్చు, దీని కోసం ఆయనను తొలగించి జైలులో పెట్టారు. ఇది మా పార్టీ ఎజెండా ఎప్పటికీ కాదు' అని ఆమె అన్నారు.

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులపై పిసి యాక్ట్ కింద

# చార్జిషీట్లు సమ్మతమే

### 'సుప్రీం' తీర్పు

### రాజస్థాన్ హైకోర్ట్ ఉత్తర్వులను సమర్థించిన 'అపెక్స్ కోర్టు'




**న్యూఢిల్లీ :** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులపై లంచం, అవినీతి నేరాలకు సంబంధించి రాష్ట్ర పోలీస్ అధికారులు అవినీతి నిరోధక (పిసి) చట్టం కింద దరాప్తు చేసి అభియోగపత్రం (చార్జిషీట్) దాఖలు చేయవచ్చని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిపై రాష్ట్ర పోలీసులు కేసు నమోదు చేయడానికి ముందు సిబిఐ ముందస్తు అనుమతి అవసరం లేదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టీకరించింది. జస్టిస్ జె.బి.పార్థివాలా, జస్టిస్ సతీష్ చంద్రశర్మలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం సోమవారం మాట్లాడుతూ పిసి చట్టం కింద జరిగే నేరాలను రాష్ట్ర సంస్థ లేదా కేంద్ర సంస్థ లేదా ఏదైనా పోలీస్ సంస్థ దర్యాప్తు చేయవచ్చని, చట్టంలోని సెక్షన్ 17 ప్రకారం పోలీస్ అధికారి ఒక నిర్దిష్ట హోదాను కలిగి ఉండాలనే అర్హత ఉందని పేర్కొంది. సెక్షన్ 17 కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులపై లంచం, అవినీతి, దుష్ప్రవర్తనకు సంబంధించిన నేరం నమోదు చేయకుండా లేదా దర్యాప్తు కేసు నుండి రాష్ట్ర పోలీసులను లేదా రాష్ట్రంలోని ప్రత్యేక సంస్థను మినహాయించడం లేదా నిరోధించదని వివరించింది. 'సౌలభ్యం కోసం పనిలో నకిలీని నివారించడానికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు దాని సంస్థలపై అవినీతి, లంచం కేసుల దర్యాప్తు బాధ్యతను ప్రత్యేక పోలీస్ సంస్థ అయిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ)కు అప్పగించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు దాని సంస్థలపై అవినీతి, లంచం కేసుల దర్యాప్తు బాధ్యతను రాష్ట్ర ప్రత్యేక దర్యాప్తు సంస్థ అయిన యాంటీ కరప్షన్ బ్యూరో (ఎసిబి)కి అప్పగించారు' అని ధర్మాసనం చెప్పింది. పిసి చట్టం కింద నేరాల కూడా శిక్షార్హమైనవి. అందువల్ల రాష్ట్ర పోలీస్ అధికారులు దర్యాప్తు చేయవచ్చని ధర్మాసనం జోడించింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిపై ఉన్న అవినీతి కేసును కొట్టివేయడానికి నిరాకరించిన రాజస్థాన్ హైకోర్టు ఉత్తర్వులను సమర్థిస్తూ అత్యున్నత న్యాయస్థానం ఈ ఉత్తర్వులు జారీ చేసింది.నిందితుడు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి అయినప్పటికీ అవినీతి నిరోధక చట్టంలోని నిబంధనల ప్రకారం క్రిమినల్ కేసు నమోదు చేసే అధికార పరిధి రాజస్థాన్ ఎసిబికి ఉందని హైకోర్టు తీర్పు ఇచ్చింది.'హైకోర్టు సరైన అభిప్రాయం తీసుకుంది. కానీ సిబిఐ మాత్రమే ఈ కేసును ప్రాసిక్యూషన్ చేయగలదని చెప్పడం తప్పు' అని అత్యున్నత న్యాయస్థానం తెలిపింది.

## ఆఫీసులో రాసలీలలు..

# డిజిపి స్థాయి అధికారి సస్పెన్షన్

**న్యూఢిల్లీ:** కర్ణాటక ప్రభుత్వం డిజిపి (సివిల్ రైట్స్ ఎన్‌ఫోర్స్మెంట్)గా సేవలందిస్తున్న కె.రామచంద్ర రావును చివరికి సస్పెండ్ చేసింది. సోషల్ మీడియాలో వైరల్ అవుతోన్న కొన్ని వీడియోల్లో రామచంద్ర రావు మహిళలతో అనుచితంగా ప్రవర్తిస్తున్నట్టు ఉండటంతో ఈ మేరకు చర్యలు చేపట్టింది. మంగళవారం ఈ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసింది. రామచంద్ర రావు ప్రభుత్వ ఉద్యోగిగా నిబంధనలు ఉల్లంఘించారని ప్రభుత్వం జారీ చేసిన సస్పెన్షన్ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇది ప్రభుత్వానికీ ఇబ్బందిగా మారిందని.. ఈ క్రమంలోనే సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. సస్పెన్షన్ సమయంలో ప్రభుత్వ అనుమతి లేకుండా రామచంద్ర రావు హెడ్‌క్వార్టర్స్‌ను విడిచి వెళ్లకూడదని కూడా ఆదేశించింది.

# బిజెపి అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన నబీన్



**న్యూఢిల్లీ:** భారతీయ జనతా పార్టీ నూతన సారథిగా నితిన్ నబీన్ మంగళవారం అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. న్యూఢిల్లీలోని బిజెపి కేంద్ర కార్యాలయంలో అత్యంత వైభవంగా జరిగిన కార్యక్రమంలో ఆయన పార్టీ జాతీయ అధ్యక్షుడిగా పగ్గాలు స్వీకరించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, మాజీ అధ్యక్షుడు జెపి నడ్డా సహా పలువురు కేంద్ర మంత్రులు, బిజెపి పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. పార్టీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం వేద మంత్రోచ్చారణల మధ్య బాధ్యతల స్వీకరణ కార్యక్రమం జరిగింది. ఇప్పటివరకు అధ్యక్షుడిగా ఉన్న జెపి నడ్డా, నూతన అధ్యక్షుడు నితిన్ నబీన్‌కు పుష్పగుచ్ఛం అందించి సాదరంగా ఆహ్వానించారు. నబీన్‌ను అధ్యక్ష కుర్చీలో కూర్చోబెట్టి శుభాకాంక్షలు తెలిపారు. ప్రధాని మోదీ నూతన అధ్యక్షుడిని ఆలింగనం చేసుకుని అభినందించారు. పార్టీ అగ్రనేతలంతా వేదికపై నిలిచి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రధాని నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. పార్టీకి సంబంధించిన విషయాలలో యువ నాయకుడు తన బాస్ అని ప్రకటించారు. మంగళవారం ఢిల్లీలోని బిజెపి ప్రధాన కార్యాలయంలో జరిగిన సభలో మోదీ ప్రసంగిస్తూ, యువ శక్తి, సంస్థాగతంగా అపారమైన అనుభవం కలిగిన 45 ఏళ్ల నబిన్‌ను 'మిలీనియల్'గా అభివర్ణించారు. ప్రధాని తన ప్రసంగంలో పదే పదే నబీన్‌ను 'మననియా'గా ప్రస్తావించారు. గత 11 సంవత్సరాలుగా తన ప్రభుత్వం సాధించిన విజయాలను పేర్కొంటూ, తన పనితీరుని పార్టీ కొత్త అధ్యక్షుడికి వివరిస్తున్నానని చెప్పుకొచ్చారు. 'ఆయన చెప్పే ప్రతి మాట మనకు కొత్త దిశానిర్దేశం చేస్తుంది. ఆయన మార్గదర్శకత్వం మన భవిష్యత్ కార్యాచరణను నిర్దేశించే అమూల్యమైన ఆస్తిగా ఉంటుంది' అని ప్రధాని రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ, అమిత్ షా, జె పి నడ్డా వంటి సీనియర్ నాయకులతో పాటు కేంద్ర మంత్రులు, బిజెపి పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, అనేక మంది పార్టీ కార్యకర్తలు హాజరైన సభలో ప్రసంగించారు. 'నేను కూడా ఒక పార్టీ కార్యకర్తగా, నా పని గురించి కొత్త అధ్యక్షుడికి వివరిస్తున్నాను. నా పని గురించి ఇప్పుడు ఆయనే రాస్తారు. ఆయన మార్గదర్శకత్వం కోసం ఎదురు చూస్తున్నాను' అని మోదీ అన్నారు. సంఘతన్ పర్వ్ ముగింపు సందర్భంగా పార్టీ ప్రధాన కార్యాలయంలో నబిన్‌ను బిజెపి జాతీయ అధ్యక్షుడిగా ప్రకటించారు. ఈ సమావేశంలో బూత్ స్థాయి నుండి జాతీయ స్థాయి వరకు వివిధ పార్టీ పదవులకు ఎన్నికలు జరిగాయి. 'పార్టీ విషయాల విషయానికి వస్తే, మనానియా (గౌరవనీయ) నితిన్ నబిన్ జీ... నేను ఒక కార్యకర్తను, మీరే నా బాస్' అని మోదీ పేర్కొన్నారు. 'ఇప్పుడు, గౌరవనీయులైన నితిన్ నబిన్ జీ మనందరికీ అధ్యక్షుడు, ఆయన బాధ్యత కేవలం బిజెపిని నిర్వహించడం మాత్రమే కాదు, అన్ని ఎన్‌డిఎ మిత్ర దేశాల మధ్య సమన్వయాన్ని నిర్ధారించడం కూడా' అని ప్రధానమంత్రి అన్నారు.

## భారత్‌కోసం తూటాలను సైతం

# ఎదుర్కొనేందుకు సిద్ధం

### నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి) అధ్యక్షుడు ఫరూఖ్ అబ్దుల్లా

**జమ్ము:** తమ పార్టీ భారతదేశం కోసం బుల్లెట్లను ఎదుర్కొందని, అవసరమైతే మళ్ళీ అలా చేయడానికి సిద్ధంగా ఉందని నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి) అధ్య క్షుడు ఫరూఖ్ అబ్దుల్లా అన్నారు. ఎన్‌సి ఈ ప్రాంతంలో రాళ్ల దాడి, ఉగ్రవాదాన్ని పునరుద్ధరించాలని ప్రయత్నిస్తుందనే బిజెపి వాదనను తోసిపుచ్చారు. జమ్ములో ఎన్‌సి రెండు రోజుల బ్లాక్ అధ్యక్షులు, కార్యదర్శుల సమావేశం సందర్భంగా మంగళవారం ఫరూక్ అబ్దుల్లా విలేకరులతో మాట్లాడారు. జమ్ముకశ్మీర్‌ను కొత్తగా విభజించాలనే డిమాండ్లను మాజీ ముఖ్యమంత్రి తిరస్కరించారు. అలాంటి డిమాండ్లను మూర్ఖత్వం, అవివేకం అని అభివర్ణించారు. 2019లో ప్రత్యేక కేంద్రపాలిత ప్రాంతంగా ఏర్పాటైన లద్దాఖ్ చివరికి పూర్వ రాష్ట్రంతో తిరిగి కలుస్తుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. జమ్ముకశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతంలో అదనపు జిల్లాల ఏర్పాటును కూడా అబ్దుల్లా తోసిపుచ్చారు. పిర్ పంజాల్, చీనాబ్ లోయలకు ప్రత్యేక విభజనల డిమాండ్‌ను ఆయన విమర్శించారు. ఇది భారతదేశం, పాకిస్తాన్ మధ్య జమ్ముకశ్మీర్ వివాదాన్ని పరిష్కరించే లక్ష్యంతో 1950 సెప్టెంబర్‌లో యుఎన్ ప్రతినిధి, ఆస్ట్రేలియా మాజీ ప్రధాన న్యాయమూర్తి సర్ ఓవెన్ డిక్సన్ చేసిన ప్రతిపాదన 'డిక్సన్ ప్లాన్'లో భాగంగా అభివర్ణించారు. ఎన్‌సి, పిడిపి అశాంతిని పెంచుకుంటాయని, ఈ ప్రాంతంలో రాళ్ల దాడి, ఉగ్రవాదాన్ని పునరుద్ధరించాలని లక్ష్యంగా పెట్టుకున్నాయని బిజెపి సీనియర్ నాయకుడు చేసిన వ్యాఖ్యలపై అబ్దుల్లా నవ్వుకున్నారు.

# తమిళనాడులో మళ్లీ గవర్నర్ వర్సెస్ సర్కార్

### అసెంబ్లీ నుంచి గవర్నర్ వాకౌట్



**చెన్నై:** అసెంబ్లీ ఎన్నికలు సమీపించిన వేళ తమిళనాడులో గవర్నర్ వర్సెస్ రాష్ట్ర ప్రభుత్వం వ్యవహారం మళ్లీ మొదలైంది. తాజాగా మంగళవారం ఉదయం అసెంబ్లీ సెషన్ ప్రారంభం కాగానే రాజకీయ రగడ రాచుకుంది. శాసన సభను ఉద్దేశించి ప్రసంగించడానికి గవర్నర్ ఆర్‌ఎన్ రవి అసెంబ్లీకి చేరుకున్నారు. తొలుత తమిళనాడు రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. అనంతరం జాతీయ గీతాన్ని ప్లే చేసి, అందరూ ఆలపించాలని అసెంబ్లీ స్పీకర్ ఎం అప్పావుకు గవర్నర్ సూచించారు. అయితే అందుకు స్పీకర్ నిరాకరించారు. సభ సాంప్రదాయల ప్రకారం గవర్నర్ ప్రసంగం ముగిసాక జాతీయగీతాలాపన జరుగుతుందన్నారు. దీంతో అసెంబ్లీలో ప్రసంగించకుండానే గవర్నర్ ఆర్‌ఎన్ రవి వాకౌట్ చేశారు. అలా అసెంబ్లీ ప్రసంగించకుండా గవర్నర్ వాకౌట్ చేయండి ఇది మూడోసారి.

**మైక్‌ను స్విచ్ఛాఫ్ చేశారు, మాట్లాడనివ్వ–లేదు : గవర్నర్ కార్యాలయం**

అసెంబ్లీ నుంచి గవర్నర్ వాకౌట్ చేసిన వెంటనే, సభలో జరిగిన పరిణామాల వివరాలతో తమిళనాడు గవర్నర్ కార్యాలయం లోక్ భవన్ ఓ మీడియా ప్రకటన విడుదల చేసింది. 'సభలో పదేపదే గవర్నర్ ఆర్‌ఎన్ రవి మైక్‌ను స్విచ్ఛాఫ్ చేశారు. ఆయనను మాట్లాడనివ్వలేదు. దళితులపై దాడులు, దళిత మహిళలపై లైంగిక హింసాకాండ వంటి వ్యవహారాలను గవర్నర్ ప్రసంగంలో రాష్ట్ర ప్రభుత్వం చేర్చలేదు' అని గవర్నర్ కార్యాలయం విమర్శించింది. రాష్ట్ర ప్రభుత్వం తప్పులతడకగా ఉన్న ప్రసంగాన్ని తయారుచేసి గవర్నర్‌కు ఇచ్చిందని, అందుకే ఆయన ప్రసంగించేందుకు నిరాకరించారని స్పష్టం చేసింది. తమిళనాడుకు రూ.12 లక్షల కోట్లు విలువైన పెట్టుబడులు వచ్చాయనే అంశాన్ని ప్రసంగంలో రాశారని, అది వాస్తవదూరమైన అంశమని పేర్కొంది. మరోసారి తమిళనాడు అసెంబ్లీలో జాతీయ గీతం అవమానాన్ని ఎ దుర్కోవాల్సి వచ్చిందని లోక్‌భవన్ పేర్కొంది. ప్రా థమిక రాజ్యాంగ విధిని అసెంబ్లీ స్పీకర్ అమ లు చేయలేదని తెలిపింది. ఈ కారణాల వల్లే అసెంబ్లీ నుంచి గవర్నర్ వాకౌట్ చేశారని వెల్లడించింది.

**మేం ఇచ్చిన ప్రసంగాన్నే చదవాలి : సిఎం స్టాలిన్**

రాష్ట్ర అసెంబ్లీ సంస్కృతి, సంప్రదాయాలకు తిలోదకాలిస్తూ గవర్నర్ ఆర్‌ఎన్ రవి వాకౌట్ చేశారని తమిళనాడు సిఎం ఎంకే స్టాలిన్ ఆరోపించారు. అసెంబ్లీ సెషన్ ప్రారంభంలో గవర్నర్ ప్రసంగించాలనే సంప్రదాయానికి తూట్లు పొడిచారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తయారుచేసి ఇచ్చిన ప్రసంగాన్నే గవర్నర్ చదవాల్సి ఉంటుందని, అందులో ఆయన అభిప్రాయాలను చేర్చే అవకాశమే ఉండదని సిఎం స్టాలిన్ తేల్చి చెప్పారు. ప్రసంగంలోకి గవర్నర్ అభిప్రాయాన్ని చేర్చేలా అసెంబ్లీ రూల్స్ ఏవీ లేవన్నారు. ఆర్‌ఎన్ రవి ఉద్దేశపూర్వకంగానే గత కొన్నేళ్లుగా ఇలా చేస్తున్నారని సిఎం ఆరోపించారు. ఈ విధంగా చేయడం రాష్ట్ర అసెంబ్లీని అవమానించడమే అవుతుందన్నారు. అందుకే రాష్ట్రానికి గవర్నర్ అక్కరలేదనే వైఖరికి డిఎంకె కట్టుబడి ఉందని స్టాలిన్ చెప్పారు. గత సిఎంలు అన్నాదురై, కరుణానిధి కూడా ఇదే విధమైన వైఖరితో పనిచేశారన్నారు. తాను కూడా వారి బాటలోనే నడుస్తున్నట్లు పేర్కొన్నారు.

**గవర్నర్ ప్రసంగించినట్టుగానే నమోదు చేయిస్తాం**

'తమిళనాడు ప్రజల ఓట్లతో ఎన్నికైన మెజారిటీ ప్రభుత్వాన్ని గవర్నర్ గౌరవించి తీరాలి. ఆర్‌ఎన్ రవి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజా వేదికల్లో విష ప్రచారం చేస్తున్నారు. అసెంబ్లీలోనే ప్రభుత్వానికి వ్యతిరేకంగా గవర్నర్ మాట్లాడుతానంటే ఒప్పుకోం. గవర్నర్ వాకౌట్ చేసి వెళ్లిపోయినా ఆయన ప్రసంగం ఇంగ్లిష్ కాపీని అందరు ఎమ్మెల్యేల సిస్టమ్‌లలోకి అప్‌లోడ్ చేశాం. వారంతా దాన్ని చదువుకుంటారు. అందువల్ల గవర్నర్ ప్రసంగించినట్టుగానే అసెంబ్లీ ప్రొసీడింగ్స్‌లో వివరాలను నమోదు చేయిస్తాం. దీనిపై అసెంబ్లీలో ఒక తీర్మానాన్ని కూడా ఆమోదించాం అని సిఎం స్టాలిన్ వెల్లడించారు.

# కొన్ని అంశాలను గవర్నర్ చదవలే

### అసెంబ్లీలో కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్




కేంద్రంపై విమర్శలు గుప్పించిన విజయన్

**తిరువనంతపురం:** కేరళలో మంగళవారం ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. సమావేశాల ప్రారంభం సందర్భంగా గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ ప్రభుత్వం ఇచ్చిన ప్రసంగ కాపీలో కొన్ని అంశాలను చదవలేదని ముఖ్యమంత్రి పినరయి విజయన్ పేర్కొన్నారు. అర్లేకర్ సభ నుంచి నిష్క్రమించిన అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడారు. ప్రసంగంలో 12వ పేరా నుంచి 15 పేరా వరకు చదవలేదని స్పీకర్‌కు వెల్లడించారు. గవర్నర్ చేసిన పని రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. గవర్నర్ ప్రసంగించని పేరాల్లో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించే కొన్ని ముఖ్యమైన అంశాలున్నట్లు పేర్కొన్నారు. ఆర్థిక సంక్షోభం, పెండింగ్ బిల్లులు వంటి అంశాలను గవర్నర్ విస్మరించినట్లు తెలిపారు. 12వ పేరాలో సమాఖ్య విధానం, కేంద్రం తీసుకుంటున్న చర్యల గురించి, 15వ పేరాలో రాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభం వంటి విషయాలున్నట్లు ఆయన చెప్పారు. అయితే, వాటి గురించి గవర్నర్ ప్రసంగించకపోవడం రాజ్యాంగ స్ఫూర్తికి, సభా పద్ధతులకు విరుద్ధమని అన్నారు. గవర్నర్ విస్మరించిన అంశాలను జోడించి మంత్రివర్గం ఆమోదించిన ప్రసంగాన్ని ప్రామాణిక ప త్రంగా అంగీకరించాలని స్పీకర్‌ను అభ్యర్థించారు. మరోవైపు, కేంద్ర ప్రభుత్వంపై ముఖ్యమంత్రి విజయన్ విమర్శలు గుప్పించారు. ఆర్థిక సమాఖ్య విధానం, రాజ్యాంగ విలువలను కేంద్ర ప్రభుత్వం దెబ్బతీస్తోందని మండిపడ్డారు. ఫలితంగా కేరళ తీవ్రమైన ఆర్థిక సంక్షోభం ఎదుర్కొంటోందన్నారు. రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లులు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వం ఈ అంశంపై సుప్రీంకోర్టును ఆశ్రయించిందని తెలిపారు. అయితే అందుకు సంబంధించిన విషయాలు 12, 15వ పేరాలో ఉన్నాయని పేర్కొన్నారు. అయితే సభా నిబంధనల ప్రకారం రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించిన ప్రసంగాన్నే అధికారికంగా భావిస్తామని స్పీకర్ తెలిపారు. కొన్ని అంశాలను వదిలేస్తూ గవర్నర్ చేసిన ప్రసంగాన్ని అధికారికంగా గుర్తించబోమన్నారు. మంత్రివర్గం ఆమోదించిన ప్రసంగం కాపీలను మీడియాకు అందజేయాలని స్పీకర్ ఆదేశించారు.

# ట్రంప్ వివాదాల ఏడాది!

అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ రెండవ పదవీకాలం ప్రారంభమై ఏడాది గడిచిన వేళ, దేశ, విదేశీ రాజకీయాలు సుడిగుండంలా తిరుగుతున్నాయి. 'అమెరికా ఫస్ట్' నినాదాన్ని మరింత దూకుడుగా అమలు చేస్తూ, ఆయన తన మద్దతుదారులకు ఇచ్చిన వాగ్దానాలను వేగంగా నెరవేర్చే ప్రయత్నంలో పడ్డారు. కానీ ఈ వేగం, ఈ దూకుడు ఏకపక్షంగా మారడంతో, ఆశించిన ఫలితాలకు విభిన్నమైన, లోతైన ప్రతికూల ప్రభావాలను చూపుతున్నాయి. ట్రంప్ పాలన అమెరికా శక్తిని బలోపేతం చేస్తోందా? లేక అనుకోకుండా అమెరికా ఆధిపత్యానికే గండికొడుతోందా? ప్రపంచ వ్యాప్తంగా ఇదే చర్చ. ట్రంప్ ప్రభుత్వం తీసుకున్న పలు నిర్ణయాలపై అమెరికన్ల నుంచి సామూహిక అసంతృప్తి వ్యక్తమవుతున్నది. ఆయన అనుసరిస్తున్న విదేశాంగ విధానాలు అమెరికాను ఒంటరిని చేసే దిశగా సాగుతున్నాయి. ఇంటాబయటా తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న ట్రంప్ తన పంథాను మార్చుకుంటారా? లేక మరింత మొండిగా ముందుకెళ్లి మరిన్ని వివాదాలను, విధ్వంసాలను సృష్టిస్తారా? అన్నది ఆందోళన రేపుతున్న ప్రశ్న. ట్రంప్ తీసుకున్న అత్యంత కఠినమైన నిర్ణయాల్లో ఒకటి వలసలు.. మరొకటి సరిహద్దు భద్రత. ఏడాది కాలంలోనే 6 లక్షలకుపైగా బహిష్కరణలు, 10 లక్షలకుపైగా స్వచ్ఛంద నిష్క్రమణలు నమోదయ్యాయి. నికర వలస ప్రవాహం ప్రతికూలంగా మారింది.

> ప్రపంచ ఆరోగ్య సంస్థ, యునెస్కో, పారిస్ ఒప్పందం నుంచి వైదొలగడం, వెనెజులా అధ్యక్షుడు నికొలస్ మదురోను బందీగా పట్టుకోవడం, పనామా కాలువపై దూకుడు, గ్రీన్ల్యాండ్‌ను సొంతం చేసుకోవాలన్న బెదిరింపులు వంటి చర్యలు 1823లో అప్పటి అమెరికా అధ్యక్షుడు జేమ్స్ మన్రో అమలు చేసిన సిద్ధాంతాన్ని పునరుద్ధరించే ప్రయత్నాలుగా కనిపిస్తున్నాయి. ట్రంప్ విదేశాంగ విధానాలు, తొందరపాటు నిర్ణయాల కారణంగా కెనడా వంటి మిత్ర దేశాలకు అమెరికా దూరమవుతున్నది.

లేకెన్ రిలే చట్టం పునరుద్ధరణ, జాతీయ ఆర్థిక అత్యవసర పరిస్థితి ప్రకటన, గ్వాంటనామో సహా నిర్బంధ కేంద్రాల విస్తరణ వంటి వివాదాస్పద నిర్ణయాలు చట్టపరంగా, పరిపాలనా పరంగా వేగంగా అమలయ్యాయి. ట్రంప్ మద్దతుదారుల దృష్టిలో ఈ చర్యల వల్ల సరిహద్దు దాటే ప్రయత్నాలు తగ్గాయి. ఆశ్రయం కోరే అభ్యర్థనలు క్షీణించాయి. కఠినతే పరిష్కారం అన్న నమ్మకం ఓటర్లలో బలపడింది. కానీ ఈ వాదన వెనుక దాగి ఉన్న మానవ కథలు భయానకమైనవి. కుటుంబాల విభజన, పౌరుల తప్పుడు నిర్బంధాలు, చట్టవిరుద్ధ చర్యల పేరిట విచారణలు సహజంగానే దేశవ్యాప్తంగా ఆగ్రహాన్ని ప్రజ్వలింపచేశాయి. లాస్ ఏంజిల్స్, మిన్నియాపొలిస్ వంటి నగరాల్లో జరిగిన నిరసనలు హింసాత్మకంగా మారాయి. నేషనల్ గార్డ్ మోహరింపులు ప్రజాస్వామ్య విలువలపై ప్రశ్నలు సంధిస్తున్నాయి. జన్మతః పౌరసత్వాన్ని పరిమితం చేసే ప్రయత్నాలను కోర్టులు అడ్డుకోవడం, ఈ విధానాల చట్టపరమైన బలహీనతను స్పష్టం చేస్తున్నది.

గత ఏడాది జులైలో ట్రంప్ సంతకం చేసిన 'వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్' ఆయన ఆర్థిక దృక్పథానికి ప్రతిరూపం. ఇక, సుంకాల విధానం మరింత వివాదాస్పదం. సార్వత్రికంగా 10 శాతం, చైనా, భారత్, మెక్సికో వంటి దేశాలపై 25–50 శాతం సుంకాలు విధించడం ద్వారా, 'స్వదేశీ పరిశ్రమల రక్షణ' అనే వాదనను ట్రంప్ తెరపైకి తెచ్చారు. కానీ, ప్రతీకార సుంకాలు ఎగుమతులను దెబ్బతీశాయి. స్టాక్ మార్కెట్లు అస్థిరంగా మారాయి. మరోవైపు, ట్రంప్ ప్రకటించిన రాయితీలు, మినహాయింపులు ఆయన రాజకీయ మద్దతుదారులకు అనుకూలంగా ఉన్నాయన్న ఆరోపణలు. ఆరోగ్య శాఖలో 'మేక్ అమెరికా హెల్తీ ఎగైన్' నినాదం కింద తీసుకున్న నిర్ణయాలు శాస్త్రీయ సమ్మతిని ప్రశ్నిస్తున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ, యునెస్కో, పారిస్ ఒప్పందం నుంచి వైదొలగడం, వెనెజులా అధ్యక్షుడు నికొలస్ మదురోను బందీగా పట్టుకోవడం, పనామా కాలువపై దూకుడు, గ్రీన్‌ల్యాండ్‌ను సొంతం చేసుకోవాలన్న బెదిరింపులు వంటి చర్యలు 1823లో అప్పటి అమెరికా అధ్యక్షుడు జేమ్స్ మన్రో అమలు చేసిన సిద్ధాంతాన్ని పునరుద్ధరించే ప్రయత్నాలుగా కనిపిస్తున్నాయి. ట్రంప్ విదేశాంగ విధానాలు, తొందరపాటు నిర్ణయాల కారణంగా కెనడా వంటి మిత్ర దేశాలకు అమెరికా దూరమవుతున్నది. ఐరోపా దేశాల్లో అమెరికాపై నమ్మకం కనిష్టానికి పతనమైంది. ఈ ఖాళీని చైనా, బ్రిక్స్ వంటి కూటమి భర్తీ చేస్తున్నాయి. అమెరికా ఆధిపత్య ధోరణికి, సామ్రాజ్యవాద విధానాలకు కళ్లెం వేస్తున్నాయి. అమెరికా ఆధిపత్యాన్ని బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ప్రారంభమైన ట్రంప్ చర్యలు, అదే ఆధిపత్యం క్షీణించడానికి కారణమవుతున్నాయి. చైనా 'వన్ బెల్ట్.. వన్ రోడ్' నినాదంతో, ప్రపంచ దేశాలను ఏకం చేస్తున్నది. బ్రిక్స్‌లో కొత్త సభ్యులు చేరుతున్నారు. పాలస్తీనాపై కక్షకట్టిన ఇజ్రాయెల్‌ను వెనకేసుకొస్తున్నందుకు ప్రపంచవ్యాప్తంగా అత్యధిక దేశాలు అమెరికాను దుయ్యబడుతున్నాయి. స్వదేశంలో నిరసనలు...ప్రపంచవ్యాప్తంగా విమర్శలు... ట్రంప్ రెండవ పదవీకాలంలో ఏడాది వివాదాలతోనే గడిచిపోయింది. మరో మూడేళ్లలో ఏం జరుగుతుందనేది ప్రస్తుతానికి సమాధానం లేని ప్రశ్న. అయితే, కొన్నిసార్లు విధ్వంసమే పరివర్తనకు మార్గాన్ని సుగమమం చేస్తుందని చరిత్ర నిరూపిస్తున్నది. ట్రంప్ అతిగా వ్యవహరించడం, అమెరికన్ ప్రజాస్వామ్యాన్ని పటిష్టపరిచేందుకు ప్రజలను కార్యోన్ముఖులు చేసే అవకాశం లేకపోలేదు. 'ట్రంపిజం' తుపాను భూమిని కుదిపేస్తోంది. ట్రంప్ విధానాల పట్ల వ్యక్తమవుతున్న నిరసనలు అమెరికాలో ఏ కొత్త విధానాలకు బీజాలు వేస్తాయో? ఏ కొత్త వెలుగులకు బాటలు సిద్ధం చేస్తాయో చూడాలి.



## 100 రోజుల క్యాలెండర్‌ను అనుసరించాలి

**పార్లమెంటు, అసెంబ్లీ సమావేశాల వ్యవధి ఏమిటి? సంవత్సరానికి కనీసం 100 రోజుల క్యాలెండర్‌ను అనుసరించాలి. ప్రభుత్వం, ప్రతిపక్షాలు రెండూ ఈ విషయాన్ని చాలా తీవ్రంగా పరిగణించి, దానిపై చర్య తీసుకోవాలి. పార్లమెంట్, రాష్ట్ర శాసనసభలు దేశ రాజ్యాంగ, ప్రజాస్వామ్య వ్యవస్థకు కీలకమైన స్తంభాలు. ప్రభుత్వం/కార్యనిర్వాహక వ్యవస్థను దేశానికి, ప్రజలకు జవాబుదారీగా ఉంచడానికి శక్తివంతమైన సాధనంగా పనిచేస్తాయి. పార్లమెంటు, శాసనసభల కార్యకలాపాలు శాంతియుతంగా, సరైన నియమాలకు అనుగుణంగా, సంవత్సరానికి కనీసం 100 రోజుల క్యాలెండర్‌ను అనుసరించడం చాలా అవసరం.**

బహుజన్ సమాజ్ పార్టీ అధినేత్రి మాయావతి



## బంగారు భవిష్యత్తుపై కల్తీ విషం!

### ఔషధ మాఫియా అరాచకాలపై పటిష్టమైన నిఘా ఏదీ?

పసిపిల్లల ఆరోగ్యం నేడు కల్తీ మందుల కోరల్లో చిక్కుకుని విలవిల్లాడుతోంది. ప్రాణాలను కాపాడాల్సిన ఔషధాలే మృత్యుపాశాలుగా మారుతున్న ఉదంతాలు వరుసగా వెలుగులోకి వస్తుండటం పౌర సమాజాన్ని ఉలిక్కిపడేలా చేస్తోంది. ఇటీవల బయటపడిన ప్రాణాంతక మందుల వ్యవహారం కేవలం ఒక సంస్థ చేసిన పొరపాటుగా చూడలేం; ఇది వ్యవస్థీకృత వైఫల్యంగా, పాలకుల ఉదాసీనతకు నిదర్శనంగా కనిపిస్తోంది. ఒక మందు విపణిలోకి వచ్చి వేలాది మంది పిల్లల శరీరాల్లోకి ప్రవేశించిన తర్వాత, అది విషపూరితమని అధికారులు గుర్తించడం వల్ల ప్రయోజనం ఏమిటనే నిలదీతలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

ఈ ప్రాణాంతక పరిస్థితులకు తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (DCA), సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (CDSCO)ల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని స్పష్టమవుతోంది. మందుల నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాల్సిన ఈ సంస్థలు, కేవలం కార్యాలయాలకే పరిమితమవ్వడం వల్ల కల్తీ మాఫియా చెలరేగిపోతోంది. క్షేత్రస్థాయిలో తయారీ కేంద్రాలను తనిఖీ చేయడంలో, ముడి పదార్థాల నాణ్యతను పరీక్షించడంలో ఈ రెండు కీలక సంస్థలు ఘోరంగా విఫలమయ్యాయి. అనుమతులు ఇచ్చే సమయంలో చూపించే అత్యుత్సాహం, నాణ్యతను పరీక్షించే సమయంలో మృగ్యమవుతోంది. అధికారుల పర్యవేక్షణా లోపం వల్లే విషపూరిత రసాయనాలు మందుల్లోకి చేరుతున్నాయని నిపుణులు మండిపడుతున్నారు.

సాధారణంగా ఏదైనా ఒక ఔషధం తయారీ కేంద్రం నుంచి బయటకు రావడానికి ముందే దాని నాణ్యతను ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రయోగశాలల్లో శాస్త్రీయంగా పరీక్షించాల్సిన అవసరం ఉంది. అయితే, ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనలు కంపెనీలకు మితిమీరిన వెసులుబాటును కల్పిస్తున్నాయి. 'స్వీయ ధృవీకరణ' పేరుతో కంపెనీలే తమ మందుల నాణ్యతను తామే నిర్ధారించుకుని విక్రయాలకు విడుదల చేసే అవకాశం ఉండటం పెను ప్రమాదానికి దారితీస్తోంది. ఈ వెసులుబాటునే పెట్టుబడిగా మార్చుకున్న కొన్ని స్వార్థపూరిత కంపెనీలు, లాభాల వేటలో ముడి పదార్థాల నాణ్యతను పూర్తిగా పక్కన పెడుతున్నాయి. ముఖ్యంగా ద్రవ రూప మందుల తయారీలో వాడే ఖరీదైన రసాయనాలకు బదులుగా, పారిశ్రామిక అవసరాల కోసం వాడే అత్యంత విషపూరితమైన పదార్థాలను వాడుతున్నాయి. ఔషధ అనుమతుల ప్రక్రియలో ఉన్న లొసుగులు కల్తీ ముఠాలకు వరంగా మారుతున్నాయి. ఒక రాష్ట్రంలో తయారీ అనుమతి పొందిన కంపెనీ తన ఉత్పత్తులను దేశవ్యాప్తంగా ఎక్కడైనా విక్రయించవచ్చు. దీనివల్ల ఒక రాష్ట్రంలోని ఔషధ నియంత్రణ అధికారులకు మరో రాష్ట్రంలోని తయారీ కేంద్రాలను నేరుగా తనిఖీ చేసే అధికారం ఉండదు. కేవలం మందుల దుకాణాల్లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న నమూనాలను మాత్రమే వారు సేకరించగలరు. ఈ నమూనాలు సేకరించి, వాటిని ప్రయోగశాలకు పంపి నివేదిక వచ్చేసరికి నెలల సమయం పడుతోంది. ఈ లోపు ఆ విడతకు సంబంధించిన వేలాది సీసాల మందు అప్పటికే ప్రజల శరీరాల్లోకి చేరుతున్నది. ప్రాణాలు పోయాక 'వాడకం నిలిపివేయండి' అని నోటీసులు ఇవ్వడం అనేది యుద్ధం ముగిశాక ఆయుధాలు తీయడం వంటిదని విమర్శలు వస్తున్నాయి. ఇకనైనా కేంద్ర ఔషధ నియంత్రణ సంస్థ (CDSCO) మరియు రాష్ట్రాల విభాగాలు మేల్కోవాల్సిన అత్యవసర పరిస్థితి ఏర్పడింది. పత్రాల మీద సంతకాలు చేసి అనుమతులు ఇవ్వడమే కాకుండా, ప్రతి తయారీ దశలోనూ నిశితమైన నిఘా ఉంచాలి. మందు విపణిలోకి విడుదల కావడానికి ముందే ప్రతి విడతను స్వతంత్ర ప్రయోగశాలల ద్వారా పరీక్షించి, 'నాణ్యత ధృవీకరణ' పత్రం ఉంటేనే విక్రయాలకు అనుమతించాలనే నిబంధనను తక్షణమే అమల్లోకి తీసుకురావాలి. వ్యవస్థలలో కఠినమైన ప్రక్షాళన జరగాలి.

**వెంకగారి భూమయ్య,**
**9848559863**

# విపరీతంగా పెరుగుతున్న అసమానతలు: మంచిరోజులేవి మోదీజీ?



ఎం.కోటేశ్వరరావు

సంపదల అసమానత విపరీతంగా పెరుగుతున్నదని, సంపదల పున:పంపిణీ జరగకపోతే సామాజిక సంక్షోభానికి దారితీస్తుందని అనేక మంది చెబుతున్నారు. అయితే ఈ మాటలు చెప్పేవారిలో సంపన్నుల బాగు కోరుకొనే వారే ఎక్కువగా ఉన్నారు. వారి ఉద్దేశ్యం ఏమిటంటే కొంత మంది దగ్గరే అపార సంపద పోగుపడితే మొదటికే మోసం వస్తుందన్నదివారిఉద్దేశ్యం. అయితే నిజంగా మంచి కోరుకుంటున్నవారు లేరా అంటే ఉన్నారు.

''2026 ప్రపంచ అసమానతల నివేదిక'' డిసెంబరులో విడుదలైంది. 2018, 22 తరువాత ఇది మూడవది.ప్రపంచంలో, మనదేశంలో కూడా అసమానత తీవ్ర స్థాయిలో ఉందని హెచ్చరించింది. ఈ నివేదికను రూపొందించిన వారు ల్యూకాస్ ఛాన్సెల్, రికార్డో గోమెజ్ కరేరా, రొవాయిడా మోషిరిఫ్, థామస్ పికెటి. ఆ నివేదికకు మన దేశానికి చెందిన జయతి ఘోష్,జోసెఫ్ స్టిగ్లిజ్ ముందు మాటరాశారు. సంపాదకుల్లో చివరి వ్యక్తి ఫ్రెంచి ఆర్థికవేత్త థామస్ పికెటి గురించి తెలుగువారికి కొంతమేరకు తెలుసు,ఎందుకంటే ఆర్థిక అసమానతల గురించి ఆయన హెచ్చరించిన అంశాలు గతంలో చర్చనీయాంశమయ్యాయి. అసమానతలు అంటే కేవలం సంపదకే పరిమితం కాదు, వాతావరణ, లింగపరమైన, అవకాశాలు లభ్యత, చివరికి ఎన్నికల కోసం నియోజకవర్గాల విభజనలో వివక్షతో సహా ఇతర అంశాలు ఉన్నాయి. ప్రపంచ అసమానతల సమాచార సంస్థకు అనుబంధంగా ఉన్న రెండువందల మందికి పైగా పరిశోధకులు అనేక కోణాల్లో చేసిన విశ్లేషణల సారమే ప్రపంచ అసమానతల నివేదిక. అన్ని అంశాలను ఇక్కడ సృజించటం సాధ్యం కాదు గనుక సంపదల పున:పంపిణీ గురించి చర్చిద్దాం. ప్రపంచాన్ని '' కమ్యూనిస్టు భూతం '' ఆవహించకుండా, జనం దానివైపు మరలకుండా చూసేందుకు పెట్టుబడిదారీ ఆర్థిక, సామాజికవేత్తలు అనేక అంశాలను ముందుకు తెచ్చారు. వాటిలో ఊట సిద్ధాంతం ఒకటి.

ప్రభుత్వాలు కేవలం పాలనకే పరిమితమై అన్ని రంగాలను ప్రైవేటు సంస్థలు, వ్యక్తులకే అప్పగిస్తే వారు సృష్టించే సంపదల మూట నుంచి ఊట యావత్ సమాజానికి దిగుతుందన్నది ఊట(tricle down) సిద్ధాంతం. దానికి సంస్కరణలు, నూతన ఆర్థిక విధానాల వంటి ముద్దుపేర్లు పెట్టారు, జనం కూడా నిజమే అని నమ్మారు, తమకూ సంపదల ఊట దిగుతుందేమోనని పోరాటాలు మాని ఆశతో చెంబులు పట్టుకు ఎదురు చూశారు, ధారలేమీ కారలేదు, కేవలం కొన్ని చుక్కలు మాత్రమే పడ్డాయి. దాంతో ఫలితం లేదని అసంతృప్తి చెందటం ప్రారంభించారు. సోషలిస్టు సమాజాల కోసం జనం చూడకుండా కొన్ని తాయిలాలు అందించి సంతృప్తిపరచేందుకు ఐరోపాలో అనేక ప్రయోగాలు చేశారు. సంక్షేమ పథకాలు అమలు జరిపి సోషలిజంలో ఇంతకంటే పెద్దగా ఒరిగేదేమిటని జనాన్ని కొంతకాలం మభ్యపెట్టారు. ప్రథమ సోషలిస్టు రాజ్యం సోవియట్ యూనియన్ కూలిపోవటంతో కమ్యూనిజం, సోషలిజాలపై విజయం సాధించామని, ఆ ప్రయోగం విఫలమైందని ప్రచారం చేశారు. అంతేనా పోటీ లేకపోవటంతో అప్పటి వరకు అమలు జరిపిన అనేక సంక్షేమాలకు కోత పెట్టటం ప్రారంభించారు. అసమానతలు అప్పటి నుంచి మరింత పెరగటంతో జనాన్ని తప్పుదారి పట్టించేందుకు సంపదల పున:పంపిణీ అవసరమంటూ మరో పల్లవి అందుకున్నారు.సూత్రరీత్యా దీన్ని ఎవరూ వ్యతిరేకించరు, అయితే అది ఎలా అన్న అంశంమీదే తేడా వస్తున్నది. సంపదలు పంచినంత మాత్రాన వేగంగా దారిద్ర్యం తగ్గుతుంది తప్ప ఆర్థిక వృద్ధి జరగదని, జనాలను సోమరులుగా మారుస్తాయని కొందరు చెబుతున్నారు. కొన్ని సంస్థలు, కొందరు వ్యక్తులు ఈ మంచి సంస్కరణ అంశాన్ని ప్రచారం చేసి జనాన్ని సమీకరించేందుకు చూస్తున్నాయి. అసలేమీ లేనిదాని కంటే ఏదో ఒకటి మంచిదే.అయితే భ్రమలు పెట్టుకోనవసరం లేదని చెప్పక తప్పదు.

అసమానతల గురించి తాజా నివేదికలో పేర్కొన్న అంశాలను క్లుప్తంగా చూద్దాం.మచ్చుకు ఒకటి, సబ్ సహారా ప్రాంతంలో ఒక బిడ్డ మీద పిపిపి పద్ధతిలో 200యూరోలు ఖర్చు చేస్తుండగా ఐరోపాలో 7,400, ఉత్తర అమెరికా, ఓషియానా దేశాల్లో 9,000 యూరోలు వెచ్చిస్తున్నారు. ప్రపంచంలో 0.001శాతం అంటే అరవైవేల మంది కంటే తక్కువ ఉన్న కోటీశ్వరులు దిగువన ఉన్న 50శాతం జనాభా మొత్తం సంపదల కంటే మూడు రెట్లు ఎక్కువ కలిగి ఉన్నారు. ప్రతి ఏటా ప్రపంచ జిడిపిలో ఒకశాతం ధనికదేశాలకు తరలుతున్నది.ఇది ప్రపంచ వృద్ధికి ఇస్తున్నట్లు చెబుతున్న సాయానికి మూడు రెట్లు ఎక్కు వ. స్త్రీ, పురుష వేతన తేడా అన్ని చోట్లా ఉంది. గంటకు ఒక పురుషుడు పొందే వేతనంలో మహిళకు వస్తున్నది 61శాతమే, వేతన చెల్లింపులేని పనిగంటలను కూడా లెక్కిస్తే ఈ తేడా 32శాతానికి దిగజారుతుంది.

ప్రపంచ అసమానతల సమాచార కేంద్ర వివరాల ప్రకారం దిగువ విధంగా మనదేశంలో అసమానత పెరిగింది.దీన్ని రెండుగా విభజించి చూడాలి.1990 దశకంలో నూతన ఆర్థిక విధానాలను ప్రవేశపెట్టక ముందు, తరువాత సమాజంలోని మూడు తరగతుల సంపదలు ఎలా పెరిగాయో చూడవచ్చు.

| సంవత్సరాలు | దిగువ 50శాతం | ఎగువ 10శాతం | ఎగువ ఒక శాతం |
|---|---|---|---|
| 1961–1970 | 12.29 | 43.18 | 11.87 |
| 1971–1980 | 11.75 | 42.25 | 11.23 |
| 1981–1990 | 10.91 | 45.00 | 12.50 |
| 1991–2000 | 8.36 | 54.57 | 23.31 |
| 2001–2010 | 8.10 | 56.60 | 25.70 |
| 2010–2020 | 6.12 | 63.68 | 31.55 |

దీన్ని ముందే చెప్పుకున్నట్లుగా రెండు భాగాలుగా చేస్తే 1961 నుంచి 1990 వరకు సగటు దిగువ 50శాతం జనాభా వాటా 11.65శాతం కాగా ఎగువ పదిశాతం 43.47,ఎగువ ఒకశాతం 11.86శాతం కలిగి ఉన్నారు. ఇదే 1990 నుంచి 2020 వరకు వరుసగా 7.5258, 2826.85శాతం ఉన్నారు. నూతన ఆర్థిక విధానాలు అమలు జరిగిన మూడుదశాబ్దాలలో ఎగువ ఒకశాతం వాటా 226, పదిశాతం మంది వాటా 134శాతం పెరగ్గా దిగువ 50శాతం వాటా 63శాతం తగ్గింది.తాజా అంచనా ప్రకారం ఒకశాతం ధనికుల సంపద 40శాతానికి చేరింది. మంచి రోజులు తీసుకువస్తానని చెప్పిన నరేంద్ర మోడీ సంస్కరణలను మరింత వేగంగా అమలు జరుపుతానని కూడా చెప్పారు. దాని ఫలితం ఏమిటో చూశాము. కార్పొరేట్ పన్ను గణనీయంగా తగ్గించిన కారణంగా ఏటా లక్ష కోట్ల రూపాయలకు పైగా ఖజానా కోల్పోతున్నది. పోనీ ఆ మేరకు ఆయా సంస్థలు పెట్టుబడులు పెట్టి ఉపాధి కల్పిస్తున్నాయా అంటే అదీ లేదు. పర్మనెంటు ఉద్యోగుల సంఖ్య నానాటికీ తగ్గుతున్నది.మన దేశ కార్పొరేట్ సంస్థలకు పన్ను తగ్గించిన కారణంగా వాటిలో పెట్టుబడులు పెడితే లాభసాటిగా ఉండటంతో విదేశీ కంపెనీలు నేరుగా పరిశ్రమల స్థాపనకు బదులు ఉన్న కంపెనీల వాటాలను స్టాక్‌మార్కెట్‌లో కొనుగోలు, విక్రయాలు చేస్తూ లాభాలను తమ దేశాలకు తరలించుకుపోతున్నాయి.

ఆదాయాన్ని బట్టి పన్ను విధించి, ఆ మేరకు అల్పాదాయవర్గాలకు రాయితీల రూపంలో సంపదల పంపిణీ ఒక పద్ధతి. లాటిన్ అమెరికాలోని బ్రెజిల్‌లో అసమానతలు, దారిద్ర్య నిర్మూలన పథకాల్లో భాగంగా షరతులతో కూడిన నగదు బదిలీ పథకాలను అమలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో అమలు జరుగుతున్న అమ్మవడి, తల్లిదీవెన పథకాలు వాటికి నకలే. తమ బుర్రలో పుట్టినవే అని ఎవరైనా చెప్పుకుంటే బడాయి తప్ప మరొకటి కాదు. 2003లో వామపక్ష నేత లూలా డ సిల్వా అధికారానికి వచ్చినపుడు అంతకు ముందున్న కొన్ని పథకాల అనుభవాలను చూసి మరింత లబ్ది చేకూరేవిధంగా అల్పాదాయ వర్గాలకు ఈ పథకాన్ని అమలు చేశారు. పిల్లలను బడికి పంపటం, టీకాలు వేయించిన వారికి నగదు బదిలీ జరిగింది.దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారు దీనికి అర్హులు. అంతర్జాతీయంగా అది ప్రశంసలు పొందింది. అది ఇప్పటికీ కొనసాగుతోంది,సంపదల పంపిణీ వలన దారిద్ర్య తీవ్రత తగ్గుతుంది తప్ప అసమానత తొలగదు. గమనించాల్సిందేమంటే రెండు దశాబ్దాల తరువాత చూస్తే అసమానతలు ఎక్కువగా ఉన్న పది ప్రపంచ దేశాల్లో బ్రెజిల్ ఒకటిగా ఉంది. అందువలన సంపదల పంపిణీ గురించి మరింత నిర్దిష్టంగా మధనం జరగాల్సి ఉంది. తమ ప్రత్యేక లక్షణాలతో సోషలిస్టు వ్యవస్థ నిర్మాణం చేస్తున్నట్లు ప్రకటించిన చైనాలో కూడా ఆర్థిక అసమానతలు ఉన్నాయి, అయితే వాటిని తగ్గించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు కమ్యూనిస్టు పార్టీ ప్రకటించింది.

ఈ నివేదిక ప్రకారం సమాజంలో ప్రపంచంలో ఎగువన ఉన్న పదిశాతం మంది వద్ద సంపద 58శాతం ఉంది (2022లో 57శాతం) దిగువన ఉన్న 50శాతం మందికి 15శాతం(2022లో 13శాతం). ఇంతకు ముందు పట్టికలో సంపదల పెరుగుదల రేటు చూశాము, ఉన్న సంపదల మొత్తం వేరు,పెరుగుదల రేటు వేరు. భారత్ మరియు చైనా గురించి చెప్పిందేమంటే ప్రపంచ మధ్యతరగతిలోకి చైనా జనాభా ఎక్కువ మంది చేరారని, అదే భారత్‌లో 1980లో మధ్య తరగతిలో ఉన్న 40శాతంలో ఎక్కువ మంది ఇప్పుడు దిగువ 50శాతంలోకి దిగజారినట్లు పేర్కొన్నది. కార్పొరేట్లకు పన్ను తగ్గించిన కారణంగా సంపదలు పోగుపడటం ఒకటైతే రాష్ట్రాలకు రావాల్సిన పన్ను రాబడి తగ్గుతున్నది, అది సంక్షేమ పథకాల మీద ప్రతికూల ప్రభావం చూపుతున్నది. ఉదాహరణకు వెనుకబడిన తరగతుల వారికి 50 ఏండ్లకే పెన్షన్ ఇస్తామని చంద్రబాబు, ఆంధ్రప్రదేశ్ మాదిరి సామాజిక పెన్షన్లు నాలుగువేలకు పెంచుతామని చెప్పిన తెలంగాణా కాంగ్రెస్ వాగ్దానం అమలుకు నిధులు లేవు, బిజెపి పాలిత రాష్ట్రాలలో పరిస్థితి మరీ అధ్వానం, వారికి అసలు ఆ ఉద్దేశ్యమే లేదు అని వేరే చెప్పనవసరం లేదు. యుపిఏ ప్రభుత్వ హయాంలో నిర్ణయించిన పెన్షన్ మొత్తాలనే మోడీ సర్కార్ ఇప్పటికీ అందిస్తున్నది తప్ప పైసా పెంచలేదు. దాని మానవత్వ ముఖం అలా ఉంది. అందువలన మరో విధంగా చెప్పాలంటే సంపదల పున:పంపిణీని దెబ్బతీస్తున్నది.

'' చెడుగా మారేంత వరకు అసమానత మౌనంగానే ఉంటుంది.ఈ నివేదిక అసమానతకు మరియు నేటి అసమాన సామాజిక, ఆర్థిక నిర్మాణాలతో అవకాశాల నిరాకరణకు గురైన వందల కోట్ల మందికి గళాన్ని ఇస్తుంది'' అని ప్రపంచ అసమానతల నివేదిక సంపాదకుల్లో ఒకరైన రికార్డో గోమెజ్ కరేరా వ్యాఖ్యానించాడు. ముందుమాట రాసిన వారిలో ఒకరైన జోసెఫ్ స్టిగ్లిజ్ ఇలా చెప్పారు.'' నేటి విపరీత అసమానత అనివార్యమైనదేమీ కాదని చరిత్ర, అన్ని దేశాల అనుభవాలు, సిద్ధాంతం కూడా చెబుతున్నది.పురోగామి పన్ను విధానం( సంపద పెరిగే కొద్దీ పన్నుల పెంపు), పెద్దమొత్తంలో సామాజిక పెట్టుబడి,న్యాయమైన కార్మిక ప్రమాణాలు, ప్రజాస్వామిక వ్యవస్థలు గతంలో తేడాలను తగ్గించాయి. ఇదే మరోసారి చేయగలవు ''. సంపదల పున:పంపిణీ జరగాలని కోరుకొనే వారు ప్రచారానికి మాత్రమే పరిమితం కారాదు, కార్యాచరణకూ పూనుకోవాలి !

# ముంబయిలో రాజకీయంగా స్తంభించిన బిజెపి

### డాక్టర్ గ్యాన్ పాథక్

మహారాష్ట్రలో 29 మున్సిపల్ కార్పొరేషన్‌ల ఎన్నికల్లో బిజెపి అద్భుత విజయాలు సాధించి రాజకీయంగా స్థిరపడినట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది, అది వాస్తవమా? ముంబయిలో రాజకీయంగా బిజెపి ఎదుగుదల స్తంభించినట్లు బిఎంసి ఫలితాల విశ్లేషణ తెలుపుతున్నది. 2017 ఎన్నికల్లో తారాజువ్వలా 51 సీట్లు పెంచుకుని 82 సీట్లకు చేరుకున్న బిజెపికి తాజా ఎన్నికల స్థితి ఏమిటి? ఈ పర్యాయం దాని సీట్లు 7 మాత్రమే పెరిగాయి. కాంగ్రెస్ కోల్పోయిన సీట్లు 7. థాకరేలు దాదాపు మూడు దశాబ్దాల తదుపరి బ్రిహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ కోల్పోవటం మీడియా పతాక శీర్షికల కెక్కింది. అయితే 227 సీట్లలో 65 గెలుపొంది వారు ఇప్పటికీ బలమైన శక్తిగానే ఉన్నారు. 89 సీట్లు గెలిచిన బిజెపి తర్వాత రెండవ స్థానం వారిదే. మిగతా రాష్ట్రంలో కాంగ్రెస్ స్థూలంగా ప్రధాన ప్రతిపక్షంగా ఆవిర్భవించింది.

జనవరి 15న ఎన్నికలు జరిగిన 2869 డివిజన్‌లలో బిజెపి 1425 దక్కించుకుంది. ఫిబ్రవరి 2015 – డిసెంబర్ 2018 మధ్యకాలంలో జరిగిన ఇంతకు మునుపు రౌండ్‌లో బిజెపి గెలుపొందిన 1099 సీట్లను ఇప్పుడు పెంచుకోగలిగింది. అయితే వారికి సొంతంగా మెజారిటీ 13 కార్పొరేషన్‌లకే పరిమితమైంది. శివసేన, ఎన్‌సిపిల్లో చీలిక నుంచి అది లబ్దిపొందిందని దీని అర్థం. దీనికి తోడు ఎంవిఎ భాగస్వాములైన కాంగ్రెస్, శివసేన(యుబిటి), ఎన్‌సిపి(ఎస్‌పి) విడిపోయి, వేర్వేరు గ్రూపులుగా పోటీ చేశాయి. అందువల్ల బిజెపి విజయాలను దాని బలం మరింత పెరిగినట్లు, అది విస్తరించినట్లు భాష్యం చెప్పటానికి వీల్లేదు. ప్రతిపక్షం దురదృష్టం, వ్యూహాత్మక తప్పిదాలు బిజెపికి వరప్రసాదంగా రుజువైంది. బిజెపికి 13 కార్పొరేషన్‌లలో పూర్తి మెజారిటీ లభించగా, మరో 6 కార్పొరేషన్‌సలో అది పెద్ద స్థానం పొందింది.

2017 బ్రిహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఐక్య శివసేన 84 సీట్లు గెలుపొందగా, బిజెపి 82 సీట్లు గెలుచుకుంది. 2022లో శివసేన చీలిపోయింది. శివసేన చీలిక గ్రూపులు శివసేన(షిండె), శివసేన(యుబిటి) ఈ సంవత్సరం ఎన్నికల్లో విడివిడిగా పోటీచేశాయి. బిజెపి మహాయుతిలో భాగంగా పోటీచేసిన షిండె సేన 29 సీట్లు గెలుచుకుంది. శివసేన (యుబిటి) 65 సీట్లు గెలుపొందింది. రెండు శివసేన గ్రూపులను కలిపితే మొత్తం 90 సీట్లు – 2017 కన్నా 10 సీట్లు ఎక్కువ గెలుచుకున్నాయి. దీని ప్రాధాన్యత ఏమిటి? సీట్ల రీత్యా వారు బలపడ్డారు. ఉద్ధవ్ థాకరే శివసేన (యుబిటి)తో పొత్తుతో పోటీ చేసిన రాజ్ థాకరే ఎంఎన్ఎస్ 6 సీట్లు (2017 కన్నా ఒక సీటు కోల్పోయింది). ఎన్‌సిపి (శరద్ పవార్) కేవలం ఒక సీటు గెలుపొందాయి. కాగా ఈ పర్యాయం ఒంటరిగా పోటీచేసిన కాంగ్రెస్ 7 సీట్లు కోల్పోయి 24 సీట్లకు పరిమితమైంది. ఎన్‌సిపికి సంబంధించి అదీ రెండుగా చీలింది. 2017లో 9 గెలిచిన ఎన్‌సిపి, ఈ పర్యాయం శరద్ పవార్ ఎన్‌సిపి 1 సీటు, అజిత్ పవార్ ఎన్‌సిపి 3 సీట్లు మాత్రమే గెలిచాయి. ఇద్దరూ సమష్టిగా 5 సీట్లు కోల్పోయారు. దీన్నిబట్టి తేలేదేమంటే ముంబయిలో బిజెపికి పెరిగిన 7 సీట్లు రాజకీయబలం పెరుగుదల కాదని, ప్రతిపక్షాల చీలిక నుంచి సంపాదించినవని అర్థమవుతున్నది. అంతేగాక ముంబయిలో అసలు శివసేన ఉద్ధవ్ థాకరే అధ్యక్షునిగా ఉన్న శివసేన (యుబిటి) అని నిర్ధారణ అయింది.



బిఎంసి తర్వాత దృష్టి సారించాల్సింది పూణె కార్పొరేషన్. ఇక్కడ పవార్‌లు ఒక్కటైనారు. రాష్ట్ర స్థాయిలో వారి పార్టీ లు ప్రత్యర్థి కూటముల్లో భాగస్వాములు. ఈ అపవిత్ర అలయెన్స్‌లను, అపవిత్ర చీలికను ప్రజలు హర్షించలేదు. వారి ఓటర్లు బిజెపి వైపు మరలినారు. దీంతో బిజెపి 165 సీట్లలో 119 గెలుచుకుని పవార్‌లను దిమ్మతిరిగే దెబ్బ కొట్టింది.

ఎన్‌సిపి(అజిత్) 27, ఎన్‌సిపి (శరద్‌పవార్) 3 సీట్లకు పరిమితమైనాయి. కాగా కాంగ్రెస్ 15, శివసేన (యుబిటి) 1 సీటు దక్కించుకున్నాయి. శివసేన (షిండె) అడ్రసు దొరకలేదు.

కాగా రాష్ట్ర స్థాయిలో శివసేన (షిండె) 399, శివసేన (యుబిటి) 155 కార్పొరేటర్లను గెలిపించుకున్నాయి. కాబట్టి రాష్ట్రం మొత్తంమీద (ముంబయి మినహా) అసలు శివసేన అంటే షిండే శివసేనగా నిర్ధారణ అయింది. రాష్ట్రం మొత్తంమీద ఉమ్మడి శివసేనకు 489 సీట్లు ఉండగా, ఇప్పుడు 554 సీట్లు గెలుపొందాయి. శివసేన బలం పెరుగుదల బిజెపికి ఆందోళన కలిగించే విషయం. బిజెపి బలం పెరుగుదలకు షిండె శివసేనతో పొత్తు ప్రధాన కారణం. అందువల్ల అది షిండెను మంచిగా చూసుకోవాల్సి ఉంటుంది.

ముంబయి కార్పొరేషన్‌లోని సున్నితమైన స్థితి దృష్ట్యా బిజెపి తమ కార్పొరేటర్లను ఎత్తుకుపోకుండా షిండె తమ కార్పొరేటర్లతో ఒక హోటల్‌లో క్యాంపు పెట్టారు. బిజెపి కూడా తమ వారితో మరో చోట శిబిరం పెట్టింది. రెండు పార్టీల మధ్య పదవుల పంపిణీకి కనీసం మరో వారం పట్టవచ్చు. అసెంబ్లీ ఎన్నికల అనంతర అనుభవం రీత్యా షిండె బిఎంసి అధికారంలో బలమైన వాటా కోరుకున్నట్లు సమాచారం.

మొత్తంమీద బిజెపికి 19, శివసేన (షిండె)కు 3, ఎన్‌సిపి (అజిత్ పవార్)కి1, కాంగ్రెస్‌కు 3, శివసేన(యుబిటి)కి 1 మేయర్ పదవులు దక్కుతాయి.

## ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ



**ప్రజా పక్షం/వేములపల్లి:** మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ వైద్య అధికారి డాక్టర్ దీపతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రంలోని ఔట్ పేషంట్స్ వివరాలు తెలుసుకుని ల్యాబ్, ఫార్మసీలను తనిఖీ చేశారు. సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎన్‌సిడి యంసి యచ్, టీబి వివరాలపై సమగ్ర విచారణ నిర్వహించి రికార్డులు తనిఖీ చేశారు.యన్‌సి డి స్క్రీనింగ్ తక్కువగా ఉన్నదని త్వరగా పూర్తిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## అడ్మిషన్ల పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ అడ్మిషన్లకు సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మంగళవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మైనారిటీ ప్రజలు తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ప్రవేశాల కోసం అందుబాటులో ఉన్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విద్య, సౌకర్యాలను మైనారిటీ విద్యార్థులు ఉపయోగించుకొని తమ భవిష్యత్తును మెరుగుపరుచుకోవాలని కోరారు. ఫిబ్రవరి 28లోపు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఐదో తరగతి, ఇంటర్ ఫస్టియర్‌తో పాటు 6, 7, 8 తరగతుల్లో ఖాళీలకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. మొత్తం 4 గురుకులాల్లో 2 బాలురకు, 2 బాలికల కోసం ఉన్నాయని, వీటిలో 75 శాతం సీట్లు మైనార్టీలకు, 25 శాతం సీట్లు మైనార్టీయేతర విద్యార్థులకు రిజర్వు చేశామని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి టి నర్సింహులు,ఆర్‌సిఓ శ్రీకాంత్,సంబంధితశాఖలఅధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పనులు సంతృప్తికరం



**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట మండల పరిధిలోని వెల్లంకి గ్రామాన్ని సందర్శించిన ఆదిత్య ప్రకాష్ అడిషనల్ సెక్రటరీ, పంచాయతీ రాజ్ బీహార్ రాష్ట్రం వారు, గ్రామ పంచాయతీ కార్యాలయం, రైతువేదిక, స్మశాన వాటిక, పల్లె ప్రకృతి వనం, నర్సరీ తదితర పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పనులు సంతృప్తికరంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జాన్ వెస్లీ డిప్యూటీ కమీషనర్ పంచాయతీ రాజ్, విష్ణువర్ధన్ రెడ్డి జిల్లా పంచాయతీ అధికారి, సురేష్ అడిషనల్ జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, రావుఫ్ అలీ మండల పంచాయతీ అధికారి, ఇడెం రాధ సర్పంచ్, సందీప్ రెడ్డి (ఏఈపిఆర్), వెంకన్న (ఏపిఓ), ప్రవీణ్ (ఈసి), మోహన్ పంచాయతీ కార్యదర్శి, సుచరిత (టిఏ), వార్డ్ మెంబర్స్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాలకు రూ.43 కోట్ల 81 లక్షలు అందజేత



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పాలనలో భువనగిరి నియోజకవర్గంలో స్త్రీ నిధి ద్వారా మహిళా సంఘాలకు 43 కోట్ల 81 లక్షలు అందజేశామని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. భువనగిరి జిల్లా కేంద్రంలో మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు సుమారు మూడు కోట్ల వడ్డీ లేని రుణాల చెక్కులను పంపిణీ చేశారు. ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి ఉచిత బస్సు, ఉచిత కరెంట్ అందజేస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ ఆవేస్ చిస్తీ, ఆర్డీవో కృష్ణ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్లు పోతంశెట్టి వెంకటేశ్వర్లు, బర్రె జాంగిర్, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, అధికారులు, మహిళా సంఘాలు పాల్గొన్నారు.

## పెట్రోల్ బంక్‌లను ఎఎస్‌ఒ తనిఖీ

**ప్రజాపక్షం/ఆలేరు :** ఆలేరు పట్టణంలోని చంద్రేశ్వర ఫిల్లింగ్ స్టేషన్‌ను ఆలేరు ఏఎస్‌వొ సురేష్ రెడ్డి మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఫిల్లింగ్ స్టేషన్‌కు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలను పరిశీలించారు. పెట్రోల్ బంక్‌లో ఉన్న పెట్రోల్, డీజిల్ శాంపిల్స్‌ను సేకరించి ఎఫ్ఎస్ఎల్‌కు పంపిస్తామని తెలిపారు. అనంతరం బంక్‌లో మూత్ర శాలలు వినియోగదారులకు అందుబాటులో ఉన్నాయా లేదా వాహనాలకు గాలి పెట్టే యంత్రాలు అందుబాటులో ఉంచాలని, అందుకు సంబంధించి వ్యక్తిని పురమాయించాలన్నారు. ఫస్ట్ ఎయిడ్ కిట్ పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచాలన్నారు. అంతేకాకుండా పెట్రోల్ డీజిల్‌లో నాణ్యతను పరిశీలించారు. అనంతరం స్టాక్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు పెట్రోల్ బంకులను తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. పెట్రోల్ బంకులలో కొన్ని పొరపాట్లను గుర్తించిన విషయాలపై సంబంధిత యజమానులకు సూచించినట్లు, భవిష్యత్తులో ఎటువంటి పొరపాట్లు చెసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించినట్లు పేర్కొన్నారు. ఈ తనిఖీలలో ఆర్ఐలు (సివిల్ సప్లై) విజయసింహ రెడ్డి, నరసింహ రెడ్డి పాల్గొన్నారు.

## జమ్ములు మృతి బాధాకరం



**ప్రజాపక్షం/డిండి :** సిపిఐ ఖానాపూరం గ్రామశాఖ సహాయ కార్యదర్శి కామ్రేడ్ తాటికొండ జమ్ములు మృతి బాధాకరం అని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డిలు అన్నారు. మంగళవారం ఖానాపూర్ గ్రామంలో జమ్ములు పార్థివదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొంతినేని వెంకటేశ్వర్‌రావు, సిపిఐ జిల్లా నాయకులు బొడ్డుపల్లి వెంకటరమణ, మైనోద్దిన్, విజేందర్‌రెడ్డి, సర్పంచ్ ప్రతిమతో పాటు సిపిఐ అనుబంధ సంఘాల నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం



రెండు అంగన్‌వాడీ భవనాలు ప్రారంభం, సబ్ స్టేషన్ నిర్మాణ శంకుస్థాపనలో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రోడ్లు, భవనాల మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం యాదగిరిగుట్ట మండలం సైదాపూర్ గ్రామంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యతో కలిసి ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా గ్రామంలో నూతనంగా నిర్మించిన రెండు అంగన్వాడీ భవనాలను వారు ప్రారంభించారు. అనంతరం గ్రామ శివారులో నూతన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. మంత్రి కోమటిరెడ్డి ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. వ్యవసాయ మోటార్లకు తక్కువ వోల్టేజ్ సమస్యలు తలెత్తకుండా, రైతులకు 24 గంటల నిరంతర విద్యుత్ అందించడమే ఈ సబ్‌స్టేషన్ లక్ష్యమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, విద్యుత్, తాగునీరు, విద్యా సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందన్నారు. ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని తెలిపారు. విద్యుత్ రంగ బలోపేతం కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందని, సబ్‌స్టేషన్‌లు మరియు లైన్ల ఆధునీకరణ పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కన్నాయి రోజా, ఉప సర్పంచ్ దుంబాల వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ బీర్ల శంకర్, మాజీ ఎంపీపీ శ్రీశైలం, గ్రామ ప్రజలు వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

**లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్న మంత్రి కోమటిరెడ్డి, విప్ బీర్ల అయిలయ్య**

తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మంగళవారం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలేరు నియోజకవర్గ పరిధిలోని యాదగిరిగుట్ట, మోటకొండూరు, ఆలేరు పట్టణాలలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన వారు, ముందుగా క్షేత్రానికి చేరుకొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న మంత్రికి, ప్రభుత్వ విప్‌కు ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం వారు శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం ఆలయ అర్చకులు వారికి వేదాశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి, లడ్డూ ప్రసాదం మరియు చిత్రపటాన్ని అందజేశారు.

## హరీష్‌రావు 'ట్యాపింగ్' నిందితుడు నీతులు చెబితే సహించం

ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



**ప్రజాపక్షం/యాదాద్రి :** మాజీ మంత్రి హరీష్ రావు తీరుపై ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య నిప్పులు చెరిగారు. హరీష్ రావు తానేదో పెద్ద పోరాట యోధుడిలా ఫీల్ అవుతున్నారని, కానీ ఆయన ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ ఎదుర్కొంటున్న నిందితుడనే విషయాన్ని మర్చిపోకూడదని ఎద్దేవా చేశారు. మంగళవారం ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ హరీష్ రావుపై సంచలన వ్యాఖ్యలు చేశారు. పదేళ్ల పాటు అధికారంలో ఉండి నీచాతి నీచంగా ఫోన్లను ట్యాప్ చేయించి, ఇప్పుడు బయటకి వచ్చి సత్యహరిశ్చంద్రుడిలా మాట్లాడుతుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని ఐలయ్య విమర్శించారు. 'సొంత ఇంటి అల్లుడి ఫోన్ కూడా ట్యాప్ చేశారని మీ కుటుంబ సభ్యురాలు కవిత స్వయంగా స్పష్టం చేశారు. ఇంతకంటే సిగ్గుచేటు మరొకటి ఉంటుందా?' అని ప్రశ్నించారు. భార్యాభర్తలు, అధికారులు, రాజకీయ నాయకుల వ్యక్తిగత సంభాషణలను ట్యాప్ చేయడం హరీష్ రావు నైజమని మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ కేసు ఇప్పటిది కాదని, గత రెండేళ్లుగా విచారణ జరుగుతోందని గుర్తు చేశారు. పదేళ్ల పాటు తెలంగాణను అడ్డగోలుగా దోచుకున్న హరీష్ రావు ఒక 'చీటర్' అని ఐలయ్య దుయ్యబట్టారు.

# బాల్యవివాహాలు అరికట్టేందుకు.. చదువే మార్గం

నల్లగొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** బాలిక విద్యను ప్రోత్సహించడమే బాల్యవివాహాలను అరికట్టేందుకు పరిష్కారమని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం ఆయన కలెక్టరేట్ ప్రాంగణంలో ఆశ్రిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జిల్లా సంక్షేమ శాఖ సహకారంతో బాల్య వివాహాల నిర్మూలనపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలనే లక్ష్యంతో జాగ్రత్త పేరుతో రూపొందించిన బాల్య వివాహాల విముక్తి ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు.దేశంలో ఆదర్శ భావాలు, అభివృద్ధి చెందుతున్న సమయంలో బాల్యవివాహాలలాంటి సామాజిక రుగ్మతలు ఉండరాదని కలెక్టర్ అన్నారు.బాల్యవివాహాలు జరగకుండా ఉండాలంటే చదువు ఒకటే మార్గమని, విద్య పట్ల పిల్లలకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని, తల్లిదండ్రులలో మార్పు రావాలన్నారు. బాల్యవివాహల నిర్మూలనకు రూపొందించిన ప్రచార రథం జిల్లా వ్యాప్తంగా గ్రామాలు, మండలాల్లో తిరుగుతూ పాటలు, నినాదాలు, పోస్టర్ల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తుందని, ప్రింట్ మీడియా ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రచారం చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి కృష్ణవేణి, సీడీపీవో హరిత, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫన్స్ కౌన్సిల్ నిమ్మల భీమార్జున్ రెడ్డి, ఆశ్రిత స్వచ్ఛంధ సంస్థ డైరెక్టర్ నాగరాజు, గణేష్, చింతకృష్ణ, నాగరాజా, జిల్లా కోఆ ర్డినేటర్ శోభారాణి పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత పోలీసులదే కాదు.. ప్రతి పౌరుడి బాధ్యత



జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్

**ప్రజాపక్షం/నల్లగొండ :** రోడ్డు భద్రత అనేది పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి బాధ్యత అని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ అన్నారు. ట్రాఫిక్ నియమాలను పాటిస్తే తాము సురక్షితంగా ఉండటమే కాకుండా, ఇతరుల ప్రాణాలను కూడా కాపాడిన వారవుతామని అన్నారు. పోలీసులు శిక్షించడానికి కాదు, ప్రజల ప్రాణాలను కాపాడేందుకే ఈ చర్యలు తీసుకుంటున్నారని స్పష్టం చేశారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నియంత్రించడమే లక్ష్యంగా నల్లగొండ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా కళాశాల విద్యార్థులు,యువత, ఆటో డ్రైవర్లు, ఆర్‌టిసి బస్ డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహనా సదస్సుకు ఎస్‌పి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రతి సంవత్సరం దేశ వ్యాప్తంగా అనేక మంది రోడ్డు ప్రమాదాల్లో గాయపడుతూ ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా పరిధిలో గత సంవత్సరం నమోదైన గణాంకాల ప్రకారం జిల్లాలో సుమారు 900 నుంచి 950 వరకు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోగా, అందులో దాదాపు 360 మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఈ మరణాల్లో సుమారు 90 శాతం మంది ద్విచక్ర వాహనదారులే కాగా, వారిలో హెల్మెట్ ధరించకపోవడమే ప్రధాన కారణమని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి రమేష్, ఎస్‌బి డిఎస్‌పి మల్లారెడ్డి, నల్లగొండ డిఎస్‌పి శివారెడ్డి, టూ టౌన్ సీఐ రాఘవరావు, వన టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి,ఎస్‌బి సీఐ రాము, ట్రాఫిక్ సీఐ మహాలక్ష్మయ్య,టూ టౌన్ ఎస్ఐ సైదులు,రూరల్ ఎస్ఐ సైదాబాబు,ఆర్‌టిసి డియం డీటీఆర్‌బీ రిటైర్డ్ సీఐ అంజయ్య తదితర పోలీస్ అధికారులు, సిబ్బంది,ఆటో డ్రైవర్లు, బస్సు డ్రైవర్లు పాల్గొన్నారు.

# కేసులు పెండింగ్ లేకుండా వేగవంతమైన దర్యాప్తు

నెలవారి సమీక్షా సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్‌పి




**ప్రజాపక్షం/సూర్యాపేట :** పోలీసు అధికారుల నెలవారి సమీక్షా సమావేశం మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్‌పి కె.నరసింహ నిర్వహించారు. ఈ సందర్భంగా గత నెలలో జరిగిన నేరాల స్థితిగతులను సమీక్షించారు. అనంతరం కేసు దస్త్రాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. నేర నిరూపణలో సిబ్బంది సాంకేతిక సామర్థ్యం కలిగి ఉండాలని, ఫిర్యాదులపై త్వరగా స్పందించి సంఘటనా స్థలానికి త్వరగా చేరుకోవాలన్నారు. రాత్రిళ్ళు పెట్రోలింగ్ పటిష్టంగా ఉండాలని, కేసులు పెండింగ్‌లో లేకుండా వేగంగా దర్యాప్తు చేయాలని సూచించారు. కేసుల్లో నేరస్తులకు త్వరగా శిక్షలు పడేలా పని చేయాలని తెలిపారు. ఫోక్సో కేసుల్లో, మహిళా సంబంధిత కేసుల్లో వేగంగా ధర్యాప్తు చేసి కోర్టులతో సమన్వయంగా పనిచేసి నేరస్తులకు శిక్షలు పడేలా కృషి చేయాలన్నారు. పోలీసు పని విభాగాల్లో సమర్థవంతంగా సేవలు అందించినప్పుడే ప్రజల్లో నమ్మకం పెరుగుతుందన్నారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేసే వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించవద్దని వారిపై కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నేరాల నివారణలో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ ఎక్కువ మొత్తంలో సిసి టివి కెమెరాలు ఏర్పాటు చేసేలా ప్రజలను, వ్యాపారులను ప్రోత్సహించాలని తెలిపారు. రోడ్డు భద్రత పట్ల ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడానికి అరైవ్ అలైవ్ కార్యక్రమం ద్వారా ముందుకెళ్ళాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అడ్మిన్ అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి, సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్నకుమార్, డిసిఆర్‌బి డిఎస్‌పి రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ హరిబాబు, ఇన్‌స్పెక్టర్లు నాగేశ్వరరావు, రాజశేఖర్, వెంకటయ్య, ఎస్ఐలు, ఐటి కోర్, డిసిఆర్‌బి సిబ్బంది ఉన్నారు.

# పత్రికలు ప్రజలను చైతన్యం చేయాలి



**ప్రజాపక్షం/చింతపల్లి :** ప్రభుత్వ విధానాలపైన, సామాజిక సమస్యలపైన పత్రికలు ప్రజలకు అవగహనపరిచి చైతన్య పరచాలని మాల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతం అలివేలు సంజీవరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ప్రజాపక్షం జాతీయ దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్‌ను అలివేలు సంజీవరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు భాషా సాహిత్యాన్ని, సంస్కృతిని పరిరక్షించడానికి పత్రికలు తోడ్పడుతున్నాయన్నారు. ప్రజలకి ప్రభుత్వాలకు మధ్య పత్రికలు వారధిగా పని చేయాలన్నారు. ప్రజల గొంతుకగా ప్రజాపక్షం పత్రిక పనిచేసి ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని ఆయన ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో ఘుడియగౌరారం సర్పంచ్ ఉజ్జిని హేమలత నరేంద్రరావు, ఎం.మల్లేపల్లి సర్పంచ్ ముద్దం మల్లేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏర్పుల దావలయ్య, వింజమూరు గ్రామ మాజీ సర్పంచ్ దండేటికర్ లలితాభాయ్ మోహన్, ప్రజాపక్షం చింతపల్లి మండల రిపోర్టర్ ఆరెకంటి రాధాకృష్ణ, ఆరెకంటి మైసయ్య, గజ్జ యాదయ్య, ఇరిగి శేఖర్, ఏర్పుల జంగయ్య, కోటిరెడ్డి, ఆరెకంటి జగన్, ఏర్పుల రాజు తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణ మహోత్సవ కరపత్రిక ఆవిష్కరణ



**ప్రజాపక్షం/హాలియా:** హాలియాలోని శ్రీ పార్వతి సమేత జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానం వార్షికోత్సవ కల్యాణ ఆహ్వాన పత్రికను సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి ఆవిష్కరించారు. మంగళవారం హాలియాలోని పార్వతి జడల రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ ఆలయ వార్షికోత్సవ ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జై వీర్ రెడ్డి మాట్లాడుతూ లోక కళ్యాణ కోసం నిర్మించిన శివాలయంలో నిర్వహించనున్న వార్షికోత్సవ ఉత్సవాలు, 25, 26 నిర్వహించనున్న పార్వతీ సమేత జడల రామలింగేశ్వర కళ్యాణ ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుందూరు వెంకటరెడ్డి, దేవస్థాన కమిటీ అధ్యక్షుడు చెరుపల్లి ముత్యాలు, ఎడవల్లి నరేందర్ రెడ్డి, హాలియా పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంపటి శ్రీనివాస్, పొదిలి కృష్ణ, పిల్లి ఆంజనేయులు, పుట్ట శ్రీనివాస్ రెడ్డి, నాగరాజు, కర్ణ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార గొంతుక ప్రజాపక్షం



**ప్రజాపక్షం/డిండి :** ప్రజా సమస్యలను ఎలుగెత్తి చాటుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కార గొంతుకగా ప్రజాపక్షం దినపత్రిక నిలుస్తుందని బిఆర్ఎస్ సినియర్ నాయకులు, తవక్లాపూర్ గ్రామ సర్పంచ్ పొన్నగంటి కృష్ణయ్య అన్నారు. మంగళవారం తవక్లాపూర్ గ్రామంలో ప్రజాపక్షం తెలుగు జాతీయ దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్‌ను సర్పంచ్ కృష్ణయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తున్న ప్రజాపక్షం అత్యంత ప్రజాధరణ పొంది ప్రజల మన్ననలు పొందుతూ తనదైన స్థానాన్ని సంపాదించుకొని ప్రజల చైతన్యం కోసం ప్రజాపక్షం నిబద్ధతతో కూడిన వార్తలను ప్రచురితం చేస్తూ విలువలతో కూడిన జర్నలిజానికి నిలువుటద్దంగా ప్రజాపక్షం వెలువడుతుందని అన్నారు. ఏడేళ్ల ప్రస్థానంలో ప్రజల్లో అత్యంత ప్రజాధరణ పొందిన ప్రజాపక్షం దినపత్రిక యజమాన్యానికి, విలేకరులకు పొన్నగంటి కృష్ణయ్య నూతన సంతవ్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ నల్లవెల్లి సీతారంరెడ్డి, బిఆర్ఎస్ గ్రామశాఖ యువజన ప్రధాన కార్యదర్శి మద్దెల వెంకటేష్, వార్డు సభ్యులు సంపంగి శ్రీను, మురళి, అలందర్, ప్రశాంత్ ఉన్నారు.

## రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట




**ప్రజాపక్షం/మిర్యాలగూడ:** రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్‌లు అన్నారు. ఏడీఏ సైదానాయక్ అధ్యక్షతన రైతు వేదికలో మంగళవారం వ్యవసాయ యాంత్రీకరణ పథకం పరికరాలను రైతులకు పంపిణి చేసిన అనంతరం వారు మాట్లాడారు. సబ్సిడితో పొందిన యంత్రాలతో రైతులు నూతన పద్ధతులు అవలంభించి అధిక దిగుబడి సాధించాలని ఆకాంక్షించారు. దివంగత మాజీ సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి 12 సంవత్సరాల క్రితం రైతుల సమగ్ర అభివృద్ధికి ఆయన చేసిన కృషిని గుర్తు చేశారు. అదే తరహాలో సీఎం రేవంత్‌రెడ్డి అన్నదాతల సంక్షేమానికి అహర్నిషలు కృషి చేస్తున్నారని అన్నారు. ఒకేసారి రూ.2లక్షల రుణమాఫీ చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. నల్లగొండ జిల్లాలో రూ.2400 కోట్ల రైతు రుణమాఫీ జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏవోలు కిశోర్‌నాయక్, సరిత, శివరాం, ఏఈవోలు షఫి, రమేష్, ఆఫ్రీన్, శిరీష, ప్రియాంక, పార్వతి, నాయకులు, ముదిరెడ్డి నర్సిరెడ్డి, రవితేజ, సూర్యనాయక్, నర్సిరెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి పేదలకు వరం



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** సిఎం సహాయ నిధి పేదలకు పెన్నిదని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 65 మంది లబ్ధిదారులకు రూ.25లక్షల 39వేల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర పౌరసరఫరాల, నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి, పార్లమెంట్ సభ్యులు రఘువీరా రెడ్డి, ఎంఎల్సి శంకర్ నాయక్‌ల సహకారంతో అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్న పేదలకు ప్రభుత్వం తరపు నుండి నిధులు మంజూరి చేయించడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి చకిలం రాజేశ్వరరావు, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజద్ అలీ, చివ్వెంల మండల అధ్యక్షులు ధరావత్ వీరన్న నాయక్, శ్రీదండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగెళ్ళ కరుణాకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ బైరు శైలేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి సహజ పద్ధతుల్లో పంటలు పండించాలి

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** రసాయన రహిత వ్యవసాయం పురుగుమందులు, రసాయన ఎరువులు వాడకుండా ప్రకృతి సహజ పద్ధతుల్లో పంటలు పండించాలని జిల్లా వ్యవసాయ అధికారి రమణారెడ్డి అన్నారు. జాతీయ సహజ వ్యవసాయ మిషన్ పథకంలో భాగంగా డిఆర్‌పి/కృషి సఖిలకు 5 రోజుల శిక్షణ కార్యక్రమం మంగళవారం భువనగిరిలోని వివేర హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ సహజ వ్యవసాయ మిషన్ అనేది రసాయన రహిత పర్యావరణ అనుకూల సహజ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఒక పథకం అని అన్నారు. ఈ పథకం ఉద్దేశం రైతుల సాగు ఖర్చును తగ్గించి, ఆదాయాన్ని పెంచడం, నేల సారాన్ని మెరుగుపరచడం జరుగుతుందన్నారు. ఈ పథకం సాంప్రదాయ వ్యవసాయ జ్ఞానం ఆధారంగా, సింథటిక్ రసాయనాలు, ఎరువులు లేకుండా ఆహార ఉత్పత్తులను ఉత్పత్తి చేయడాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు బి.వెంకటేశ్వరరావు, వి.శాంతి నిర్మల, ఎస్.శ్రీనివాస్, మిత్ర ఫౌండేషన్(ఎన్‌జిఓ) ప్రెసిడెంట్ రామచంద్రయ్యా, ఫార్మర్ మాస్టర్ ట్రైనర్ సందీప్, తెలంగాణ టి హబ్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ కె.ఇందిరా రెడ్డి, రాజేష్, వ్యవసాయ అధికారి, సాంకేతిక విభాగం రావుల ప్రశాంతి పాల్గొన్నారు.



## బాదేపల్లి హైస్కూల్ శతాబ్ది ఉత్సవాలకు ఏర్పాట్లు

**ప్రజాపక్షం/జడ్చర్ల :** బాదేపల్లి హై స్కూల్ శతాబ్ది ఉత్సవాలు సందర్భంగా ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తో హైద్రాబాద్‌లో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసుకున్న ఉత్సవ కమిటీ సభ్యులు ఈ సందర్భంగా ఎమ్మెల్యే జానంపల్లి అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ నభూతో నభవిష్యత్ అనే విధంగా శతాబ్ది ఉత్సవాలు నిర్వహించాలని సూచించారు. రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు రానున్న నేపథ్యంలో ఎన్నికల కోడ్‌ను దృష్టిలో ఉంచుకుని అందరి సమ్మతంతో తేదీలు నిర్ణయించాలని సూచించారు. సమావేశంలో గౌరవ అధ్యక్షులు, జడ్చర్ల ఎమ్మెల్యే జానంపల్లి అనిరుధ్‌రెడ్డి , అధ్యక్షులు రవిశంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల కృష్ణ, ఉపాధ్యక్షులు పెద్ది బాలకృష్ణ, ఆర్థిక కార్యదర్శి రామకృష్ణ, రమణాచారి, యంఈఓ మంజుల పాల్గొన్నారు.

## మృతి చెందిన నెమలి పోలీసులకు అప్పగింత



**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని అయ్యప్ప స్వామి దేవాలయ సమీపంలో గల భాస్కర్ రెడ్డి అనే వ్యక్తి ఇంటి బయట చనిపోయిన నెమలిని గుర్తించిన కాలనీవాసులు కౌన్సిలర్‌కు సమాచారం అందించారు. కౌన్సిలర్ దానిని జడ్చర్ల పోలీస్ స్టేషన్ తీసుకెళ్లి ఎస్సై జయప్రదకు అందజేసినట్లు తెలిపారు. ఫారెస్టు అధికారులు పోలీసులు ఇంకా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి మున్ముందు ఇలాంటి ఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ పట్టణంలో వెలసిన శ్రీశ్రీశ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో నేడు మార్గశుద్ధ విధియ వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవం పురస్కరించుకొని ఉదయం వాసవి మాతకు అభిషేకం, కుంకుమార్చన, లలిత సహస్రనామావళి, వాసవి మాత పారాయణం ఘనంగా నిర్వహించారు. వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదలు, అన్నప్రసాద వితరణ చేశారు. పెద్దలు మాట్లాడుతూ వాసవి మాత ని దర్శించుకున్న వారికి కోరికలు నెరవేరాయని సాక్షాత్తు అమ్మవారు ఇక్కడ కొలువైందని ఈ సందర్భంగా వారు తెలిపారు. అలాగే పడమటి ఆంజనేయ స్వామి దేవాలయం దగ్గర వసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమం లో సుమారు 150 నుండి 200 మంది పాల్గొని అన్నదాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవి, వనిత క్లబ్ సభ్యులు, ఎండోమెంట్ ఈఓ, తదితరులు పాల్గొన్నారు.



## సాగు నీరు విడుదల చేయాలని వినతి

**ప్రజాపక్షం/ మక్తల్ :** మంగళవారం నారాయణపేట నీటిపారుదల శాఖ ఇంజనీరింగ్ కార్యాలయానికి భారతీయ కిసాన్ సాంగ్ ఆధ్వర్యంలో పల్లాపూర నారాయణపేట కొండారెడ్డి పల్లి చెరువు నీరు విడుదల చేయాలని, ఆయకట్టు రైతులకు ఎస్కే పంట వరి సాగు ఆయకట్టు రైతులకు సాగునీరు విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారికి వినతి పత్రం అందజేశారు. నగర అధ్యక్షులు ఆకుల వెంకటప్ప, నగర కార్యదర్శి అంజయ్య యాదవ్, జిల్లా కార్యదర్శి అనంత్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షులు విశ్వనాథ్ రెడ్డి పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదాలను అరికడదాం

### డిఎస్‌పి వెంకట్‌రెడ్డి

**ప్రజాపక్షం/వంగూర్ :** రోడ్డు నియమాలు పాటించి ప్రమాదాలను ఆరికడదామని కల్వకుర్తి డిఎస్‌పి వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలపరిధిలోని ఎల్లమ్మరంగాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్థానిక ఎస్ఐ పుట్టమహేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు జాతీయ రోడ్డుభద్రత మాసోత్సవాలపై అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో వెల్దండ సీఐ విష్ణువర్ధన్ రెడ్డి, కల్వకుర్తి మోటార్‌వెహికల్ ఇన్‌స్పెక్టర్ అశోక్, సర్పంచ్ సుధ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, బిజెపిమండలపార్టీ అధ్యక్షులు ఆనందరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రశాంతి ప్రజాసేవ



**ప్రజాపక్షం/చిన్నంబావి :** చిన్నంబావి మండలం అయ్యవారిపల్లి గ్రామా నికి చెందిన ప్రశాంతి ఇటీవలే జరిగిన సర్పంచు ఎన్నికలలో పోటీ చేసి ఓడినప్పటికి ప్రజలకు ఇచ్చిన మాట కోసం ఇటీవలే జిల్లా కలెక్టర్ ని కలిసి గ్రామ సమస్యలు తెలియజేసి పరిష్కరించాలని కోరింది. అలాగే గ్రామంలోని పాఠశాలకు గణతంత్ర దినోత్సవ సందర్భంగా పాఠశాలకు పెయింట్స్ వేయడానికి తన వంతు సాయంగా 50.000 రూపాయలు విరాళంగా ఇచ్చి పాఠశాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపింది. అలాగే గ్రామంలో అర్హత ఉన్న వికలాంగులకు ఒంటరి మహిళలకు ఆసరా, వికలాంగుల పించను ఇప్పించగలరని త్వరలో అధికారులను కలిసి విన్నవిస్తానని తెలిపారు.

## వైభవంగా మహా పడిపూజ

**ప్రజాపక్షం/ ధన్వాడ :** మండల కేంద్రంలో కోటపక్క వీధిలో గల గంగమ్మ తల్లి దేవాలయం దగ్గర నిర్వహించిన స్వామి మహాపడి పూజను కన్నుల పండుగా నిర్వహించారు. 108 కలషాలతో శ్రీ గంగామాతకి పాలాభిషేకంతో అమ్మవారి పూజలు నిర్వహించారు. అనంతరం శివ స్వామికి 18 రకాల అభిషేకాలు, నిర్వహించి పడిపూజ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. శివ స్వాములకు, భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు , భక్తులు, శివ స్వాములు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

# గుంతకల్లు డివిజన్‌లో భద్రతపై జిఎం సమగ్ర తనిఖీ

### బళ్లారి– గుంతకల్– డోన్– నంద్యాల సెక్షన్ పరిశీలన



**ప్రజాపక్షం/హైదరాబాద్:** దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ మంగళవారం గుంతకల్లు డివిజన్‌లో విస్తృత స్థాయిలో భద్రతా తనిఖీ నిర్వహించారు. గుంతకల్లు రైల్వే స్టేషన్‌తో పాటు బళ్లారి–గుంతకల్–డోన్–నంద్యాల రైల్వే సెక్షన్‌ను ఆయన స్వయంగా పరిశీలించారు.ఈ తనిఖీలో గుంతకల్లు డివిజనల్ రైల్వే మేనేజర్ చంద్ర ఎస్. గుప్తా, ప్రధాన విభాగాధిపతులు, ప్రధాన కార్యాలయం మరియు డివిజన్‌కు చెందిన ఇతర సీనియర్ అధికారులు జనరల్ మేనేజర్‌తో కలిసి పాల్గొన్నారు.బళ్లారి నుంచి రియర్ విండో తనిఖీని ప్రారంభించిన జనరల్ మేనేజర్, రైల్వే ట్రాక్‌ల భద్రతా అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ సందర్భంగా గేట్‌మెన్‌లతో మాట్లాడి వారి పని పరిస్థితులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

గుంతకల్లు స్టేషన్‌లో మెడికల్ రిలీఫ్ వ్యాన్, యాక్సిడెంట్ రిలీఫ్ రైలు సంసిద్ధతను పరిశీలించిన జనరల్ మేనేజర్, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం నిర్వహించిన భద్రతా సెమినార్‌లో పాల్గొని ఆటోమేటిక్ సిగ్నలింగ్, రైట్ హ్యాండ సిగ్నల్స్ లొకేషన్లు అంశాలపై సమాచార కరపత్రాలను విడుదల చేశారు.అదేవిధంగా గుంతకల్లు స్టేషన్‌లోని క్రూ లాబీని తనిఖీ చేసి లోకో పైలట్లు, రైలు మేనేజర్లతో సంభాషించారు. రన్నింగ్ రూమ్‌లో సిబ్బందికి అందిస్తున్న సౌకర్యాలను కూడా ఆయన పరిశీలించారు. తనిఖీ అనంతరం డోన్ అమృత్ స్టేషన్‌లో రూ.46.41 కోట్ల వ్యయంతో జరుగుతున్న పునరాభివృద్ధి పనులను సమీక్షించిన జనరల్ మేనేజర్, ప్రయాణికుల సౌకర్యాల పెంపు దిశగా పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పాణ్యం స్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌లపై ప్రయాణికుల సౌకర్యాలు, దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన మరుగుదొడ్లను పరిశీలించారు.

ఈ సందర్భంగా మాజీ ఎంపి ఎంసూర్యప్రకాష్ రెడ్డితో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు జనరల్ మేనేజర్‌ను కలిసి తమ ప్రాంతీయ అవసరాలను వివరిస్తూ విజ్ఞప్తులు సమర్పించారు. రైల్వే సిబ్బందితో కూడా మాట్లాడిన ఆయన, రోజువారీ పనిలో ఎదురయ్యే సమస్యలను తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

## గాజా బోర్డులో సభ్యుడుగా ఐక్యరాజ్యసమితిని ట్రంప్ ఆహ్వానించలేదా?

### దావోస్‌లో నేడు ట్రంప్ కీలక ప్రసంగం

**న్యూయార్క్ :** పశ్చిమ ఆసియా శాంతి సాధనలో భాగంగా గాజాలో రెండో దశ శాంతి ఒప్పందం అమలు చేసేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ముమ్మర సన్నాహాలు చేస్తున్నారు. భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహా అనేక దేశాలలో ప్రభుత్వ అధిపతులను ఈ శాంతి మండలిలో సభ్యులుగా ఉండాల్సిందిగా ట్రంప్ ఆహ్వానిస్తున్నారు. కానీ అత్యంత కీలకమైన ప్రపంచ సంస్థ ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెరెస్ గాజా శాంతి మండలిలో సభ్యుడుగా ఉన్నారా? లేదా? అనే విషయం స్పష్టం కాలేదు. ఆంటోనీ గుటెరెస్‌కు అధికార ఉప ప్రతినిధిగా పనిచేస్తున్న ఫర్హాన్ హక్ మంగళవారం ఐక్యరాజ్యసమితిలో జరిగిన పత్రికాగోష్టిలో పాత్రికేయులు అడిగిన అనేక ప్రశ్నలకు సమాధానం చెప్పారు. సమితి ప్రధాన కార్యదర్శిని ఈ బోర్డులో సభ్యుడుగా ఉండాలని ట్రంప్ ఆహ్వానించారా? అని ప్రశ్నించినప్పుడు దీనికి సంబంధించి ఎలాంటి సమాచారమైనా వచ్చిందా అనే విషయం తనకు తెలియదని సమాధానం చెప్పారు. అనేక అంతర్జాతీయ సంస్థలతోపాటే ఐక్యరాజ్యసమితి కూడా ఒక సహభాగస్వామిగా ఉంటుందని ఆయన అన్నారు. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ వాణిజ్య వేదిక సమావేశంలో ట్రంప్ బుధవారం పాల్గొంటున్నారు. ఆ మరునాడు గురువారం గాజా శాంతి మండలి చట్టబద్ధ నిబంధనల ఛార్టర్‌ను ట్రంప్ ప్రకటించనున్నారు. ఈ చట్టబద్ధమైన నిబంధనలలో ఏం ఉన్నాయో? ఏమిటో? తెలుసుకోవాల్సి ఉందని, అందువల్ల తాము ఇంకా ఎదురుచూస్తున్నామని ఫర్హాన్ హక్ పాత్రికేయులకు చెప్పారు. గాజా బోర్డులో శాశ్వత సభ్యులుగా ఉండాలంటే ఏ దేశమైనాగా 100 కోట్ల డాలర్లు చెల్లించవలసి ఉంటుందని నివేదికలు చెబుతున్నాయని, ఐనాగానీ ఈ విషయాన్ని తాను ధృవీకరించలేనని, ఈ నిబంధనలు తెలుసుకోవడానికి తాము ఎదురుచూస్తున్నామని ఫర్హాన్ హక్ చెప్పారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్‌ను గాజా బోర్డులో సభ్యుడుగా ఉండాలని ట్రంప్ ఆహ్వానించగా అందుకు మేక్రాన్ తిరస్కరించారు. దీంతో ట్రంప్‌కు తీవ్ర ఆగ్రహం చెందారు. ఫ్రాన్స్‌దేశంపై 200 శాతం సుంకాలు విధిస్తామని బెదిరించారు. దానిని కూడా మేక్రాన్ తిరస్కరించారు. ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు, భారత సంతతికి చెందిన అమెరికన్ అజయ్ బంగాను కూడా గాజాబోర్డులోకి ట్రంప్ ఆహ్వానించారు. అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో సభ్యుడుగా ఉన్నారు. దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశంలో ట్రంప్ బుధవారం ప్రత్యేక ప్రసంగం చేయనున్నారు. ఈ కీలక ప్రసంగం కోసం ఇప్పుడు ప్రపంచదేశాలన్నీ ఎదురుచూస్తున్నాయి. గ్రీన్‌లాండ్ అంశం, గాజా, ఉక్రేన్ విషయాలను ట్రంప్ ప్రధానంగా ప్రస్తావించే అవకాశం ఉంది. కొద్దిరోజులుగా గ్రీన్‌లాండ్‌పైనే ట్రంప్ దృష్టి పెట్టారు. ఉక్రేన్ సమస్యను పట్టించుకోవడంలేదు.


# చట్టబద్ధంగానే ‘సర్’ ఉత్తర్వు

### అసోం మినహా దేశమంతటికీ వర్తిస్తుంది
### సుప్రీంకోర్టుకు చెప్పిన ఎన్నికల సంఘం

**న్యూఢిల్లీ:** వివిధ రాష్ట్రాలలో సర్ (ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ) ప్రక్రియకోసం జారీ చేసిన ఉత్తర్వు స్వభావరీత్యా చట్టబద్ధమైనదని, శాసనపరంగా రూపొందిన మార్గదర్శక సూత్రాల మేరకే నిర్దేశిత పత్రాలు ఈ ప్రక్రియలో తనిఖీకి అవసరం అవుతాయని సుప్రీంకోర్టుకు కేంద్ర ఎన్నికల సంఘం తెలియజేసింది. ఎన్నికల సంఘం తరపున సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేదీ సుప్రీంకోర్టు ధర్మాసనానికి ఈ వివరాలను, సమాచారాన్ని తెలియజేశారు. సర్ ప్రక్రియను సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం మంగళవారం తుది విడత విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా సర్ ప్రక్రియను సమర్థిస్తూ ఎన్నికల సంఘం తరపున న్యాయవాది ద్వివేదీ తన వాదనలు ధర్మాసనానికి తెలియజేశారు. ‘‘ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణకు ఉద్దేశించిన మా ఉత్తర్వు స్వభావరీత్యా శాసనపరమైనది, ఈ మేరకు పూర్తిస్థాయిలో కొన్ని సూత్రాలను ఏర్పాటు చేశారు, నిర్దేశిత పత్రాలు ఈ ప్రక్రియకు అవసరం, ఇది సార్వత్రిక ఉత్తర్వు, అసోం రాష్ట్రానికి సంబంధించి మినహా యావత్ దేశానికి ఈ ఉత్తర్వు వర్తిస్తుంది’’ అని సీనియర్ న్యాయవాది సుప్రీంకోర్టు ధర్మాసనానికి చెప్పారు. ‘సర్’ ఉత్తర్వు రాజ్యాంగ చట్టబద్ధతను, ఈ తనిఖీల నిర్వహణలో ఎన్నికల సంఘానికి ఉన్న అధికారాలను సవాలు చేస్తూ ‘డెమోక్రటిక్ రిఫామ్స్’ అనే ప్రభుత్వేతర సంస్థతోపాటు అనేకమంది పిటిషన్లు సుప్రీంకోర్టులో దాఖలయ్యాయి. పిటిషనర్లు రాజ్యాంగబద్ధమైన అత్యంత కీలకమైన ప్రశ్నలను సుప్రీంకోర్టు ఎదుట ప్రస్తావించారు. ఈ ప్రక్రియ నిర్వహణలో ఎన్నికల సంఘానికి ఉన్న అధికారాలను ప్రశ్నించారు. ఎన్నికల్లో ఓటు వేసేందుకు పౌరులకు ఉన్న ప్రాథమిక హక్కును నిర్ధారించడానికి ఎన్నికల సంఘానికి ఉన్న అధికారాలను, ఎన్నికల నిర్వహణలో నియంత్రణాధికారాలను పిటిషనర్లు ప్రధానంగా ప్రశ్నించారు. ఈ సందర్భంగా ద్వివేదీ సమాధానం చెబుతూ, రాజ్యాంగంలో ఉన్న 324, 325,326 అధికరణలను, ప్రజాప్రాతినిధ్య చట్టంలోని 62వ విభాగాన్ని ఉటంకించి సుప్రీంకోర్టు ధర్మాసనానికి వాటిని సాక్ష్యాధారాలుగా చూపించారు. 1950 నాటి చట్టంలోని 19వ విభాగాన్ని ధర్మాసనం ఎదుట చదివారు. ఎన్నికల సంఘానికి ఉన్న రాజ్యాంగబద్ధమైన విధులను సాక్ష్యాలుగా చూపించారు. ప్రతి ఓటరూ తప్పనిసరిగా నిర్దేశిత తమ సాక్ష్యాధారాల పత్రాలను సమర్పించాలన్న ఉద్దేశంతో ‘సర్’ ప్రక్రియను చేపట్టలేదని వివరణ ఇచ్చారు. కొన్ని సమస్యలు ఉన్న ఓటర్లకే ఇది వర్తిస్తుందన్నారు. గత ఏడాది జూన్ నెల వరకూ ఓటర్ల జాబితాలలో కనిపించిన పేర్లుగలవారు తమ తల్లిదండ్రుల అనుబంధాలను నిరూపించుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ నిరూపణలు చేసుకోలేకపోతే వారు నిర్దేశిత పత్రాలను సర్ ప్రక్రియ విచారణలో సమర్పించాల్సి ఉంటుందన్నారు. 2025 జూన్ వరకూ ఓటర్లు అందరికీ సంబంధిత పత్రాలను జారీ చేశామని చెప్పారు. ఇప్పటికే ఆ ఆధారాలుంటే ఇప్పుడు వారికి వాటితో పని ఉండదన్నారు. బూత్ స్థాయిలో అధికారులు రోజుకు 50 పత్రాలను జారీ చేసేందుకు అధికారాలు ఉన్నాయన్నారు.

# ‘వార్తా పత్రికలను.. ఆపలేం’

### సుప్రీంకోర్టు ‘సిజెఐ ధర్మాసనం’ కీలక వ్యాఖ్యలు
### పంజాబ్ కేసరి వార్తా పత్రిక ప్రింటింగ్ ప్రెస్‌లు యథావిధిగా పనిచేయాల్సిందే
### ‘ఎలాంటి బలవంతపు చర్యలు’ చేపట్టొద్దని పంజాబ్ ప్రభుత్వానికి ఆదేశం



**న్యూఢిల్లీ :** ‘వార్తా పత్రికలను ఆపలేం’ అని గమనించిన సుప్రీంకోర్టు మంగళవారం పంజాబ్ ప్రభుత్వం, దాని కాలుష్య నియంత్రణ బోర్డును ఉద్దేశించి రాష్ట్రంలో ‘పంజాబ్ కేసరి’ న్యూస్ పేపర్ వార్తల ప్రచురణకు వ్యతిరేకంగా ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. మౌఖిక ప్రస్తావనపై వార్తాపత్రిక గ్రూప్ అత్యవసర అభ్యర్థనను అత్యున్నత న్యాయస్థానం స్వీకరించింది. పంజాబ్ రాష్ట్ర కాలుష్య బోర్డు నిబంధనల ఉల్లంఘనల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేయాలని నిర్ణయం తీసుకున్నప్పటికీ ‘హిందూ’ దినపత్రిక ముద్రణ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగించాలని ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వ చర్యలను సవాల్‌చేస్తూ న్యూస్ పేపర్ గ్రూప్ దాఖలు చేసిన పిటిషన్‌పై పంజాబ్, హర్యానా హైకోర్టు తీర్పు ప్రకటించిన తర్వాత కూడా తమ మధ్యంతర ఉత్తర్వు ఒక వారం పాటు అమలులో ఉంటుందని భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్ పాంచౌలి తో కూడిన త్రిసభ్య ధర్మాసనం తెలిపింది. ఇరువైపులా హక్కులకు భంగం కలిగించకుండా, కేసు యోగ్యతపై ఎలాంటి అభిప్రాయాన్ని వ్యక్తం చేయకుండా ‘పంజాబ్ కేసరి’ వార్తాపత్రిక ప్రింటింగ్ ప్రెస్ నిరంతరాయంగా పనిచేయాలని ఆదేశించబడింది. కాగా, హోటల్ మొదలైన ఇతర వాణిజ్య సంస్థలతో సహా యథాతథస్థితిని కొనసాగించాలి. హైకోర్టు తీర్పు వెలువరించేవరకూ బాధితుడు తగిన ఫోరమ్‌ను సంప్రదించడానికి వీలుగా మరో వారం పాటు ఈ మధ్యంతర ఏర్పాటు చేయబడింది’ అని సంక్షిప్త విచారణ తర్వాత ధర్మాసనం ఆదేశించింది.ఈ రోజు విచారణ ప్రారంభంలో వార్తా పత్రిక గ్రూప్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి మాట్లాడుతూ పరిస్థితిని ‘అసాధారణ విషయం’గా అభివర్ణించారు. పంజాబ్ ప్రభుత్వాన్ని విమర్శించే కథనాలు ప్రచురించబడిన తర్వాత రాష్ట్ర వేధింపు యొక్క సమన్వయ ప్రచారం జరిగిందని ఆరోపించారు. కథనం ప్రచురించబడిన తర్వాత విద్యుత్‌ను నిలిపివేయడం, కాలుష్య నియంత్రణ బోర్డు నుండి పత్రికకు నోటీసులు ఇవ్వడం,అంతేకాకుండా వార్తా పత్రిక యజమానులు నడిపే హోటళ్లను మూసివేయించి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం లాంటి చర్యలు చేపట్టారని ధర్మాసనానికి విన్నవించారు. పంజాబ్‌లో ఉన్న పరిస్థితిపై కథనాలు ముద్రించినందుకు ఇదంతా కేవలం రెండు రోజుల్లోనే జరిగిందని ఆయన సిజెఐ నేతృత్వంలోని ధర్మాసనానికి వివరించారు. గత కొన్ని దశాబ్దాలుగా పనిచేస్తున్న ప్రెస్‌ను నీటి కాలుష్యం సమస్య పేరుతో వెంటనే మూసివేయించారన్నారు. పిటిషన్‌ను విచారించిన పంజాబ్ మరియు హర్యానా హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసిందని, అయినప్పటికీ మధ్యంతర ఊరట మంజూరు చేయబడలేదని ఆయన చెప్పారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది షాదన్ ఫరాసత్ హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం చట్ట ప్రకారం అన్ని చర్యలూ తీసుకుందని తెలిపారు. హైకోర్టు తన తీర్పును ఇప్పటికే రిజర్వ్ చేసిందని, తీర్పు రేపో, ఎల్లుండో వెలువడే అవకాశం ఉందన్నారు. అది ఫర్వాలేదు. ‘దినపత్రికలను ఆపలేం’ అని అత్యున్నత న్యాయస్థానం మధ్యంతర ఉపశమనం మంజూరు చేసింది.



## అదీ ..రక్షణ గీత

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రోడ్డు మధ్య ఉన్న చిన్న తెల్ల గీతను తేలికగా తీసుకోవద్దని..ఆ గీతే మనకు శ్రీరామ రక్ష అని తెలంగాణ పోలీసులు మరోసారి హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ‘అరైవ్ అలైవ్’లో భాగంగా పోలీసులు వాహనదారుల్లో ఈ విధంగా చైతన్యం కల్పించారు. మంగళవారం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా తెలంగాణకాప్స్ విడుదల చేసిన ట్వీట్ ప్రస్తుతం వైరల్‌గా మారింది. రోడ్డు భద్రతా నిబంధనలను అతిక్రమించడం ఎంతటి ప్రాణ నష్టానికి దారి తీస్తుందో తెలిపే సిసిటివి ఫుటేజీని షేర్ చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు.‘చిన్నగీతే కదా! అని చిన్నచూపు చూడొద్దు. అర అడుగు దూరం, ఒక్క క్షణం సమయం ఆ యువకుడి కుటుంబంలో విషాదాన్ని నింపింది. రోడ్డు భద్రతా నియమాలను పట్టించుకోకుండా డ్రైవింగ్ చేస్తే ప్రమాదాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఒకరి ఓవర్ స్పీడ ఓవర్ థింకింగ్ మరొకరి జీవితంలో అంధకారం నింపింది’ అని తెలంగాణ పోలీస్ ట్వీట్లో పేర్కొన్నారు. వైరల్ అవుతున్న సిసిటివి వీడియోలో, అతి వేగంతో ప్రయాణిస్తున్న ఓ బైకర్ రోడ్డుపై ఉన్న వైట్ లైన్ను దాటి ముందుకు వెళ్లే ప్రయత్నం దృశ్యాలు కనిపిస్తున్నాయి. అదే సమయంలో ఎదురుగా వచ్చిన వాహనం బైకర్ను ఢీకొనడంతో అతడు గాల్లోకి ఎగిరిపడ్డాడు. ఈ ఘటన రోడ్డు మీద గీతల ప్రాముఖ్యతను స్పష్టంగా చూపిస్తోంది. కాగా, రోడ్డుపై వైట్ లైన్ గ్యాప్తో ఉన్న చోట్ల మాత్రమే ఓవర్టేక్ చేయడం, లైన్ మార్చడం సురక్షితం. అయితే సింగిల్ లేదా డబుల్ వైట్ లైన్లు గ్యాప్ లేకుండా ఉన్నప్పుడు ఓవర్టేక్ చేయడం ప్రమాదకరం. ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే తీవ్ర ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని పోలీసులు హెచ్చరించారు. అతివేగం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వల్ల ఒక్క క్షణంలోనే కుటుంబాల జీవితాలు చీకట్లోకి వెళ్లిపోతాయని, ప్రతి డ్రైవర్ రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని తెలంగాణ పోలీస్ విజ్ఞప్తి చేశారు.

## వ్యసనాల బారినపడి భర్తను చంపేసింది..!



**ప్రజాపక్షం/హైదరాబాద్:** జల్సాలకు అలవాటు పడిన మహిళ.. పైగా అక్రమ సంబంధాలు.. తన వెదవ్వేశాలకు అడ్డు చెబుతున్నాడని భర్తపైనే కక్ష కట్టింది... చివరికి కడతేర్చింది..! కూకట్ పల్లి లో ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది.! కూకట్ పల్లి వివి నగర్ లోని ఈనాడు హైట్స్ అపార్ట్మెంట్ మొదటి అంతస్తులో నివసించే జగ్గవరపు సుధీర్ రెడ్డి ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆయన భార్య ప్రసన్నతో ఆయనకు కొంత కాలంగా గొడవలు నడుస్తున్నాయి.. రెండు దశాబ్దాల క్రితం 2004 లో వివాహం జరిగి ఇద్దరు పిల్లలు ఉన్నప్పటికీ భార్య బయట జల్సాలకు వ్యసనాలకు అలవాటుకావడం.. అక్రమ సంబంధాలతో పరువు తీస్తున్న వైనంపై సుధీర్ రెడ్డి మందలించాడు. అయితే భర్తతో గొడవపడుతూ అతనిపై జులుం ప్రదర్శించిన ప్రసన్న మరింత రెచ్చిపోయి బాహాటంగానే ఇతర మగవాళ్ళతో తిరగడం ప్రారంభించింది. దీంతో ఇద్దరిమధ్య వివాదం మరింత ముదిరింది. భర్త తన కార్యకలాపాలకు అడ్డుగా ఉన్నాడని భావించిన ప్రసన్న అతన్ని ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలని కుట్ర చేసింది. పక్కా ప్లాన్ తో నెలరోజుల క్రితం గతేడాది డిసెంబర్ 24న ఇంట్లో పడుకుని ఉన్న భర్త గొంతుకు చున్నీ బిగించి హత్య చేసింది.. ఏమీ ఎరగనట్లు విజయవాడలో ఉండే మృతుడి సోదరి సునీతకు ఫోన్ చేసి మీ తమ్ముడు బేడ నుండి కింద పడి చనిపోయాడు అని నమ్మబలికింది.. వారు వెంటనే విజయవాడ నుండి వచ్చి ఏం జరిగిందని మరోదారి ప్రసన్నను ప్రశ్నించగా తనకు తెలియదని.. నిద్రలోనే ఉంది బేడ పైనుండి కింద పడిపోయాడని తను లేపే ప్రయత్నం చేశానని అయితే అప్పటికే ఆయన మరణించాడని చెప్పింది.ప్రసన్న వ్యవహారాలన్నీ తెలిసిన సునీత తన తమ్ముడి చావుకు ప్రసన్ననే కారణమని కేసు దర్యాప్తు చేసి న్యాయం చేయాలని పోలీసు స్టేషన్ లో ఫిర్యాది చేసింది. కేసు నమోదు చేసిన పోలీసుకు సుధీర్ రెడ్డిని ఆయన భార్యనే చున్నీతో బిగించి హత్యచేసినట్లుగా తేల్చారు.. జల్సాలకు వ్యసనాలకు అలవాటుపడిన ప్రసన్న.. అడ్డుగా ఉన్నాడని భర్తను అంతమొందించిందని తెలిపారు.

## బ్రహ్మోత్సవాలకు ఆభరణాల పాదయాత్ర



**ప్రజాపక్షం/కొత్తకోట :** కొత్తకోట మండల కేంద్రం నుంచి అమడబాకుల వరకు డప్పులతో భక్తుల భారీ ర్యాలీ ఆంధ్రాబ్యాంకు లాకర్ల నుంచి స్వామి ఆభరణాల తరలింపు కార్యక్రమం వనపర్తి జిల్లాలోని కొత్తకోట మండల పరిధిలో గల అమడబాకుల గ్రామంలోని శ్రీశ్రీశ్రీ స్వయంభు కళ్యాణ లక్ష్మి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం స్వామి వారి ఆభరణాల తరలింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కొత్తకోట మండల కేంద్రంలో ఉన్న ఆంధ్రాబ్యాంక్ లాకర్ల నుంచి సర్పంచు గాయత్రి అనిల్ కుమార్ యాదవ్, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బ్యాంకు అధికారులు స్వామి వారి ఆభరణాలను అందజేశారు. బుధవారం స్వామి వారికి ఆభరణాల అలంకరణ, అంకురార్పణ వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 21 నుంచి 27వ తేది వరకు బ్రహ్మోత్సవాల సందర్భంగా పలు భక్తి కార్యక్రమాలు జరగనున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు విజయరెడ్డి, ఉపాధ్యక్షులు సుందర్ రెడ్డి, వామన్ గౌడ్, కొల్లంపల్లి యాదవ్, మంగలి శంకర్, మాజీ ఎంపీటీసీ శేషిరెడ్డి, ప్రకాష్ శెట్టి, సురేందర్ చారి, మాలజి, శ్రీనివాసులు, సుదర్శన్ రెడ్డి, కావాలి వెంకటయ్య, జ్ఞానేశ్వర్, జనార్దన్, చింపిరి శ్రీనివాసులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



## ఆర్థికసాయం అందజేత

**ప్రజాపక్షం/వెల్దండ :** మండలపరిధిలోని పోతేపల్లి గ్రామానికి చెందిన బోయినపల్లి అల్లాజిగౌడ్ అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న గ్రామసర్పంచ్, రాష్ట్రసర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి తగుళ్లకొండల్‌యాదవ్ మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించి ఆకుటుంబసభ్యులకు రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు.కార్యక్రమంలో ఉపసర్పంచ్ , వార్డుమెంబర్లు శారదబాలయ్యగౌడ్, అశోక్‌కుమార్, వావిళ్లకొండలు, ఎగిరిశెట్టి శివ, ఉడుత బాలస్వామి పాల్గొన్నారు.

**వెల్దండలో :** మండలకేంద్రానికి చెందిన కర్నేకంటి వెంకటయ్య అనారోగ్యంతో హైదరాబాద్‌లోని మెడికేర్ ఆస్పత్రిలో చికిత్సపొంది క్షేమంగా రాత్రి ఇంటికి చేరుకున్నారు. వారి కుటుంబాన్ని బిఆర్‌ఎస్‌పార్టీ మాజీ మండల అధ్యక్షులు కానుగుల జోగయ్య కన్యాకుమారి వ్యక్తిగతంగా రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. వారి కుటుంబానికి అన్నివిధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్‌మాజీ ఎంపిటిసి నిరంజన్, బిఆర్‌ఎస్ సీనియర్ నాయకులు గోవర్ధన్‌సింగ్, 12వవార్డుమెంబర్ సిరసనగండ్ల శేఖర్, లింగంముదిరాజ్, మాజీవార్డు సభ్యులు యెన్నం నారాయణరెడ్డి, మావిళ్లగణేష్, పుష్పలత, పిల్లి సురేష్, పిల్లిశ్రీను, కర్నెకంటి వెంకటయ్య, అరుణ్, బసన మోని మల్లయ్య, గౌడుగు వెంకటయ్య పాల్గొన్నారు.

## కెప్టెన్ ఫామ్ అందుకునేనా.. తిలక్‌వర్మ స్థానంలో ఆడేది ఎవరు?

స్వదేశంలో పొట్టి ప్రపంచకప్ ముందు భారత జట్టు చిట్ట చివరి సిరీస్ ఆడనుంది. వరుసగా రెండో సారి విజేతగా నిలవాలనుకుంటున్న టీమిండియా అన్ని అస్త్రాలను సరి చూసుకోనుంది. న్యూజిలాండ్‌తో ఐదు టి–20ల సిరీస్ ఆత్మవిశ్వాసాన్ని పెంచుకునేందుకు చాలామంచి అవకాశం. అయితే.. ప్రతిభావంతులకు కొదవలేకున్నా.. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఫామ్ గురించే అందరి ఆందోళనంతా. ఇటీవల వరుసగా తేలిపోతున్న మిస్టర్ 360 మెగాటోర్నీ ముందు టచ్‌లోకి వస్తాడా? తిలక్ వర్మ స్థానంలో ఎవరు ఆడుతారు? అనేది ఉత్కంఠ రేపుతోంది. పొట్టి క్రికెట్లో వరుస సిరీస్ విజయాలతో భారత జట్టు తిరుగులేని శక్తిగా అవతరించింది. ఈ ఏడాది ఆరంభంలో ఆస్ట్రేలియా




గడ్డపై, స్వదేశంలో దక్షిణాఫ్రికాపై జయభేరి మోగించిన టీమిండియా ఈసారి న్యూజిలాండ్ చెక్ పెట్టాలనుకుంటోంది. వన్డే సిరీస్‌లో సంచలన ఆటతో విజేతగా నిలిచిన బ్లాక్యాప్స్‌ను పొట్టి ఫార్మాట్లో చావుదెబ్బ కొట్టాలని సూర్యకుమార్ సేన పట్టుదలతో ఉంది. జనవరి 21న బుధవారం నాగపూర్లో టి–20 సిరీస్ షురూ కానుంది. స్క్వాడ్లో అభిషేక్ శర్మ, సంజూ శాంసన్ , హార్దిక్ పాండ్యా.. రింకూ సింగ్ వంటి బిగ్ హిట్టర్లు, మ్యాచ్ విన్నర్లు చాలామందే. కానీ, సారథి సూర్య ఆటపైనే సందేహాలున్నాయి. రెండేళ్లక్రితం టి–20 ప్రపంచకప్ తర్వాత నుంచి అతడి గణాంకాలు దారుణంగా పడిపోయాయి. 22 ఇన్నింగ్స్‌లో 12.84 సగటుతో 244 రన్స్ చేశాడతే. శాంసన్ మూడు సెంచరీలతో.. తానెంత ప్రమాదకరమో ఇప్పటికే చాటుకున్నాడు.

**ఇషాన్‌కే ఛాన్స్?...** గాయంతో సిరీస్‌కు దూరమైన తిలక్ వర్మ స్థానంలో శ్రేయాస్ అయ్యర్‌ను ఆడిస్తారా? ఇషాన్ కిషన్‌ను తీసుకుంటారా? అనేది ఆసక్తి రేపుతోంది. మూడేళ్ల క్రితం డిసెంబర్‌లో చివరి అంతర్జాతీయ టి–20 మ్యాచ్ ఆడిన అయ్యర్‌కు ఐపిఎల్ ఫైనలే ఫ్రాంచైజీ క్రికెట్‌లో ఆఖరిది.

**అదే ఇషాన్ కిషన్ విషయానికొస్తే..** ఇటీవలే సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో జార్ఖండ్ సారథిగా ఇరగదీశాడు. సంచలన ఇన్నింగ్స్‌తో జట్టును విజేతగా నిలిపిన ఈ చిచ్చరపిడుగు.. సెలెక్టర్ల దృష్టిలో పడి ప్రపంచకప్ బెర్తు సైతం దక్కించుకున్నాడు. కాబట్టి.. ఈ లెఫ్ట్ హ్యాండర్‌కే తొలి టి–20లో అవకాశం దక్కుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## జెమీమా కెప్టెన్ ఇన్నింగ్స్..

### ముంబైని 7 వికెట్ల తేడాతో ఓడించిన ఢిల్లీ..!



మహిళల ప్రీమియర్ లీగ్ ప్లే ఆఫ్స్ రేసులో వెనకబడిన ఢిల్లీ క్యాపిటల్స్ వడోదరలో గర్జించింది. మాజీ ఛాంపియన్ ముంబై ఇండియన్స్‌ను స్వల్ప స్కోర్‌కే కట్టడి చేసిన ఢిల్లీ.. ఛేదనలో చెలరేగింది. ఓపెనర్ లిజెల్లీ లీ (46), షఫాలీ వర్మ(29) విధ్వంసక ఆటతో బలమైన పునాది వేయగా.. జెమీమా రోడ్రిగ్స్(51 నాటౌట్) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడింది. మరిజానే కాప్(10 నాటౌట్)తో కలిసి ఢిల్లీని గెలిపించిం.. ప్లే ఆఫ్ ఆశలు సజీవంగా ఉంచింది. మహిళల ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్లో ఢిల్లీ క్యాపిటల్స్ రెండోవిజయం నమోదు చేసింది. ఉత్కంఠ పోరులో సమిష్టిగా రాణించిన ఢిల్లీ.. మరో ఓవర్ ఉండగానే ముంబై ఇండియన్స్‌ను 7 వికెట్ల తేడాతో మట్టికరిపించింది. ప్రత్యర్థి ముంబై నిర్దేశించిన ఛేదనను ఢిల్లీ ఓపెనర్లు దూకుడుగా మొదలెట్టారు. లిజెల్లీ లీ(46), షఫాలీ వర్మ(29)లు బౌండరీలతో చెలరేగుతూ ముంబై బౌలర్లను ఒత్తిడిలో పడేశారు. తొలి వికెట్కు 63 రన్స్ జోడించిన ఈ ద్వయాన్ని వైష్ణవీ శర్మ విడదీసింది. ఆఫ్ సైడ్ ఆడాలనుకున్న షఫాలీని తను క్లీన్‌బౌల్డ్ చేసింది. ఆ తర్వాత లారా వొల్వార్డ్(17)తో కలిసి జెమీమా రోడ్రిగ్స్(51 నాటౌట్) కీలక ఇన్నింగ్స్ నిర్మించింది. అయితే.. నాట్‌సీవర్ ఓవర్లో లారా అనూహ్యంగా రనౌట్ కాగా జట్టును గెలిపించే బాధ్యత తీసుకుంది కెప్టెన్. బ్రంట్ ఓవర్లో సిక్సర్ బాదిన తను.. ఆపై మాథ్యూస్ బౌలింగ్‌లో రెండు ఫోర్లతో ఢిల్లీని గెలుపు వాకిట నిలిపింది. 19వఓవర్ చివరిబంతికి మరిజానే కాప్(10 నాటౌట్) సిక్సర్ బాదగా ఢిల్లీ 7 వికెట్ల తేడాతో విజయం సాధించి ప్లే ఆఫ్ రేసులో నిలిచింది.

**దంచేసిన బ్రంట్, హర్మన్‌ప్రీత్..** కీలకమైన పోరులో ముంబై ఇండియన్స్ భారీ స్కోర్ చేయనివ్వలేదు ఢిల్లీక్యాపిటల్స్. పవర్ ప్లేలోనే రెండు వికెట్లతో ముంబైకి షాకిచ్చినా.. నాట్ సీవర్ బ్రంట్(65 నాటౌట్), హర్మన్‌కౌర్(41)లు మూడో వికెట్‌కు కీలక భాగస్వామ్యంతో ముంబైని ఆదుకున్నారు. శ్రీ చరణి(333)మూడు వికెట్లతో చెలరేగడంతో మిడిలార్డర్ బ్యాటర్లు విఫలమయ్యారు.

### బంగ్లాకు మద్దతుగా టి–20 వరల్ కప్ బహిష్కరణ..?

## పాక్ వైఖరి ఇదే




బంగ్లాదేశ్‌కు మద్దతుగా తమ జట్టు టి–20 వరల్ కప్ టోర్నీలో పాల్గొనబోదని జరుగుతున్న ప్రచారాన్ని పాకిస్తాన్ ఖండించింది. ఇదంతా అసత్య ప్రచారమేనని పాకిస్తాన్ క్రికెట్ బోర్డ్ (పీసీబీ) తేల్చిచెప్పింది. భారత్‌బంగ్లాదేశ్ మధ్య టీ20 వరల్ కప్ అంశంలో వివాదం నెలకొన్న సంగతి తెలిసిందే. ఇండియాలో జరగబోయే ఈ టోర్నీలో తాము పాల్గొనబోమని బంగ్లా హెచ్చరించింది. భద్రతా కారణాల రీత్యా ఇండియాకు రాలేమని, మ్యాచ్ జరిగే వేదికల్ని మరో చోటుకు మార్చాలని ఐసీసీని బంగ్లా కోరింది. దీనిపై ఇంకా నిర్ణయం వెలువడాల్సి ఉంది. ఇదే సమయంలో బంగ్లాదేశ్ కు మద్దతుగా పాకిస్తాన్ కూడా టీ20 వరల్ కప్ బహిష్కరించినట్లు కొద్ది రోజులుగా ప్రచారం జరుగుతోంది. తాజాగా దీనిపై పీసీబీ స్పందించింది. తాము టోర్నీని బహిష్కరిస్తున్నట్లు జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని పీసీబీ సభ్యులు తెలిపారు. ఈ టోర్నీకి సంబంధించి గత ఏడాది ప్రారంభంలోనే ఒప్పందం కుదిరిందని చెప్పారు. అప్పటికి ఇండియా.. ఛాంపియన్స్ ట్రోఫీ కోసం పాక్ రాలేనని చెప్పిందని, దీంతో తాము కూడా టీ20 వరల్ కప్ కోసం ఇండియాలో కాకుండా శ్రీలంకలో మ్యాచులు ఆడతామని చెప్పినట్లు తెలిపారు. ముందే ఇండియాలో కాకుండా, శ్రీలంకలో మ్యాచులు నిర్వహించాలని నిర్ణయించినందున ఈ టోర్నీని తాము బహిష్కరించడం లేదన్నారు. దీంతో ఈ టోర్నీలో పాక్ పాల్గొంటుందని స్పష్టమైంది. అయితే, బంగ్లాదేశ్ పాల్గొనే విషయంలో ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. బంగ్లా ఆడేందుకు నిరాకరిస్తే ఆ స్థానంలో మరో జట్టును రంగంలోకి దించాలని ఐసీసీ భావిస్తోంది. ఇదే జరిగితే బంగ్లాదేశ్ కు పెద్ద ఎదురుదెబ్బే.

# మహిళ

## నైపుణ్యాభివృద్ధితోనే ఉపాధి అవకాశాలు

అన్నిరంగాల్లోనూ అత్యంత వేగంగా మార్పులు చోటు చేసుకుంటున్న నేటి ప్రపంచంలో, గ్రామీణ మహిళలు ఆర్థికంగా బలపడాలంటే కేవలం కష్టపడటంతోనే సరిపోదు.. తమకు ఉన్న నైపుణ్యాలను గుర్తించి, వాటిని మెరుగుపరుచుకొని, కొత్త అవసరాలకు అనుగుణంగా మార్చుకోవడం అత్యంత అవసరం. వ్యవసాయం, పశుపోషణ, వంట, చేతిపనులు వంటి సంప్రదాయంగా మహిళలకు తెలిసిన పనులు. వీటిని కూడా ఆధునిక శిక్షణతో, సాంకేతిక అవగాహనతో కలిపితే లాభదాయకమైన ఉపాధులుగా మారగలవు. గ్రామీణ ప్రాంతాల్లో శిక్షణా కేంద్రాలు, ప్రభుత్వపథకాలు, స్వచ్ఛం ద సంస్థలు అందించే స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులను మహిళలు సద్వినియోగం చేసుకుంటే వారి జీవితాల్లో స్థిరమైన మార్పు రావచ్చు.

వ్యవసాయం గ్రామీణ మహిళలకు ప్రధాన ఆధారం. కానీ సంప్రదాయ పద్ధతులతో సాగు చేయడం వల్ల లాభాలు తక్కువగా ఉంటాయి. విత్తనాల సరైన ఎంపిక, నేల ఆరోగ్యం, నీటి వినియోగం, పంటల వైవిధ్యీకరణ వంటి అంశాలపై శిక్షణ పొందితే దిగుబడులు పెరుగుతాయి. ఒకే పంట మీద ఆధారపడకుండా కూరగాయలు, పప్పులు, నూనెగింజలు వంటి పంటలను కలిపి సాగు చేయడం వల్ల ఆదాయం స్థిరపడుతుంది. సేంద్రియ సాగు, సహజ ఎరువులు, జీవసారాల వినియోగం నేర్చుకున్న మహిళలు తక్కువ ఖర్చుతో మంచి దిగుబడులు పొందగలుగుతారు. దీనితో పాటు పంటల నిల్వ, ప్యాకేజింగ్, ప్రాసెసింగ్ వంటి అంశాలు తెలిసినప్పుడు విలువ పెరిగిన ఉత్పత్తులను మార్కెట్‌కు అందించవచ్చు. పశుపోషణ గ్రామీణ మహిళలకు ఎంతో అనుకూలమైన ఉపాధి. ఆవులు, గేదెలు, మేకలు, కోళ్ల పెంచడం ద్వారా రోజువారీగా లేదా నెలవారీగా ఆదాయం పొందవచ్చు. పాలఉత్పత్తుల తయారీ, పెరుగు, వెన్న, నెయ్యి వంటి ఉత్పత్తులు తయారు చేయడం ద్వారా లాభం మరింత పెరుగుతుంది. సరైన మేత, జంతు ఆరోగ్యం, టీకాలు, శుభ్రత వంటి విషయాలపై శిక్షణ ఉంటే నష్టాలు తగ్గి లాభాలు పెరుగుతాయి. కోళ్ల పెంపకం, గుడ్ల ఉత్పత్తి కూడా తక్కువ పెట్టుబడితో మొదలయ్యే మంచివ్యాపారం. ఈరంగాల్లో మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా సమూహం గా పని చేస్తే పెద్ద స్థాయిలో మార్కెట్‌ను చేరుకోవచ్చు.

గ్రామీణ మహిళలకు చేతిపనులు, చేనేత, హస్తకళలు కూడా గొప్ప అవకాశాలను ఇస్తాయి. పల్లెల్లో తయారయ్యే వస్త్రాలు, అలంకరణ వస్తువులు, సంప్రదాయ కళాకృతులకు పట్టణాల్లో, విదేశాల్లో కూడా మంచి డిమాండ్ ఉంటుంది. కానీ



నాణ్యత, డిజైన్, ట్రెండ్‌లకు అనుగుణంగా ఉత్పత్తులు తయారు చేయడం నేర్చుకోవాలి. ఆధునిక డిజైన్ శిక్షణ, రంగుల వినియోగం, ఫినిషింగ్ వంటి అంశాలపై అవగాహన పెరిగితే వారి ఉత్పత్తులకు విలువ పెరుగుతుంది. చేనేత, హస్తకళల ద్వారా మహిళలు తమ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకుంటూనే ఆదాయం పొందగలుగుతారు. ఆహార ప్రాసెసింగ్ గ్రామీణ మహిళలకు మరొక పెద్ద అవకాశం. ఊర్లో లభించే పండ్లు, కూరగాయలు, ధాన్యాలను ఉపయోగించి జామ్‌లు, పికిల్స్, పాపడ్లు, మసాలాలు, స్నాక్స్ వంటి ఉత్పత్తులు తయారు చేయవచ్చు. ఇవి ఇంటి వద్దే ప్రారంభించగలిగే చిన్న పరిశ్రమలు. సరైన పరిశుభ్రత, ప్యాకేజింగ్, నిల్వ విధానాలు తెలిసినప్పుడు ఈ ఉత్పత్తులు ఎక్కువ కాలం నిల్వ ఉండి మార్కెట్‌లో మంచి ధరకు అమ్ముకోవచ్చు. అగరబత్తీలు, సబ్బులు, డిటర్జెంట్లు వంటి రోజువారీ వినియోగ వస్తువుల తయారీ కూడా గ్రామీణ మహిళలకు స్థిర ఆదాయాన్ని ఇస్తుంది. ఈ అన్ని నైపుణ్యాలకు శిక్షణ ఎంత ముఖ్యమో, మార్కెటింగ్ అవగాహన కూడా అంతే ముఖ్యం. మంచి ఉత్పత్తి ఉన్నా దాన్ని సరైన చోటుకు తీసుకెళ్లలేకపోతే లాభం రాదు. స్థానిక మార్కెట్లు, వారపు హాట్లు, పట్టణాల బజార్లు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫార్మ్‌ల గురించి తెలుసుకోవాలి. ప్యాకేజింగ్ ఆకర్షణీయంగా ఉంటే వినియోగదారుల దృష్టి ఆకర్షించవచ్చు. నాణ్యత ప్రమాణాలు పాటించినప్పుడు గ్రామీణ ఉత్పత్తులు పట్టణ మార్కెట్లలోనూ నిలదొక్కుకుంటాయి. అంతిమంగా, నైపుణ్యాభివృద్ధి అనేది గ్రామీణ మహిళలకు కేవలం ఉద్యోగం లేదా వ్యాపారం మాత్రమే కాదు; అది ఆత్మవిశ్వాసం, స్వతంత్రత, గౌరవాన్ని ఇస్తుంది. ఒక మహిళ తన శ్రమతో సంపాదించిన ఆదాయం ఆమెను కుటుంబంలో, సమాజంలో బలమైన స్థానానికి తీసుకెళ్తుంది. ఈ విధంగా నైపుణ్యాలు గ్రామీణ మహిళలను పేదరికం నుంచి బయటకు తీసుకువచ్చి స్వావలంబన దిశగా నడిపిస్తాయి.

## పురుషాధిక్యానికి 'బాస్సీ' సవాలు!

ఇటలీలోని బొలోన్యా విశ్వవిద్యాలయం వేదికగా 1732లో చోటు చేసుకున్న ఒక అద్భుత ఘటన మహిళా లోకాన్ని గర్వంతో తలెత్తుకునేలా చేసింది. తర్వాతి కాలంలో లారా బాస్సీగా సుప్రసిద్ధురాలైన లారా మరియా కాథరీన బాస్సీ వెరాటీ తన అసామాన్యమైన మేధస్సుతో, ప్రొఫెసర్లు, పండితులు, ఉన్నతాధికారులతో నిండిన సభ ముందు తన డాక్టరల్ థీసిస్‌ను సమర్థించేందుకు నిలిచింది. అప్పుడు ఆమె వయసు కేవలం 21సంవత్సరాలు. ఆమెకు తత్వశాస్త్రంలో ప్రావీణ్యం ఉంది. భౌతికశాస్త్రం, గణిత శాస్త్రంలో అసాధారణ పట్టు ఉంది. అందుకే, అప్పటి వరకూ ఇటలీలో ఎవరూ చేయని రీతిలో డాక్టరేట్ కోసం ప్రయత్నించింది. పురుషాధిక్యాన్ని సవాలు చేస్తూ, అద్వితీయ ప్రతిభాపాటవాలు కనబరచింది. డాక్టరేట్ సంపాదించడమే కాదు... ఐరోపాలోనే తొలి మహిళా విశ్వవిద్యాలయ ఉపాధ్యాయురాలిగా నియామకం పొందింది. అప్పట్లో ఇదో విప్లవాత్మక పరిణామం. బాస్సీ యూరప్‌లో అధికారిక విశ్వవిద్యాలయ బోధనా హోదా పొందిన తొలి మహిళగా చరిత్ర సృష్టించింది. తనను తాను నిరూపించుకోవడంలో ఆమె ప్రస్థానం సులభంగా సాగలేదు. పురుషులకు ఒక మహిళ బోధించడం విశ్వవిద్యాలయాధికారులకు నచ్చేది కాదు. అందుకే ఆమె బోధించే సమయాలను, ప్రదేశాలను పరిమితం చేశారు. అయినప్పటికీ బాస్సీ తన కాలపు రాజకీయ పరిస్థితులను అద్భుతంగా ఎదుర్కొంది. 1778లో మరణించే నాటికి, బాస్సీ దాదాపు యాభై సంవత్సరాలపాటు బోధించింది. అనేకతరాలను ప్రేరేపించిచింది. ఆమె తెరిచిన తలుపు పూర్తిగా విప్పబడటానికి శతాబ్దాలు పట్టినా, యూరప్ శాస్త్ర చరిత్రలో ఆమె పోషించిన పాత్ర శాశ్వతమైనది.



## దీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

### ఆర్‌టిసి కార్మికుల డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆర్‌టిసి కార్మికులు ముక్త కంఠంతో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఆర్‌టిసి కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్‌టిసి జెఎసి పిలుపు మేరకు మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా ఆర్‌టిసి కార్మికులు ఎర్రబ్యాడ్జీలతో డిపోల ఎదుట నిరసన వ్యక్తంచేశారు. జెఎసి పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా పోరాట దినం కార్యక్రమాన్ని విజయవంతం చేసిన డిపో, యూనిట్, రీజనల్, జోనల్, రాష్ట్ర నాయకులకు , యూనియన్లకు అతీతంగా ఈ ఉద్యమంలో పెద్దయెత్తున పాల్గొన్న కార్మికులు, ఉద్యోగులందరికీ జెఎసి నాయకులు ధన్యవాదాలు తెలియజేశారు. మునుముందు జెఎసి చేపట్టే ప్రత్యక్ష పోరాట కార్యక్రమాలల్లో కార్మికులందరూ ఇదేవిధంగా పాల్గొనాలని జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్‌చైర్మన్, ఎం.థామస్ రెడ్డి, కన్వీనర్ ఎండి.మౌలానా, కోకన్వీనర్ కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బి.యాదగిరిలు పిలుపునిచ్చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పొందపర్చిన ఆర్‌టిసి, ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ ఆర్‌టిసి, రైల్వే శాఖ తరహాలో టికెట్ తీసుకుని ప్రయాణించే బాధ్యత ప్రయాణికులదే బాధ్యతగా ప్రకటించి ఆర్టీసి కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఆదేవిధంగా 2021 వేతన సవరణ 30 శాతం అమలు చేయాలని, పైసా ఖర్చు లేని ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరించాలన్నారు. ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వమేకొని ఆర్‌టిసికి ఇవ్వాలని, రిటైర్ అయిన ఉద్యోగుల బకాయిలన్నిటిని వెంటనే చెల్లించడం తదితర పెండింగ్ సమస్యలను ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కరించాలని జెఎసి నాయకులు డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకాన్ని ఆర్‌టిసి కార్మికులు అష్టకష్టాలు పడుతూ, ఉద్యోగాలు కోల్పోతూ, భౌతిక దాడులకు గురవుతూ ఆర్‌టిసిలో అమలు చేస్తున్నప్పటికీ ముఖ్యమంత్రి కార్మికులను అవమానపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని అన్నారు. మహాలక్ష్మి పథకానికి సంబంధించి జీరో టికెట్ డబ్బులు ఆర్‌టిసి రూ.2,072 కోట్లు ప్రభుత్వం బకాయి ఉందని, వీటిని ప్రభుత్వం తక్షణమే చెల్లించి చిత్తశుద్ధిని చాటుకోవాలని వారు కోరారు.

## కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు చెల్లించే వరకూ ఆందోళనలు

### ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నరసింహ




**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** నెలల తరబడి చెల్లించని వేతనాలు వెంటనే చెల్లించకపోతే తమ ఆందోళన ఇక ఉధృతంగా కొనసాగిస్తామని ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధానకార్యదర్శి ఎం.నరసింహ హెచ్చరిచారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని నాచారం ఇఎస్‌ఐ ఆస్పత్రిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలంటూ కొనసాగుతున్న నిరవధిక ఆందోళనలో భాగంగా మంగళవారం జరిగిన ధర్నాలో కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ ఆక్టివిటీ సంస్థ పేరిట నాచారం ఇఎస్‌ఐ ఆస్పత్రిలో పని చేస్తున్న సెక్యూరిటీ, శానిటరీ సిబ్బందికి గత ఐదు మాసాలుగా వేతనాలు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు పలుసార్లు చెప్పినా, వినతిపత్రాలు అందజేసిన ఫలితం లేకపోవటంతో కార్మికులు చివరికి ఆందోళనబాట పట్టాల్సి వచ్చిందన్నారు. కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్న వారిలో అత్యధికంగా పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారే ఉంటారన్నారు. వారు తమ కుటుంబ అవసరాల కోసం చాలీచాలని జీతాలతో కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్నా వారికి నెల నెలా వేతనాలు చెల్లించక పోవటంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిత్యం ఆస్పత్రి రోగులకు పలురకాల సేవలందిస్తున్న కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడం అమానుషమన్నారు. వేతనాలతో పాటు వారికి నిబంధనల మేరకు చెల్లించాల్సిన ఇఎస్‌ఐ, పిఎఫ్ డబ్బులు సైతం ఆయా సంస్థలకు చెల్లించటం లేదన్నారు. వేతనాల బకాయిలు చెల్లించాలన్న డిమాండ్‌తో ఈ నెల 22 వరకు ఆస్పత్రి ప్రాంగణంలో ప్రతిరోజు 2 గంటల పాటు ధర్నా నిర్వహిస్తామని, అప్పటికీ సమస్య పరిష్కారం కాని పక్షంలో ఆస్పత్రి విధులు బహిష్కరించటం ద్వారా ఆందోళనను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్మికుల ఆందోళన వల్ల రోగులకు కలిగే ఇబ్బందులకు ఆస్పత్రి అధికారులే బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ వేణుకుమార్, యూనియన్ నాయకులు క్రాంతికుమార్, నర్సింహ, అశోక్, భాస్కర్, రాములు, రాజేష్, నిరంకర్, సిస్టర్ లింగమ్మ, సిస్టర్ సుధ, రాజు తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్ ఎన్నికల బరిలో ఉంటాం



### సిపిఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం వెల్లడి

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** రామగుండం కార్పొరేషన్ ఎన్నికలో బరిలో ఉంటామని సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం వెల్లడించారు. మంగళవారం సిపిఐ రామగుండం నగర కార్యవర్గ సమావేశం శనిగారపు చంద్రశేఖర్ అధ్యక్షతన స్థానిక భాస్కరరావు భవన్‌లో జరిగింది. ఈ సమావేశానికి సదానందం హాజరై మాట్లాడుతూ రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీకి సిద్ధం అవ్వాలని పార్టీ నాయకత్వానికి పిలుపునిచ్చారు. సిపిఐగా అనేక ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తూ కార్మిక హక్కుల సాధనలో పోరాడుతూ నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడుతున్న సిపిఐని రామగుండం కార్పొరేషన్‌లో ప్రజలు ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. రామగుండం నగరంలో భారత కమ్యూనిస్టు పార్టీ దాదాపు 3,000 పైచిలుకు సభ్యత్వంతో అన్ని డివిజన్‌లలో పార్టీ నాయకత్వాన్ని కలిగి బలంగా ఉందన్నారు. కేవలం సిపి ప్రజాప్రతినిధులతోనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఆర్థిక పెట్టుబడిదారులు ఓట్లు కొంటె రేపు అంతకు రెండింతలు సంపాదించే విధంగా అవినీతికి పాల్పడతారే తప్పా అభివృద్ధి కోసం ప్రజల సమస్యల పట్ల చిత్తశుద్ధి చూపించరని వివరించారు. రాబోయే కార్పొరేషన్ ఎన్నికల రణరంగంలో సిపిఐ తన సత్తా చాటుతుందని తెలిపారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోసిక మోహన్, గౌతం గోవర్ధన్, నగర కార్యదర్శి కె.కనకరాజ్, పార్టీ, ప్రజాసంఘాల నాయకులు తాళ్ళ పెల్లి మల్లయ్య, మాటేటి శంకర్, తోడుపునూరి రమేష్‌కుమార్, మడికొండ ఓదెమ్మ, ఆసాల రమ, ఆరేల్లి పోషం, సిరిసిల్ల మల్లేష్ పడాల కనకరాజ్, రేణుకుంట్ల ప్రీతం రంగు శీను, ఎంఎ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాఉద్యమాల సిపిఐని నగర ఎన్నికల్లో ఆదరించాలి

### సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్




**ప్రజాపక్షం/కరీంనగర్ :** కరీంనగర్ నగర కార్పొరేషన్ ఎన్నికల్లో సిపిఐ 9 స్థానాల్లో పోటీ చేయనుందని, ఈ ఎన్నికల్లో ప్రజా ఉద్యమాల సిపిఐ అభ్యర్థులను ప్రజలు ఆదరించి గెలిపించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ పేర్కొన్నారు. కరీంనగర్ నగర కార్పొరేషన్ సిపిఐ ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం న్యాలపట్ల రాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ కరీంనగర్ నగరంలో అనేక డివిజన్లలో పార్టీ నిరంతరం స్థానిక సమస్యలపై ఉద్యమాలు నిర్వహించిందని, నగరంలో పేద ప్రజలకు డబుల్ బెడ్రూం ఇండ్లు, అర్హులైన పేదలకు రేషన్ కార్డులు పింఛన్లు ఇవ్వాలని పోరాటాలు చేసింది సిపిఐ అన్నారు, గత పాలకవర్గంలో అనేక అవినీతి అక్రమాలు జరిగాయని, బిజెపి, బిఆర్‌ఎస్ రెండు కార్పొరేషన్ ఎన్నికల్లో దొంగే దొంగ అన్నట్లుగా మాట్లాడుతున్నాయని, స్మార్ట్ సిటీ పేరిట నిధులు వృధా చేశారని, డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరించలేదని ఆరోపించారు. ప్రశ్నించే గొంతుగా ప్రజల పక్షాన నిలబడానికి సిపిఐ కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేస్తుందన్నారు. రానున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో గణేష్ నగర్ 57, హనుమాన్ నగర్ 40, కట్టారంపూర్ 11, మారుతీనగర్ 36, బోయవాడ 46, రాంనగర్ 47, కోతి రాంపూర్ 9, కాపువాడ 58,16 డివిజన్లలో పోటీచేస్తామని షెడ్యూల్ విడుదల అయ్యాక అభ్యర్థుల పేర్లు ప్రకటిస్తామన్నారు. ప్రజా ఉద్యమాల రథసారధి సిపిఐ అభ్యర్థులను ప్రజలు ఆదరించి గెలిపించాలని పంజాల శ్రీనివాస్ కోరారు. సమావేశంలో సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, నగర సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజు, నగర కార్యవర్గ సభ్యులు బీర్ల పద్మ, కొట్టే అంజలి, భారతి, బాకమ్ అంజయ్య, కసిబోజుల సంతోష్ చారి,గామినేని సత్తయ్య, కూన రవికుమార్, అరవింద్, నాగునూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సేంద్రియ వ్యవసాయ ఉద్యమానికి కమ్యూనిస్టుల మద్దతు

### సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కె.నారాయణ



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** సేంద్రియ వ్యవసాయంతోనే ప్రజలు ఆరోగ్యవంతులుగా ఉంటారని... అందు కోసం జరిగే ఉద్యమానికి కమ్యూనిస్టుల మద్దతు ఉంటుందని సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కె.నారాయణ పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండల కేంద్రంలో సిద్ధార్థ యోగ విద్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయంలో మార్పులు రావాలని కోరారు. గత వ్యవసాయం వైభవం రావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత వ్యవసాయం కార్పోరేట్ కంపెనీలకు, హాస్పిటల్స్‌కు ఉపయోగపడుతుందన్నారు. సమాజాన్ని పట్టిపీడిస్తున్న ఎరువులను నిరోధించాలని సూచించారు. చిన్నజీయర్ లౌకిక ఆలోచనలు వున్న వ్యక్తి అన్నారు. తాను ఈ కార్యక్రమానికి వచ్చినందుకు విమర్శలు చేయవచ్చునని... కానీ వాటిని నేను లెక్క చేయనన్నారు. తాను చివర వరకు కమ్యూనిస్టుగానే ఉంటానన్నారు. సేంద్రియ వ్యవసాయం బలోపేతానికి సుఫలా యాత్రకు తాము సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు నారాయణ తెలిపారు. సమావేశంలో ఆర్‌టిఐ కమిషనర్ పివి.శ్రీనివాస్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, నల్లమల్ల వెంకటేశ్వరరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కర్నాటి భానుప్రసాద్, మండల కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు, సహాయకార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్, కనకబండి సీతారాములు, బాలిన కృష్ణంరాజు, పోలంపల్లి నారాయణ, ఆలేటి ఉమామహేష్, ఎస్‌కె.సత్తార్, మూదు శీను తదితరులు పాల్గొన్నారు.

# సమన్వయంతో సమస్య పరిష్కారానికి చర్యలు

## దుర్గం చెరువు దుర్గందంపై హైడ్రా దృష్టి

### క్షేత్రస్థాయిలో పరిశీలించిన కమిషనర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మాదాపూర్ గుట్టల ప్రాంతంలోని దుర్గం చెరువులో వ్యాపిస్తున్న దుర్గంధంపై హైడ్రా తీవ్రంగా స్పందించింది. చెరువులోకి నేరుగా మురుగు నీరు చేరుతుండటాన్ని గమనించిన హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెరువులో సగభాగం వరకు గుర్రపు డెక్క వ్యాపించడానికి గల కారణాలను పరిశీలించిన కమిషనర్, ఎస్‌టిపిలు ఉన్నప్పటికీ వరద కాలువ ద్వారా మురుగు నీరు నేరుగా చెరువులోకి చేరడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్‌టిపిల సామర్థ్యానికి మించిన మురుగు నీరు వస్తే మురుగు కాలువకు మళ్లించాల్సిందే కానీ చెరువులోకి ఎలా వదులుతారని ప్రశ్నించారు. చెరువు అభివృద్ధి పేరిట పైపై పనులు సరిపోవని, మురుగు నీటి నియంత్రణపై స్పష్టమైన చర్యలు తీసుకోవాలని రహేజా సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. జిహెచ్‌ఎంసి, జలమండలి, ఇరిగేషన్ శాఖ, రహేజా మైండ్ స్పేస్, రాంకీ సంస్థల మధ్య సమన్వయం లేకపోవడమే సమస్యకు కారణమన్నారు. ఎస్‌టిపిల వద్ద శుద్ధి చేసిన నీటి నమూనాలను సేకరించి పిసిబికి పంపాలని అధికారులకు సూచించారు. దుర్గం చెరువు పరిశీలన అనంతరం హైడ్రా కార్యాలయంలో అన్ని సంబంధిత శాఖల అధికారులతో కమిషనర్ సమావేశమయ్యారు. మురుగు నీరు చెరువులోకి చేరకుండా పైపులైన్ డైవర్షన్ పనులకు





అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్‌తో మాట్లాడి ట్రాఫిక్ డైవర్షన్‌కు సహకరించాలని కోరారు. ఇరిగేషన్, విద్యుత్, జిహెచ్‌ఎంసి, జలమండలి అధికారులతో సమన్వయం చేసుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.

### ఖాజాగూడ చెరువు కబ్జాలపై హైడ్రా నజర్

ఖాజాగూడ చెరువు కబ్జాలపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెరువు తూములు, అలుగులు మూసివేసి డైవర్ట్ చేసినట్టు గుర్తించారు. చెరువు కింద భాగంలో ఉన్న చిన్న చెరువు రూపురేఖలు మార్చినట్లు, చెరువు ఆనవాళ్లు లేకుండా చేసినట్లు గుర్తించారు. ఎఫ్‌టిఎల్ పరిధిలో కొందరు అక్రమంగా షెడ్లు నిర్మించినట్టు తేలింది. తమది భూమి అని చెప్పుకుంటున్న వారి వద్ద ఉన్న పత్రాలను పరిశీలించాలని హైడ్రా నిర్ణయించింది.

## బాచుపల్లిలో రూ.300 కోట్ల విలువైన..

## ప్రభుత్వ భూమి కాపాడిన హైడ్రా

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా బాచుపల్లి మండలంలో 2.30 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా కబ్జాల నుంచి కాపాడింది. అలాగే ఎంఆర్‌ఓ కార్యాలయానికి కేటాయించిన 30గుంటల ప్రభుత్వభూమిని కూడా స్వాధీనం చేసుకుంది. సర్వే నంబర్లు 142, 143, 144లో ఉన్న ఈ భూమిని 2016లో పార్కు కోసం కేటాయించారు. 2023లో కొంతమంది ప్రైవేటు వ్యక్తులు మొక్కలను ధ్వంసం చేసి అక్రమంగా ప్రహరీ నిర్మించగా, ప్రజావాణి ఫిర్యాదుల మేరకు హైడ్రా చర్యలు చేపట్టింది. హైడ్రా కమిషనర్ ఆదేశాలమేరకు ఆక్రమణలు తొలగించి ఫెన్సింగ్ ఏర్పాటు చేసి హైడ్రా బోర్డులు పెట్టింది. పార్కుస్థలాన్ని కాపాడినందుకు బాచుపల్లి వాసులు హైడ్రాకు కృతజ్ఞతలు తెలిపారు.




# పేదలకు మెరుగైన వైద్యసేవలు

### ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** కార్పొరేట్ స్థాయిలో పేదలకు మెరుగైన వైద్యసేవలు అంధించాలన్న సంకల్పంతోనే బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల చైర్మెన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. మంగళవారం పట్టణంలోని 20వ వార్డులో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానను ఎమ్మెల్యే రంగారెడ్డి జిల్లా డిఎంహెచ్‌ఓ డాక్టర్ లలితాదేవి, డిప్యూటీ డిఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి , హెల్త్ఎడ్యుకేటర్ డాక్టర్ శ్రీనివాసులు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ బస్తీ దవాఖానాల్లో ఉదయం 9గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు వైద్యులు అందుబాటులో ఉంటారని, అన్ని రకాల వైద్యసేవలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ బాబర్ ఖాన్, మాజీ చైర్మెన్ విశ్వం, నేతలు చెంది తిరుపతిరెడ్డి, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, రఘునాయక్, బస్వం, ముబారక్ అలీ, ఖదీర్‌లు పాల్గొన్నారు.

### మున్సిపల్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలి

వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కర్యకర్తలు సమిష్టిగా పని చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. పట్టణంలోని వికన్వేషన్



హాల్‌లో మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తోపాటు మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, మాజీ జడ్పిటిసి శ్యాంసుందర్‌రెడ్డి హాజరై మున్సిపల్ ఎన్నికల్లో వ్యవహరించాల్సిన విధి విధానాలపై దిశనిర్దేశం చేశారు. సమావేశంలో నేతలు బాబర్‌ఖాన్, చెన్నయ్య, చెంది తిరుపతిరెడ్డి, రఘునాయక్, బాల్ రాజ్ గౌడ్‌లు పాల్గొన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని దేవునిపల్లి గ్రామంలోని శ్రీ వేణుగోపాలస్వామి కళ్యాణోత్సవంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, మాజీ జడ్పిటిసి మామిడి శ్యాంసుందర్‌రెడ్డిలు హాజరై పూజలు నిర్వహించారు.

## వీధి కుక్కల కేర్ సెంటర్ల కోసం..

## అనువైన భూమి గుర్తించాలి

### జిహెచ్‌ఎంసి అదనపు కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎల్.బి. నగర్ జోన్ పరిధిలోని ఫతుల్లాగూడ జంతు సంరక్షణ కేంద్రాన్ని జిహెచ్‌ఎంసి అదనపు కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో అమలవుతున్న జంతు సంరక్షణ కార్యక్రమాలపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. డిప్యూటీ డైరెక్టర్ (వెటర్నరీ) డాక్టర్ టి.శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ సి.హెచ్.రవిచంద్రలు వీధి కుక్కల జనన నియంత్రణ, యాంటీ రేబీస్ టీకాలు, ప్రత్యేక కుక్కల పట్టివేత డ్రైవ్, షెల్టర్ నిర్వహణ అంశాలను అదనపు కమిషనర్‌కు వివరించారు. వీధి కుక్కల కేర్ సెంటర్ల నిర్మాణానికి అనువైన భూమిని గుర్తించాలని సంబంధిత అధికారులను అదనపు కమిషనర్ ఆదేశించారు.

## హస్తినాపురం డివిజన్‌లో

## ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు

### జిహెచ్‌ఎంసి ఎల్‌బి.నగర్ జోనల్ కమిషనర్ హేమంత్

**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** ఎల్‌బి నగర్ నియోజకవర్గంలో నూతనంగా ఏర్పాటు అయిన డివిజన్ వార్డు కార్యాలయం కొరకు ఎల్‌బి నగర్ సర్కిల్ కార్యాలయం కోసం నూతన భవనం మంజూరు చేస్తామని జిహెచ్‌ఎంసి ఎల్‌బి నగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ తెలిపారు. మంగళవారం హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్‌తో కలిసి ప్రభుత్వ స్థలంను పరిశీలించి, నూతన వార్డు భవనాల ఏర్పాటుకు సంబంధించిన స్థలాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవకమ్మతోట కాలనీ సమీపంలో ఉన్న ప్రభుత్వ స్థలంను గుర్తించి ఆ ఖాళీ స్థలంలో ప్రభుత్వ కార్యాలయం ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. త్వరలోనే టెండర్ పక్రియ పూర్తి చేసి నిధులు కేటాయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌బినగర్ డిసి మల్లికార్జున్ రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరింగ్ కార్తీక్, కాంగ్రెస్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, యాదయ్య, నరసింహ, సతీష్ గౌడ్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.



# పెండింగ్ కేసులు పరిష్కరించేందుకు కృషి

### షాద్‌నగర్ జోన్ డిసిపి సిహెచ్ శిరీష

**ప్రజాపక్షం/కొందుర్గు:** పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేయాలని షాద్‌నగర్ జోన్ డిసిపి సిహెచ్ శిరీష అన్నారు. మంగళవారం డిసిపి శిరీషతోపాటు షాద్‌నగర్ ఎసిపి లక్ష్మీ నారాయణ, రూరల్ సిఐ శ్రీనివాస్‌లు కొందుర్గు పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో ఉన్న రికార్డులను పరిశీలించడంతోపాటు శాంతి భద్రతల పరిరక్షణపై తగిన సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా డిసిపి శిరీష మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలపై గ్రామాల వారీగా అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే తీసుకునే చర్యలపై ప్రజలకు, వాహనదారులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలల్లో రోడ్డు భద్రత, ట్రాఫిక్



నిబంధనలపై అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు పనుల కోసం వచ్చే ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. ఎస్‌ఐ రవీందర్ నాయక్‌తోపాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సహాయ ఉపకరణాలకు దరఖాస్తు

### రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జ్ సంక్షేమ అధికారి శ్రీలత



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** వికలాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారతశాఖ రాష్ట్రంలో వికలాంగుల (పిడబ్ల్యుడిఎస్) సాధికారత కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలలో భాగంగా, సంబంధించిన ఎయిడ్స్ అండ్ అప్లైన్సెస్(ఉపకరణాలు) సరఫరా పథకం కింద దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జ్ సంక్షేమ అధికారి ఎల్.శ్రీలత తెలిపారు. ఈ పథకం ద్వారా క్రింది బ్యాటరీ వీల్ చైర్స్, మొబైల్ బిజినెస్ బ్యాటరీ ట్రైసైకిల్స్ (ఎంపవర్ కార్ట్), హైబ్రిడ్ వీల్చైర్ అటాచ్మెంట్తో కూడిన వీల్చైర్స్‌తోపాటు డిగ్రీ విద్యార్థులకు ల్యాప్టాప్, ఉన్నత విద్య, సాంకేతిక విద్య విద్యార్థులకు ల్యాప్టాప్స్, ట్యాబ్స్‌లను గతంలో దరఖాస్తులు అందకపోవడం వల్ల కొన్ని జిల్లాల్లో లక్ష్యాలు చేరుకోలేకపోయినందున, ఇప్పుడు ఆన్లైన్ బెనెఫిషరీ మానేజ్మెంట్ అండ్ మానిటరింగ్ సిస్టమ్ పోర్టల్‌ను తిరిగి తెరిచిదరఖాస్తులు స్వీకరించనున్నట్లు వివరించారు. అర్హులు ఒబిఎంఎంఎస్ పోర్టల్ ద్వారా జనవరి 21 నుండి 30 లోపు దరఖాస్తు చేసుకోవాలని శ్రీలత తెలిపారు.

# బహుళ ప్రమాదాలు, విపత్తులపై అవగాహన

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** బహుళ ప్రమాదాల విపత్తులపై మాక్ ఎక్సర్ సైజ్ నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని ఎన్‌డిఎంఎ అధికారులు సూచించారు. బహుళ ప్రమాదాల విపత్తు నిర్వహణ సంబంధిత మాక్ డ్రిల్ ఈనెల 21న జిల్లాలో ప్రయోగాత్మకంగా నిర్వహించనున్న నేపథ్యంలో మాక్ ఎక్సర్ సైజ్‌కు సంబంధించిన ముందస్తు ఏర్పాట్లపై మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. బహుళ విపత్తుల దృశ్యం ఆధారంగా మాక్ డ్రిల్ సంభవించిన వెంటనే చేపట్టాల్సిన తక్షణ చర్యలు, సమన్వయం, సమాచార వ్యవస్థ, అత్యవసర సేవల నిర్వహణ వంటి అంశాలపై అధికారులకు మార్గనిర్దేశం చేశారు. మాక్ డ్రిల్ నిర్వహణకు నిర్ణీత ప్రణాళిక, ఆయా శాఖల బాధ్యతలు, విమానయానేతర రంగంలో విపత్తు నిర్వహణకు సంబంధించిన మాక్ డ్రిల్ ఈనెల 21న శంషాబాద్‌లోని ఎయిర్‌పోర్టు ఆవరణలో నిర్వహించనున్నట్లు తెలిపారు. బహుళ ప్రమాదాల విపత్తులు, వరదలు, ఊహించని రీతిలో ప్రమాదాలు జరిగిన సమయంలో ఎలా స్పందించాలి,ఆస్తి, ప్రాణనష్టం నివారించేందుకు ఏవిధమైన చర్యలు తీసుకోవాలి, వివిధ శాఖల మధ్య సమన్వయం ఎలా ఉండాలి అనే అంశాలపై ఈ మాక్ ఎక్సర్ సైజ్ ద్వారా ప్రయోగాత్మకంగా అవగాహన కలుగుతుందని, విపత్తులను ఎదుర్కొనే



విషయంలో సన్నద్ధత ఏ మేరకు కలిగి ఉన్నామనేది అవగతం అవుతుందని అన్నారు. ఇది కేవలం మాక్ ఎక్సర్ సైజ్ మాత్రమే అని, దీని ద్వారా ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావద్దని, విపత్తులు సంభవించినప్పుడు ప్రజలు భయపడకుండా, ప్రజలకు అవగాహన కల్పించాలని ఉద్దేశంతో చేపట్టడం జరుగుతుందని తెలిపారు.

# ఉపాధి ఉసురు తీసేందుకు ‘విబి–జి రామ్ జి చట్టం’

### రంగారెడ్డి డిసిసి అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టాన్ని తూట్లు పొడుస్తూ మోదీ సర్కార్ నూతనంగా తీసుకువచ్చిన విబిజి రామ్ జి చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, తెలంగాణ అర్బన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకత్వం దేశవ్యాప్త ఆందోళనకు పిలుపునిచ్చిన క్రమంలో పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ పిలుపుమేరకు రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం పరిధిలోని ఆలూరు నుంచి చేపట్టిన నిరసన కార్యక్రమానికి చల్లా నరసింహారెడ్డి నాయకత్వం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి సర్కార్ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి



దాని స్థానంలో కొత్త చట్టం తీసుకురావటం దుర్మార్గం అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో రైతు కూలీలకు ఉపాధి కల్పించేందుకు చేపట్టిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బిజెపి ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చిందన్నారు. కేంద్రం తీసుకువచ్చిన నూతన చట్టం రాష్ట్ర ప్రభుత్వాలపై అదనపు భారం మోపనుందని, అంతేకాకుండా 60 రోజుల పాటు ఉపాధి పనులపై నిషేధం రాష్ట్రాలపై భారం వేయడంతో ఉపాధి పని రోజులు తగ్గిపోతాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీల ఆగ్రహానికి గురికాకముందే నూతన చట్టాన్ని రద్దు చేయాలని చల్లా నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. అనంతరం ప్రధాని మోదీ దిష్టి బొమ్మను దహనం చేసి నిరసనలు తెలిపారు. కార్యక్రమంలో చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జ్ భీమ్‌భరత్, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్, టిపిసిసి ఉపాధ్యక్షులు వేణుగౌడ్, పంచాయతీరాజ్ సంఘటన్ రాష్ట్ర కన్వీనర్ రాచమల్ల సిద్దేశ్వర్, పిసిసి మెంబర్ సత్యనారాయణ రెడ్డి, జడ్‌పి మాజీచైర్మన్ తీగల అనితారెడ్డి, చేవెళ్ల మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు పెంటయ్యగౌడ్, సురేందర్‌రెడ్డి, రాష్ట్ర స్పోక్స్ పర్సన్ గౌరీ సతీష్‌కుమార్, నాయకులు అనంతరాములు, వసంతం, పెంటారెడ్డి, రాములు, శ్రీకాంత్‌రెడ్డి, ముక్రం అలీ, సమీర్‌అలీ, ప్రతాపరెడ్డి, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

## ప్రగతి ఎన్‌క్లేవ్ పార్కు అభివృద్ధికి కృషి



**ప్రజాపక్షం/మియాపూర్:** మియాపూర్ డివిజన్ పరిధిలోని ప్రగతి ఎన్ క్లేవ్ కాలనీలో ఉన్న పార్కులో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ స్థానిక నాయకులు, కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పార్కులో మౌలిక వసతులు, ప్రస్తుత పరిస్థితిని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కాలనీలోని పార్కును స్థానికులు, వృద్ధులు, పిల్లలు వినియోగించుకునేలా మరింత సౌకర్యవంతంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఈ పరిశీలన నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ వాసులు సమ్మెట ప్రసాద్, కేఎల్ఎన్ స్వామి, హనుమయ్య చౌదరి, రాజేంద్ర ప్రసాద్, నరసింహ రెడ్డి, వీరఆంజనేయులు, నరసింహ రావు నాయుడు, ప్రతాప్ రెడ్డి, నరేష్ నాయక్, శివ ముదిరాజ్, స్థానిక నాయకులు,జిహెచ్ఎంసి అధికారులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తత



**ప్రజాపక్షం/యాచారం :** సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సిఐ సత్యనారాయణ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని నానక్‌నగర్ గ్రామంలో ఆర్థిక అక్ష్యరాస్యత కేంద్రం అధ్వర్యంలో సైబర్ నేరాలు, భ్యాంక్ సదుపాయాల గురించి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి సిఐ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అన్‌లైన్ మోసాల గురించి ఎదైనా సమాచారం కోసం 1930,100 నంబర్‌కు కాలు చేసి తెలుసుకోవచ్చునని అన్నారు. యువత మత్తు పధార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వంశి. సర్పంచ్ చైతన్య, సంగ్గెం రాజు, వై.వెంకటేశ్, బర్ల మల్లేశ్ యాదవ్, ఎస్‌కె రఫియా, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు నియమాలు పాటించాలి



**ప్రజాపక్షం/యాచారం :** ప్రతిఒక్కరు రోడ్డు భద్రత నియమాలను పాటించాలని సిఐ నందీశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మాల్ వ్యాపార కేంద్రంలోని పశువుల సంతలో రైతులతో సమావేశం నిర్వహించారు. అనంతరం యాచారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఓ రాధరాణి, తహశీల్దార్ అయ్యప్ప,ఎంపిఒ శ్రీలత,ఎస్ఐ మధుకుమార్ పాల్గొన్నారు.

## పాడి పశువులకు వైద్యసేవలు




**ప్రజాపక్షం/కేశంపేట:** పాడి పశువులకు నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సంగెం సర్పంచ్ గన్నోజు వేణుగోపాలచారి కోరారు. మంగళవారం మండల పరిధిలోని సంగెం గ్రామంలో రంగారెడ్డి జిల్లా పశుగాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి పశువైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వేణుగోపాలచారి మాట్లాడుతూ పశువులకు వచ్చే రోగాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మహ్మద్ షకీల్‌తోపాటు రైతేలు, గ్రామస్తులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## క్రీడల్లో గెలుపు, ఓటములు సమానం



**ప్రజాపక్షం/కొందుర్గు:** క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా భావిస్తూ ముందుకు సాగితే భవిష్యత్ ఉంటుందని మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రీమియర్ లీగ్6 పోటీల్లో గెలుపొందిన జట్టుకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ గ్రామీణ స్థాయి నుండే రాణించేందుకు క్రీడాకారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పివైస్ చైర్మన్ ఈట గణేష్, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపిపి రాజేష్ పటేల్, సర్పంచ్ ప్రభాకర్, నాయకులు మాణెయ్య, రామకృష్ణ, సర్పంచ్‌లు రాములు, శేఖర్, నేతలు చందు, యాదగిరి, వెంకటయ్య, రాజ నరసింహారెడ్డి, సున్నాల శ్రీను, రమేష్, సంజీవ, వాసురి, పద్మారావు, ప్రశాంత్, చెన్నయ్య, సాయి, సచిన్ పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలు సద్వినియోగం



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** రైతు శ్రేయస్సు కోసం ప్రభుత్వాలు అంధిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి నిశాంత్‌కుమార్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని నాగులపల్లి గ్రామంలో సర్పంచ్ రాధిక అశోక్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి హరిల ఆధ్వర్యంలో రైతులకు ప్రభుత్వాల నుండి లభించే పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిశాంత్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి రైతు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డుతోపాటు ఆధార్‌కు లింక్ ఉన్న మొబైల్ నంబర్‌తో సమీపంలో ఉన్న మీసేవా కేంద్రానికి వెళ్ళి నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నదే లక్ష్యంగా అధికారులు పని చేస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో తేజ్‌కుమార్‌తోపాటు అన్నదాతలు పాల్గొన్నారు.



## ప్రతి ఒక్కరూ అనాథలకు అండగా నిలవాలి

### హాస్టల్స్ అధ్యక్షులు పాశం అమర్నాథ్ రెడ్డి

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్:** ప్రతి ఒక్కరూ అనాథలకు అండగా నిలవాలని పోచారం ఐటి కారిడార్ హాస్టల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, నెక్స్ట్‌జెన్ ఆఫ్ హాస్టల్స్ వ్యవస్థాపకుడు పాశం అమర్నాథ్ రెడ్డి అన్నారు. పోచారం జిహెచ్ ఎంసి డివిజన్ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్ అగాపే అనాథ ఆశ్రమంలో ఐటి కారిడార్ హాస్టల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అసోసియేషన్ అధ్యక్షుడు పాశం అమర్నాథ్ రెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం అనాథ విద్యార్థుల తో కలిసి ఘనంగా జరుపుకున్నారు. ఈ మేరకు ఆశ్రమానికి విద్యా సామాగ్రి ఆటవస్తువులు అందించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు ఆడం బరాలకు పోకుండా పేదలకు, అనాథలకు అండగా నిలిచే విధంగా కార్య క్రమాలు చేపట్టాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## నిర్ణీత వేళల్లో ఫాగింగ్ : వినయ్ కృష్ణారెడ్డి



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** దోమల నివారణలో భాగంగా నిర్ణీత వేళలను నిర్ణయించుకొని ఆయా ప్రాంతాల్లో క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయాలని జిహెచ్ఎంసి మల్కాజిగిరి అదనపు కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో ఫాగింగ్ సమయాలను స్థానికులకు ముందుగానే తెలియపరచాలన్నారు. చిత్తశుద్ధితో బాధ్యతాయుతంగా తమ విధులను నిర్వహించాలన్నారు. మంగళవారం ఆయన జిహెచ్ఎంసి కాప్రా, నాచారం, డిప్యూటీ కమిషనర్లు శ్రీహరి, నిత్యానంద్ శానిటేషన్, ఎంటమాలజీ విభాగ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శానిటేషన్ విభాగానికి సంబంధించి ఇంటింటి చెత్త సేకరణ స్వచ్ఛ ఆటోల పర్యవేక్షణ, గ్రీన్ లిఫ్టింగ్ తదితర విషయాలపై ఆరా తీశారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ బాలకృష్ణ, రఘు, ఎఇ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ వెన్నెల, శానిటరీ సూపర్‌వైజర్ సుదర్శన్, ఎంట మాలజీ విభాగ ఎఇ రమేష్, తదితర సిబ్బంది ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## వృద్ధుల సంక్షేమం కోసం 'డే కేర్ సెంటర్'

**ప్రజాపక్షం/కాప్రా :** రాష్ట్ర ప్రభుత్వం వృద్ధుల సంక్షేమం కోసం ప్రణామ్ ప్రాజెక్ట్ పేరిట చేపట్టిన పథకంలో భాగంగా ఏర్పాటు చేస్తున్న డే కేర్ సెంట ర్‌ను ఉప్పల్ నియోజకవర్గంలోని మల్లాపూర్‌లోని ఎన్ఎఫ్‌సి కాలనీ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ పేరిట మంజూరైంది. ఈ మేరకు జి హెచ్ఎంసి కమిషనర్ ఉత్తర్వు లు జారీ చేశారు. ఈ సెంటర్ లో వృద్ధుల డే సెంటర్‌కు అవ సరమైన ఏర్పాట్లు, సరంజామా కొనుగోలు చేసేందుకుగాను రూ.50వేలు మంజూరు చేసింది.




దీంతోపాటు ఈ సెంటర్‌లో రూ.6 వేలు నెలసరి వేతనం ఒకరిని కేర్ టేకర్ గా నియమించుకోవచ్చని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ ఏర్పాట్లన్నిటిని జిహెచ్ ఎంసి నాచారం డిప్యూటీ కమిషనర్ ద్వారా జరుగుతాయని స్పష్టం చేశారు.

**వృద్ధులకు ఆసరాగా....**

వృద్ధులు సామాజికంగా ఆరోగ్యంగా ఉండేందుకు ఏర్పాటు చేస్తున్న ఈ డే కేర్ సెంటర్లు వారి జీవన నాణ్యతను మెరుగుపరచే లక్ష్యంగా కొనసాగనున్నాయి. జిల్లా ఆస్పత్రులతో డే కేర్ సెంటర్లను లింక్‌చేసి ఇక్కడికి వచ్చే వృద్ధులకు ఆరోగ్య పరీక్షలు చేస్తూ ఇక్కడికి వచ్చే వైద్యులు, సిబ్బంది ద్వారా వైద్య సేవలు, ఫిజియో థెరపీ సేవలను అందుబాటులో ఉంచుతారు. వీటితో పాటు వృద్ధుల ఉల్లాసానికిగాను టివి, ఇంటర్నెట్, గ్రంథాలయం, క్యారమ్స్, చెస్ లాంటి ఇండోర్ గేమ్‌లు సైతం ఏర్పాటు కానున్నాయి.

## సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మార్పుకు జోనల్ కమిషనర్‌కు కృతజ్ఞతలు

**ప్రజాపక్షం/దుండిగల్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ప్రస్తుతం సూరారం చౌరస్తాలో ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని జిహెచ్ఎంసి సర్కిల్ బహా దూర్ పల్లి డివిజన్ ప్రాంతానికి బదిలీ చేయవలసిందిగా ఇంచార్జ్ హను మంత్ రెడ్డి ఆదేశాల మేరకు మైసంపల్లి హనుమంతరావును కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు బొంగునూరి కిషోర్ రెడ్డి కోరారు. ప్రస్తుతం సూరారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఉన్న ప్రాంతంలో తీవ్రమైన ట్రాఫిక్ సమస్యలు నెల కొని ఉన్నాయి. ప్రతిరోజు కార్యాలయానికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని రోడ్డు వెడల్పు తక్కువగా ఉండడం, వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడం వల్ల ట్రాఫిక్ జామ్‌లు తరచూ జరుగుతున్నాయ న్నారు. జోనల్ కమిషనర్ సందీప్ కుమార్ తో మాట్లాడిన మైసంపల్లి హను మంతరావు వెంటనే అధికారులకు ఆదేశాలు జారీ చేసిన జోనల్ కమిషనర్ కు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎఆర్ సాధు యాదవ్, మాజీ సర్పంచ్ కావలి గణేష్, ఆకుల ప్రేమ్ కుమార్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## యాదవ మహాసభ యువజన అధ్యక్షుడిగా బత్తుల లక్ష్మీనారాయణ

**ప్రజాపక్షం/దుండిగల్:** మేడ్చల్ జిల్లా యాదవ మహాసభ యువజన అధ్య క్షునిగా బత్తుల లక్ష్మీ నారాయణ యాదవ్ నియమితులయ్యారు. రాష్ట్ర యాదవ మహాసభ అధ్యక్షుడు చింతల రవీంద్రనాథ్ యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెర శేఖర్ యాదవ్, రాష్ట్ర యువజన యాదవ మహాసభ అధ్యక్షుడు గొర్ల యశ్వంత్ రాజ్ యాదవ్‌ల చేతుల మీదుగా లక్ష్మీనారాయణ నియా మకపు పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లా డుతూ రాష్ట్ర నాయకత్వం తనపై ఉంచిన నమ్మకంతో జిల్లా స్థాయి పదవిని కట్టబెట్టినందుకు రాష్ట్ర నాయకత్వానికి, యాదవ సోదరి సోదరులకు కృతజ్ఞత లు తెలిపారు. మేడ్చల్ జిల్లాలోని యాదవులను ఏకంచేసి సమస్యల పరిష్కా రానికి పాటుపడతానని పేర్కొన్నారు. ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వ ర్తిస్తూ గ్రామస్థాయి నుండి జిల్లాస్థాయి వరకు యాదవ యువజన ఏకం చేస్తానని అన్నారు. యాదవుల ఆదరణతో అందరికీ అండగా నిలుస్తానని చెప్పారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా యాదవ మహాసభ అధ్యక్షుడు దూదిమెట్ల సోమేశ్ కుమార్, రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి సలంద్రి మహేందర్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు బొంతు శ్రీదేవి పాల్గొన్నారు.

# భూ సమస్యలకు 'కమిషన్'తో పరిష్కారం

**ప్రభుత్వం తక్షణమే ఏర్పాటు చేయాలి**

**రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు**



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారానికి కమిషన్ ఏర్పాటు చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెచ్చిన ధరణి సాఫ్ట్‌వేర్‌లోని లొసుగులను, తప్పిదాలను తొలగించి, భూ భారతికి కొత్త సాఫ్ట్‌వేర్ రూపొం దించాలని కోరారు. సాదాబైనామా భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో అఫిడవిట్ నిబంధనను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. మంగళవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలం గాణ జర్నలిస్టు యూనియన్, తెలంగాణ సోషల్ మీడియా ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో ''ధరణి సమస్యలు, భూ భారతి పరిష్కరించిందా?' అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథులుగా మల్కాజి గిరి ఎంపి ఈటల రాజేందర్, తెలంగాణ జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరామ్, మాజీ ఎంపి సీతారాంనాయక్, సిపిఎం నేత నంద్యాల నర్సింహారెడ్డి, సిపిఐ ఎంఎల్ న్యూడె మోక్రసీ నేత గోవర్ధన్ హాజరయ్యారు. ఈ సంద ర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ భూ భారతి చట్టంలో మార్పులు అవసరం లేదని, సమగ్ర అధ్యయనం జరిగిందన్నారు. కానీ, భూ భారతి సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేయాలన్నారు. గ్రామస్థా యిలో రెవెన్యూ సదస్సులు ఏర్పాటుచేసి, భూ సమస్యలను వెంటనే పరిష్కరించాల్సిన అవస రం ఉన్నదన్నారు. మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో భూ రికా ర్డులు గొప్పగా ఉంటాయో అక్కడి ప్రాంతంలో జిడిపి 2శాతం వృద్ధి చెందుతుందని సంబరపడ్డ, కానీ అలా జరగలేదన్నారు. భూచట్టం ఎవరి చేతుల్లో ఉన్నది, ఎవరికోసం అమలు చేయబడ్డ దన్న విషయం ముఖ్యమన్నారు. ప్రజలను ఆదు కోలేని చట్టం లేకపోవడం బాధనిపిస్తుందన్నా రు. కోట్లు పలుకుతున్న దళితుల భూములపై కన్నేసి బలవంతంగా లాక్కుంటున్నారన్నారు. అసైన్డ్ భూములపై లబ్ధిదారులకు హక్కులు ఎందుకు కల్పించకపోతున్నారని ప్రశ్నించారు. సాధారణ ప్రజలు ఇల్లు, స్థలాలు కొనాలన్న భయపడే పరిస్థితి వచ్చిందన్నారు. ఇలాంటి సమస్యలకు ప్రభుత్వం బాధ్యత వహించి తక్షణ పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. సమా వేశంలో తెలంగాణ జర్నలిస్టు యూనియన్ అధ్యక్షులు కప్పరి హరిప్రసాద్, ప్రధాన కార్య దర్శి బింగి స్వామి, తెలంగాణ సోషల్ మీడియా ఫోరం రాష్ట్ర అధ్యక్షులు కరుణాకర్ దేశాయ్, సాధిక్, పలువురు రైతులు, భూ బాధితులు పాల్గొన్నారు.

## ఢిల్లీ గణతంత్ర వేడుకలకు తెలంగాణ ఒగ్గుడోలు కళాకారుల ఎంపిక





**ప్రజాపక్షం/ధారూర్ :** ఢిల్లీ కర్తవ్యపథ్ వేదికగా నిర్వహించే 77వ గణతంత్ర వేడుకలకు తెలంగాణ రాష్ట్రం నుంచి ఒగ్గుడోలు విన్యాసం కళాప్రదర్శన కు అధికారికంగా ఎంపిక లభించింది. తెలంగాణ ఒగ్గుడోలు కళను జాతీయ వేదికపై ప్రతిష్టాత్మకం గా ప్రదర్శించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతు న్నాయి. ఈ నేపథ్యంలో వికారాబాద్ జిల్లా ధారూర్ మండలం ధారూర్, అల్లీపూర్ గ్రామాల కు చెందిన ఒగ్గు కళాకారులు కుర్వ నర్సిములు, కుర్వ శివకుమార్ ఎంపికయ్యారు, రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన 30మంది కోడె ఒగ్గు కళాకారుల బృందం ఢిల్లీ చేరుకుంది. ఈ అవకాశం తెలంగాణ కళాజాతికి ముఖ్యంగా వికా రాబాద్ జిల్లా ఒగ్గు కళాకారుల సమాజానికి అపూర్వ గౌరవంగా నిలిచింది. జనవరి 26న భారత రాష్ట్రపతి, ప్రధానమంత్రి, విదేశీ ప్రముఖుల సమ క్షంలో కోట్లాది మంది వీక్షించే గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో ఒగ్గు డోలు విన్యాస ప్రదర్శన ఇవ్వను న్నారు. ఎంపికైన కళాకారులకు ఒగ్గు బీర్ల కళాకా రుల సంఘం, సీనియర్ కళాకారులు, గ్రామ పెద్దలు అభిమానులు అభినందనలు తెలియచేశారు.

## జాతీయస్థాయి విద్య, వైజ్ఞానిక ప్రదర్శనకు నోహితి ఎన్నిక

**ప్రజాపక్షం/నిజాంపేట్:** జాతీయ స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు కుత్బుల్లాపూర్ మండలం, షాపూర్ నగర్‌లోని వైష్ణవి పాఠశాల విద్యార్థిని నోహితి ఎంపికైంది. ఈ మేరకు మంగళవారం జిల్లా విద్యా వైజ్ఞా పిక ప్రద ర్శన ఇన్‌చార్జి డిఎస్ఓ శ్రీనివాస్ షీల్డ్, సర్టిఫికెట్ లను నోహితికి అందజే శారు. మేడ్చల్ జిల్లాలో జరిగిన జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ఇన్‌స్పైర్ ప్రదర్శనలో నోహితి తన ప్రతిభను చాటుకుంది. వైష్ణవి పాఠశాల ఫిజిక్స్ ఉపాధ్యాయుడు పాణిగ్రహి పర్యవేక్షణలో తక్కువ ఖర్చుతో ఓ కాన్ఫరెన్స్ హాల్‌లో నెమ్మదిగా ప్రసంగించిన కేవలం సిగ్నల్స్ సహాయంతో ఎక్కువ సౌండ్ వచ్చే విధంగా ఒక డివైస్‌ని (లో కాస్ట్ మినేచర్ కమ్యూనికేషన్



డివైస్) రూపొందించిం ది. ఈ ప్రాజెక్టు చూపరులను ఎంతగానో ఆకట్టు కుని రాష్ట్ర స్థాయికి ఎన్నికైంది. జనవరి ఏడవ తేదీన రాష్ట్ర స్థాయి పోటీ లలో తన ప్రతిభను చాటుకున్న వైష్ణవి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ విద్యార్థిని నోహితి జాతీయ స్థాయికి ఎంపికైంది. మేడ్చల్ జిల్లా నుండి నాలుగు ప్రాజెక్టులు జాతీయ స్థాయికి ఎంపికవగా అందులో కుత్బుల్లాపూర్‌కి చెందిన వైష్ణవి పాఠశాల విద్యార్థినికి చెందింది కావడం సంతోషంగా ఉందని పాఠశాల చైర్మన్ సిహెచ్ నర్సింహులు గౌడ్ అన్నారు. విద్యార్థిని, టీచర్‌లను ఆయన అభినందించారు. కార్యక్రమంలో వైష్ణవి గ్రూప్ అకడమిక్ డైరెక్టర్ సాయిబాబా పాల్గొన్నారు.



## అందుబాటులో సోని కెమెరాలు

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** మారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నాల జీతో పోటీపడుతు ఫోటోగ్రఫీలో రాణించాలని ఆధునిక కెమరాలతో ఫోటోగ్రఫీ చేయాలని సోని కంపెని టీమ్ సభ్యులు ఫరూక్ అహ్మద్, సయ్యద్ అహ్మద్, అస్లాంలు అన్నారు. మంగళవారం అలియాబాద్ మున్సిపాలిటి మజీద్‌పూర్‌లోని శ్రీకృష్ణ కన్వెన్షన్ హాల్‌లో శామీర్‌పేట మండల ఫోటో వీడియో గ్రాఫర్స్ అసోషియేషన్ సభ్యులకు సీనియర్ ఫోటో గ్రాఫర్ అర్విన్ ప్రసాద్ కట్ట ఆధ్వర్యంలో అసోషియేషన్ అధ్యక్షుడు మామిండ్ల సత్యనారాయణ అధ్యక్షతన వర్క్‌షాప్‌ను నిర్వహించారు.

ఈ సందర్భంగా సోని కంపెని కెమరాల టీమ్ సభ్యులు ఫరూక్ అహ్మద్ మాట్లాడుతూ ఆధునికయుగంలో తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉన్న సోని కంపెనీ కెమరాలను కొనుగోలుచేసి ఫోటోగ్రఫీ చేయాలని సూచిం చారు. సోనీ కంపెనీకి సంబంధించిన కెమారాలు అత్యాధునిక హంగు లతో తక్కువ ధరలకు మార్కెట్‌లో లభిస్తున్నాయని చెప్పారు. అనంతరం అధ్యక్షుడు మామిండ్ల సత్యనారాయణ మాట్లాడుతూ మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోని ఫోటో, వీడియో గ్రాఫర్లకు సోని కంపెపీ బృందం సభ్యులు వర్క్‌షాప్ నిర్వహించడం అభినందనీయమని చెప్పారు. దీనికి సహకరించిన సీనియర్ కెమరామెన్ ప్రసాద్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలి పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు లక్ష్మ ణ్, సురేష్, ప్రధాన కార్య దర్శి సాయిబాబగౌడ్, కోశాధికారి రాజు, సభ్యులు సత్యనారాయణగౌడ్, క్యాతం వెంకటేష్, నక్క మహేందర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల హక్కులకు పోరాడుతాం

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** దివ్యాంగుల హక్కుల సాధనకు నిరంతరం పోరాడుతామని మేడ్చల్ జిల్లా దివ్యాంగుల కమిటి(ఎన్‌పిఆర్‌డి ఇండియా) అధ్యక్షుడు మందాల గంగారెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో డిడబ్ల్యూఒ శారద దివ్యాంగుల కమిటీ అధ్యక్షుడు గంగా రెడ్డితో పాటు సభ్యుల ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన దివ్యాంగు ల హక్కుల చట్టంతో పాటు సంక్షేమ పథ కాల అమలులో ఐదు శాతం దివ్యాంగుల కోటా అమలుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అలాగే దివ్యాంగులకు సహాయ పరికరాలైన మోటరైజ్డ్ బండ్లు పంపిణీ కార్యక్రమం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఇంచార్జ్ రాజేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ధనరాజ్, జనరల్ సెక్రటరి చంద్రయ్య, శామీర్‌పేట డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, బొమ్మరాశిపేట అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, నాయకులు నర్సింగరావు, సోమేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యానవన పంటల సాగుపై పూర్తి అవగాహనతో ముందుకు సాగాలి : ప్రతీక్‌జైన్



**ప్రజాపక్షం/వికారాబాద్ :** ఉద్యాన వన పంటల సాగుపై పూర్తిగా అవగా హన పెంచుకొని అధిక దిగబడులతో, ఆర్థిక లాభాలతో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ రైతులకు సూచించారు. వికారాబాద్ మండల పరిధిలోని ఎర్రవల్లి, మదన్‌పల్లి గ్రామాల్లో మంగళవారం ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులతో ఉద్యానవన శాఖ అధికారులు, వివిధ బ్యాంకర్లతో కలిసి జిల్లా కలెక్టర్ ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లా డుతూ ఉద్యానవన పంటలను నాణ్యతతో పండించినట్లయితే అధిక లాభాలను ఆశించవ చ్చన్నారు. ఉద్యానవన పంటలకు ప్రభుత్వం సబ్సిడీని అందిస్తుందని అలాంటి వివరాలను సంబంధిత శాఖల అధికారులను సంప్రదించి సద్వినియోగం చేసుకోవాల ని కలెక్టర్ రైతులకు సూచించారు. ఉద్యానవన పంటలను పండి స్తున్న రైతుల సమస్యలను తెలుసుకోవడానికి అదే విధంగా రైతుల సూచనలు పరిగణనలోకి తీసుకునేందుకు అధికారులతో క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. రైతుల సమ స్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తామని కలె క్టర్ తెలిపారు. రైతులు వివిధ పంటలు వేసిన క్రమంలో అధిక దిగుబడులు రావడానికి వ్యవ సాయ శాస్త్రజ్ఞులచే శిక్షణ ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. చిన్న సన్నకారు రైతులను కూడా గుర్తించి సబ్సిడీలు అందజేసి ఆర్థికంగా బలపడేందుకు కృషి చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు ముందుకు వస్తే నర్సరీల ఏర్పాటుకు సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందని, రైతులు మార్కెటింగ్ చేసుకునేందుకు మౌలిక సదుపాయాలు కల్పిస్తు స్థలానికి కేటాయించ లేని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, మార్కె టింగ్, రైతుబజార్ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పట్టుదార పరిశ్రమల కేంద్రా న్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన వన శాఖ జిల్లా అధికారి సత్తార్, ఆర్టిఒ మెంబర్ జాఫర్, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

**రంజాన్ మాసం ప్రశాంతంగా నిర్వహించుటకు ఏర్పాట్లు**

ప్రశాంత వాతావరణంలో పవిత్ర రంజాన్ మాసం నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదే శించిన ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, కలెక్టర్ కార్యాలయంలో రంజాన్‌మాసం ఉపవాస దీక్షల సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై ముస్లిం మత పెద్దలు, సంబంధిత అధికారులతో సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రంజాన్ మాసం ఉపవాస దీక్షలు ఫిబ్రవరి 18నుండి ప్రారంభమవుతు న్నాందున జిల్లాలో ఉన్న ప్రతీ మశీదు, ఈద్గా లలో త్రాగునీరు, శానిటేషన్ నిరంతర విద్యుత్ సరఫరా, వీధిలైట్లు తదితర ఏర్పాట్లపై చర్చిం చారు. గ్రామాల్లో, పట్టణాల్లో ప్రార్థనా స్థలాల పరిసరాలలో పారిశుద్ధ్య కార్యక్రమాలను నిరం తరం నిర్వహించాలని, త్రాగునీరు సమస్య తలె త్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్యారోగ్యశాఖ అధికారి స్వర్ణ కుమారి, డిఎస్ఒ సుదర్శన్ , తహసీల్దార్, తదితరులు పాల్గొన్నారు.

# అంతర్‌జిల్లా దొంగల ముఠా అరెస్ట్: ఎస్‌పి

**ప్రజాపక్షం/ వికారాబాద్:** అమాయక మహిళలే లక్ష్యంగా బంగారం దొంగిలి స్తున్న అంతర్‌జిల్లా ముఠాను అరెస్టు చేసినట్లు వికారాబాద్ జిల్లా ఎస్‌పి స్నేహ మెహ్రా తెలిపారు. మంగళవారం మీడియా సమావేశంలో ఎస్‌పి మాట్లాడుతూ వికారాబాద్ జిల్లాలో గత కొన్నిరోజులుగా అమాయక మహిళలను లక్ష్యంగా చేసుకొని బంగారం దొంగిలిస్తున్న ముగ్గురు పాత నేరస్తుల ముఠాను జిల్లా సిసి ఎస్ పోలీస్‌లు పట్టుకోవడం జరిగిందన్నారు. జిల్లాలోని ధారూర్, వికారాబాద్ టౌన్ , పరిగి పోలీస్‌స్టేషన్ పరి ధిలో వరుస గా మహిళలను మోసంచేసి బంగారం దొంగి లించిన ఘటనలు నమోదు కావడంతో, కేసును సీరియ స్‌గా తీసుకొని నిందితులను తక్షణమే పట్టుకోవాలని జిల్లా సిసిఎస్ పోలీస్‌అధికారులను



ఆదేశించారు. సిసిఎస్ సిఐ బల్వంత్‌రాయ్ ఆధ్వర్యంలోని బృందం రంగంలోకి దిగింది సిసిటివి ఫుటేజీలు టెక్నికల్ ఆధారాలు,నేరం జరిగిన తీరును విశ్లేషించి ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకున్నామన్నారు. విముల లక్ష్మి భర్త నగేశ్వర్‌రావు బొరబండ, చిల నర్సమ్మ భర్త వెంకటయ్య, కిస్మత్‌పూర్ రాజేంద్ర నాగర్ , బండరి అనిత, భర్త గిరి, ఖల్‌నగర్ , కేవలం వికారాబాద్ జిల్లాలోనే కాకుండా నారాయణపేట్‌లోని మద్దుర్, కోస్గి,నారాయణపేట్‌టౌన్, గతం లో సైబరాబాద్ ,హైదరాబాద్ , నిజామాబాద్ , రాచకొండ, జగిత్యాల తో పాటు సుమారు 28కేసుల్లో నిందితులుగా ఉన్నారని తెలిపారు. రద్దీగా ఉండే మార్కెట్లు లేదా నిర్మానుష్య ప్రదేశాల్లో మహిళలను ఎంచుకుంటారు. ముందు నకిలీ బంగారం బిస్కెట్లు, రాడ్లు, లేదా బంగారు రంగు పూసిన రాళ్లను పడేస్తా రు. తమకు దొరికినట్లు నడిస్తారు. 'మాకు బంగారం దొరికింది, దీనిని మనం పంచుకుందాం' అని బాధితురాలిని నమ్మించి మాటల్లో పెడతారు. ఆ నకిలి బంగారాన్ని బాదితురాలికి ఇచ్చి అమె మెడలో ఉన్న ఆసలైన బంగారం గొలు సును కమ్మలు తీసుకుంటారు. నిర్మానుష్య ప్రాంతాలలో మత్తు మందు ప్రయో గించేవారన్నారు. 2211–2025లో ధారుర్ కూరగాయల మార్కెట్‌లో కంది లక్ష్మ మ్మ, 1.8తులాల బంగారం, వికారాబాద్‌లో బసుపల్లి లక్ష్మి మ్మ 2తులాల గొలుసును దొంగిలించారు. పరిగిలో ఈశ్వర్మ నుండి 5 తులాలగోలుసు, 3గ్రా ముల కమ్మలు తీసుకొని పారిపోయారు. ఈ సందర్భంగా ఎస్‌పి ప్రజలకు పలు సూచనలు చేశారు. అపరిచితులు ఎవరైనా బంగరం దొరికిందని చెప్పిన లేదా మాయమాటలు చెప్పి దగ్గరికి వచ్చిన అనుమానం వస్తే 100కి లేదా దగ్గర్లో ఉన్న పోలీస్ స్టేషన్‌కి సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కేసును చేదించిన సిఐ , సిబ్బందిని ఎస్‌పి అభినందించారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## నిబంధనల ప్రకారం వేతన సవరణ

### డ్రైవర్ల ఆందోళన

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** కనీస సమాచారం లేకుండా యాజమాన్యం తీసు కున్న నిర్ణయాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని శామీర్‌పేటలోని భాగ్యనగర్ గ్యాస్ కంపెనీలో పనిచేస్తున్న డ్రైవర్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం తమ విధులను బహిష్కరించి కంపెనీ ముందు ధర్నా నిరసన కార్యక్రమాలు చేశారు. తమ డిమాండ్లను పరిష్కరించే వరకు విధుల్లోకి చేరబోమని భీష్మించారు. కంపెనీ యాజమాన్యం ఎండి దిగి రావాలని మా డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం డ్రైవర్లు మాట్లాడుతూ టెండర్ నిబంధనల ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఏది ఎక్కువైతే అది వర్తించే విధంగా చట్టాలు చేయాలని నిబంధనల ప్రకారం వేతన సవరణ చేయాలని అన్నారు. మా అనుమతి లేకుండా ఇతర ప్రదేశాలకు బదిలీ చేయకూడదని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో యాజమాన్యం సౌకర్యాన్ని అందించాలని భద్రతను నిర్ధారించాలని చెప్పారు. మా న్యాయపరమై డిమాండ్ల ను తక్షణమే పరిష్కరించాలని అప్పటి వరకు తాము విధుల్లో చేరబోమని తేల్చి చెప్పారు. కంపెనీ యాజమాన్యం నచ్చజెప్పిన డ్రైవర్లు వినకుండా ధర్నాకు దిగారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకుడు రవీందర్‌గౌడ్, మాజి ఎంపిటిసి దప్పు సాయిబాబు, డ్రైవర్లు పాల్గొన్నారు.



## విద్యాసాగర్ మృతికి సంతాపం

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** సీనియర్ ఫోటో జర్నలిస్ట్ విద్యాసాగర్ హఠాన్మర ణంపై కుత్బుల్లాపూర్ టియుడబ్ల్యుజె(ఐజెయు) సంతాపం తెలిపింది. కుత్బుల్లా పూర్ నియోజకవర్గం పరిధిలోని సూరారం, దయానంద్ నగర్‌లోని ఆయన నివాసంలో విద్యాసాగర్ పార్థివ దేహానికి మేడ్చల్ జిల్లా టియుడబ్ల్యుజె(ఐ జెయు) అధ్యక్షుడు గడ్డమీది బాలరాజ్, జిల్లా సభ్యులు గుంటూరు శేఖర్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం టియుడబ్ల్యుజె(ఐజెయు)వర్కింగ్ ప్రెసిడెంట్ సాయిబాబా, సీనియర్ పాత్రికేయులు సిరిగిరి శ్రీనివాస్, రాజ్ యాదవ్, సంతోష్ కుమార్‌లు నివాళులర్పించారు. అనంతరం విద్యాసాగర్ కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బాల్‌రాజ్ మూడు వేలు, జిల్లా సభ్యులు శేఖర్ పదివేలు, బౌరంపేట్ గ్రామ మాజీ కౌన్సిలర్ నర్సా రెడ్డి శ్రీనివాస్ రెడ్డి పదివేల ఆర్థిక సహాయాన్ని మృతుని కుటుంబానికి అందజేశారు.



## వాకర్స్ పార్కులో అభివృద్ధి పనులు ప్రారంభం

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** వినాయకనగర్ డివిజన్‌లోని బండ చెరువు వాకర్స్ పార్కులో రూ.16 లక్షల వ్యయంతో చేపట్టిన ర్యాంప్, మెట్లు, ఆర్చ్ నిర్మాణ పనులను మంగళవారం స్థానిక కార్పొరేటర్ క్యాసం రాజ్యలక్ష్మి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లాల్వానినగర్ కాలనీ అధ్యక్షుడు నరేష్, అసోసియేషన్ సభ్యులు ప్రేమ్‌కుమార్, గోపాల్ యాదవ్, బిజెపి శ్రేణులు ఆనంద్ గౌళికర్, ఓం ప్రకాష్, సంతోష్, జిహెచ్ఎంసి మల్కాజిగిరి సర్కిల్ ఇంజనీరింగ్ విభాగ ఎఇ నవీన్ కుమార్, సూపర్‌వైజర్లు సాగర్, వెంకటేష్, హార్టికల్చర్ సూపర్‌వైజర్ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
బుధవారం
21-01-2026
www.prajapaksham.in

‘ వామపక్ష పార్టీలతోనే భారతదేశ భవిష్యత్తు ముడిపడి ఉందని వామపక్ష పార్టీల అగ్రనేతలు అభిప్రాయపడ్డారు. వామపక్షాల బలోపేతం ద్వారానే పీడిత వర్గాలకు న్యాయం జరుగుతుందని, అసమానతలులేని నవ సమాజ నిర్మాణానికి అవకాశం కలుగుతుందని ఉద్ఘాటించారు. భారతదేశంలో పేట్రేగిపోతున్న ఫాసిస్టు శక్తులకు, అత్యంత ప్రమాదకరంగా మారిన మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా వామపక్షాలు బలమైన ఐక్య పోరాటాలను నిర్వహించాలని పిలుపు నిచ్చారు. ’



ఖమ్మంలో సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకల చిత్రమాలికను వీక్షిస్తున్న సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, తదితరులు



సిపిఐ వందేళ్ల పాటల సిడిని ఆవిష్కరిస్తున్న దృశ్యం




డి.రాజా, ఎం.ఎ.బేబీ, దీపాంకర్ భట్టాచార్య మాటా మంతీ...



ఫోటోలు.. కె.అనిల్ కుమార్







ముంబై మున్సిపల్ కార్పొరేషన్ కార్మికులు సేకరించిన రూ.50లక్షల చెక్కును డి.రాజాకు అందజేస్తున్న మహారాష్ట్ర సిపిఐ రాష్ట్ర నాయకులు



సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీకి స్వాగతం పలుకుతున్న ఖమ్మం జిల్లా సిపిఐ నాయకులు







సిపిఐ జాతీయ కౌన్సిల్ సమావేశం




# రీల్




## రూ.300 కోట్ల క్లబ్‌లో ‘మన శంకర వరప్రసాద్ గారు’..

మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన సంక్రాంతి బ్లాక్‌బస్టర్ ‘మన శంకర వరప్రసాద్ గారు’ బాక్సాఫీస్ వద్ద రికార్డుల సునామీ సృష్టిస్తోంది. ఈ చిత్రం విడుదలైన కేవలం 9 రోజుల్లోనే రూ.300 కోట్ల క్లబ్‌లో చేరింది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రత్యేక ప్రోమోను విడుదల చేసింది. మరోవైపు నార్త్ అమెరికాలో కూడా ఈ సినిమా 3 మిలియన్ డాలర్ల మార్కును దాటి దూసుకుపోతోంది. చిరంజీవి మాస్ ఎనర్జీ, నయనతార నటన మరియు విక్టరీ వెంకటేష్ క్యామియో రోల్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోగా, భీమ్స్ సిసిరోలియో అందించిన సంగీతం సినిమా విజయానికి ప్రధాన బలంగా నిలిచింది. జనవరి 12న విడుదలైన ఈ చిత్రం రెండో వారంలో కూడా అన్‌స్టాపబుల్‌గా బాక్సాఫీస్ వద్ద తన హవా కొనసాగిస్తోంది.

## ‘క్రేజీ కళ్యాణం’ పోస్టర్




నరేష్ వీకే, అనుపమ పరమేశ్వరన్, తరుణ్ భాస్కర్, రాజ్ వెడ్స్ రాంబాయి ఫేమ్ అఖిల్ ఉడ్డెమారి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా ‘క్రేజీ కల్యాణం’. ఈ చిత్రాన్ని యారో సినిమాస్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం.2గా ప్రొడ్యూసర్ బూసమ్ జగన్ మోహన్ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శకుడు బద్రప్ప గాజుల రూపొందిస్తున్నారు. యాక్టర్ వీకే నరేష్ బర్త్ డే సందర్భంగా ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్. ఈ పోస్టర్‌లో పర్వతాలు అనే పాత్రలో ట్రెడిషనల్‌గా వీకే నరేష్ ఆకట్టుకుంటున్నారు. పెళ్లి చుట్టూ సాగే ఆసక్తికరమైన కథతో కంప్లీట్ ఎంటర్ టైన్ మెంట్‌తో సాగే చిత్రమిది. తెలంగాణలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో ‘క్రేజీ కల్యాణం’ సినిమా చిత్రీకరణ జరిపారు. సురేష్ బొబ్బిలి ‘క్రేజీ కల్యాణం’ సినిమాకు సంగీతాన్ని అందిస్తున్నారు.

## ‘శుభకృత్ నామ సంవత్సరం’ గ్లింప్స్



డాక్టర్ నరేష్ విజయ్ కృష్ణ ప్రధాన పాత్రలో రూపొందుతున్న చిత్రం 'శుభకృత్ నామ సంవత్సరం'. ఎస్ఎస్ సజ్జన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఎస్వి పిక్చర్స్, అవిష్క డ్రీ ప్రొడక్షన్ బ్యానర్స్‌పై డిఆర్ విశ్వనాథ్ నాయక్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం గ్లింప్స్ లాంచ్ ఈవెంట్ గ్రాండ్‌గా జరిగింది. గ్లిమ్స్ లాంచ్ ఈవెంట్లో డాక్టర్ నరేష్ విజయ్ కృష్ణ మాట్లాడుతూ మా కుటుంబంలో సగమైన ఫ్యాన్స్‌కి పేరుపేరునా కృతజ్ఞతలు. మా కుటుంబంలో ఏదైనా సరే మాతో వచ్చి నిలబడే ఫ్యాన్స్‌ని కృష్ణ మాకు ఇచ్చి వెళ్లారు. రామోజీరావు జంధ్యాల నాకు ఒక ఫ్యామిలీ. వాళ్ళు వెళ్లిపోయిన తర్వాత చాలా డిప్రెషన్ ఫీల్ అయ్యాను. ఆ తర్వాత శ్రీ విష్ణు, రామ్ అబ్బరాజు మరో ఫ్యామిలీ లాగా వచ్చారు. నాకోసం ఒక క్యారెక్టర్ రాయడం అనేది నాకు ఎంతో బలాన్ని ఇస్తుంది. శ్రీ విష్ణు మై హీరో. మహేష్ తర్వాత అంత మంచి షటిల్‌గా ఉండే టైమింగ్ తనలో చూశాను. క్యారెక్టర్ ఆర్టిస్టుగా అద్భుతంగా ముందుకు వెళ్తున్న కొద్ది లీడ్ రోల్స్ కూడా మొదలయ్యాయి. అయితే నేను ప్రతిదీ క్యారెక్టర్ గానే చూస్తాను. తెలుగు కన్నడ సిస్టర్ లాంగ్వేజ్. ఒకటే లిపి ఉంటుంది. కల్చర్ దగ్గరగా ఉంటుంది. శుభకృత్ నామ సంవత్సరం కథ చాలా నచ్చింది. అద్భుతమైన కంటెంట్ ఉన్న సినిమా అని చెప్పారు.

శ్రీ విష్ణు మాట్లాడుతూ నరేష్ సినిమాలో ఉంటే చాలు అనే ఒక ఇమేజ్ ని క్రియేట్ చేసుకున్నారు. ఏ పాత్ర అయినా సరే అద్భుతంగా చేయగలిగే నటుడు మన తెలుగు పరిశ్రమంలో ఉండడం చాలా గర్విస్తున్నాను. ఆయన ఇంకా మంచి పాత్రలు చేయాలని కోరుకుంటున్నాను. దాని కంటే ఒక గొప్ప కథ వచ్చినప్పుడు చేస్తానని ఎదురు చూశాను. అలాంటి సినిమా మా కాంబినేషన్లో చూడబోతున్నా అన్నారు.

పవిత్ర లోకేష్ మాట్లాడుతూ నరేష్ లాంటి గొప్ప వ్యక్తితో జీవించడం దేవుడి ఆశీస్సులుగా భావిస్తున్నాను. నరేష్ ప్రతి క్యారెక్టర్‌కి ఎంతో ప్రిపేర్ అవుతారు. చిన్న పెద్దా అని ఉండదు. అన్నీ ఒకేలా చూస్తారు. ఆయన చాలా బిజీగా ఉన్నారు. నరేష్ ఒక కింగ్ లాగా బ్రతుకుతారు. ప్రతి క్షణాన్ని ఆస్వాదించాలని ఆయన ఫిలాసఫీ.

డైరెక్టర్ రామ్ అబ్బరాజు మాట్లాడుతూ.. యాభై నాలుగు ఏళ్ల అద్భుతమైన ప్రయాణంలో మేము కూడా భాగమైనందుకు చాలా హ్యాపీగా ఉంది. అలాగే నారి నారి సక్సెస్ కి కంగ్రాట్స్ అని చెప్పారు. డైరెక్టర్ సజ్జన్, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, రాజేష్ దండా, నిర్మాత విశ్వనాథ్ నాయక్ పాల్గొన్నారు.



## ‘కాన్ సిటీ’ ఫస్ట్ లుక్

ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ‘కాన్ సిటీ’ సినిమా టైటిల్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను ప్రముఖ దర్శకుడు లోకేష్ కనగరాజ్ లాంచ్ చేశారు. ఈ చిత్రంలో అర్జున్ దాస్ ప్రధాన పాత్రలో కనిపించగా, మలయాళ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అన్నా బెన్, కామెడీ కింగ్ యోగి బాబు, వెటరన్ నటి వడివుకరసితో పాటు చైల్డ్ ఆర్టిస్ట్ అకిలన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. పవర్ హౌస్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుంది, హరీష్ దురైరాజ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. మధ్యతరగతి కుటుంబం నేపథ్యంలో ఈ సినిమాను తెరకెక్కించారు. అర్జున్ దాస్ ఆఫీస్ బ్యాక్‌ప్యాక్‌తో అన్నా బెన్ హ్యాండ్‌బ్యాగ్‌తో యోగి బాబు, వడివుక్కరసి ట్రావెల్ బ్యాగ్స్‌తో చిన్నారి అకిలన్ విజయాన్ని సూచించే ట్రోఫీని తీసుకెళ్లడం క్యూరియాసిటీ పెంచుతూ టైటిల్, పోస్టర్‌ను రూపొందించారు. ఈ సినిమా మంగళూరు, చెన్నై, ముంబైలలో షూటింగ్ ఎనభై శాతం పూర్తయింది. ఈ చిత్రం తమిళం, తెలుగులో ఒకేసారి విడుదలవుతోంది.

## అల్లరి నరేష్ ఇంట విషాదం



వృద్ధాప్య కారణాలతో ఇవివి సత్యనారాయణ తండ్రి ఈదర వెంకట్రావు కన్నుమూశారు. మంగళవారం తెల్లవారుజాము మూడు గంటల సమయంలో తుది శ్వాస విడిచారు. ఆయన వయసు 90 సంవత్సరాలు. 2019 మే 27న భార్య వెంకటరత్నం మరణించారు. ఆయనకు ముగ్గురు కుమారులు ఒక కుమార్తె. పెద్దకుమారుడు ఈవివి సత్యనారాయణ, రెండో కుమారుడు గిరి, మూడో కుమారుడు శ్రీనివాస్, కుమార్తె ముళ్ళపూడి మంగాయమ్మ, ఆర్యన్ రాజేష్, అల్లరి నరేష్ మనుమలు. నిడదవోలు మండలం కోరుమామిడిలో అంత్యక్రియలు జరిగాయి.

## ‘గొల్ల రామవ్వ’గా తాళ్లూరి రాజేశ్వరి

స్వర్గీయ భారత ప్రధాని పి.వి.నరసింహారావు రాసిన తెలంగాణ సాయుధ పోరాట గాథకు దృశ్యరూపం ఇస్తున్నారు. ప్రఖ్యాత రచయిత ముళ్ళపూడి వెంకట రమణ తనయుడు ముళ్ళపూడి వరా దర్శకత్వం వహించారు. ఈ సినిమా ఈటీవి విన్‌లో ఈ సినిమా ప్రసారం కానుంది. సుపరిచిత దర్శకులు స్వర్గీయ సునీల్ వర్మ తనయుడు రాఘవేంద్రవర్మ (బుజ్జి) నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ప్రఖ్యాత గీత రచయిత ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్, జాతీయ అవార్డు గ్రహీతలు సుద్దాల అశోక్ తేజ, కాసర్ల శ్యామ్, మౌనశ్రీ మల్లిక్ పాటలు రాస్తున్నాను.




## నేనేమీ హీరోని కాదు



గతేడాది కుబేర, ది గర్ల్‌ఫ్రెండ్ సినిమాలతో బాక్సాఫీస్ వద్ద మంచి సక్సెస్‌ను అందుకున్న రష్మిక మందన్నా సినిమాలతోనే కాకుండా పలు ఇంటర్వ్యూల ద్వారా కూడా రెగ్యులర్‌గా ఫ్యాన్స్‌కు టచ్‌లోనే ఉంటుంది. తాజాగా ఓ చిట్ చాట్‌లో పాల్గొన్న రష్మిక పలు ఇంట్రెస్టింగ్ విషయాలను వెల్లడించింది. తన కెరీర్ మొదలైన 2016 నుంచి ఇప్పటివరకు ఒకేలా ఉన్నానని, అన్ని రకాల జానర్లలో సినిమాలు చేస్తూ, అన్ని భాషల్లోనూ నటించాలనేదే తన కోరిక అని రష్మిక చెప్పింది. భాష పరంగా తనకు ఎలాంటి హద్దులు లేవని, తాను నటినని, నటిగా అన్ని రకాల ఆడియన్స్‌ను అలరించడమే తన పని అని, ఒక్కొక్కరికి ఒక్కో జానర్ సినిమా నచ్చుతుందని, అందుకే తాను అన్నీ విధాలైన సినిమాలు చేసి అందరినీ మెప్పించాలనుకుంటున్నట్టు రష్మిక చెప్పుకొచ్చింది. నెగిటివిటీ గురించి మాట్లాడుతూ, కొందరు కావాలనే డబ్బు కోసం రూమర్లను క్రియేట్ చేస్తారని రష్మిక అంటోంది. మొదట్లో రూమర్లు విని చాలా బాధ పడ్డానని, తర్వాత వాటిని ఎలా ఎదుర్కోవాలో నేర్చుకున్నానని, జీవితంలో జరిగిన ప్రతీ విషయం నుంచి ఏదొకటి నేర్చుకుంటూ ముందుకెళ్తున్నట్టు రష్మిక చెప్పింది. హీరోయిన్లు అందరిలో తానే ఎక్కువ రెమ్యూనరేషన్ తీసుకుంటున్నానని వస్తున్న వార్తలపై కూడా ఆమె క్లారిటీ ఇచ్చింది. ఎక్కువ రెమ్యూనరేషన్ తీసుకోవడానికి తానేమీ హీరోని కాదని చెప్పుకొచ్చింది.

## అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ‘మా వందే’

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బయోపిక్‌ను ‘మా వందే’ టైటిల్ తో సిల్వర్ కాస్ట్ క్రియేషన్స్ బ్యానర్ పై నిర్మిస్తున్నారు ప్రొడ్యూసర్ వీర్ రెడ్డి.ఎం. ఈ చిత్రంలో నరేంద్ర మోదీ పాత్రలో మలయాళ స్టార్ హీరో ఉన్ని ముకుందన్ నటిస్తున్నారు. ఎన్నో పోరాటాల కన్నా తల్లి సంకల్పం గొప్పదనే సందేశాన్నిస్తూ ప్రధాని మోదీ జీవితాన్ని యదార్థ ఘటనల ఆధారంగా అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చేలా తెరకెక్కిస్తున్నారు దర్శకుడు క్రాంతికుమార్.సీహెచ్. ప్రధాని మోదీ వ్యక్తిగత, రాజకీయ జీవితంలోని విశేషాలన్నీ ఎంతో సహజంగా మా వందే సినిమాలో చూపించబోతున్నారు. ఈ సినిమా అంతర్జాతీయ ప్రమాణాలతో, అత్యున్నత సాంకేతిక విలువలు, వీఎఫ్ఎక్స్‌తో రూపొందుతోంది. మా వందే చిత్రాన్ని పాన్ ఇండియా భాషలతో పాటు ఇంగ్లీష్ లోనూ రిలీజ్ చేయనున్నారు. ఎన్నో పోరాటాల కన్నా తల్లి సంకల్పం గొప్పదనే సందేశం మా వందే చిత్రంలో ప్రేక్షకుల్ని ఆకట్టుకోనుంది. ‘మా వందే’ సినిమాను సిల్వర్ కాస్ట్ క్రియేషన్స్ సంస్థ 400 కోట్ల రూపాయలకు పైగా హ్యూజ్ బడ్జెట్ తో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. ఈ స్టోరీ డ్రివెన్ మూవీని ప్రపంచంలో తొలిసారిగా తొలిసారి ఆరి అలెక్సా 265 జెంట్రీ, కుకీ లెన్స్ తో తెరకెక్కిస్తుండటం విశేషం. ఇప్పటికే మొదటి షెడ్యూల్ పూర్తి చేసుకున్న మా వందే సినిమా సెకండ్ షెడ్యూల్ ఈ నెల 22వ తేదీ నుంచి కాశ్మీర్‌లో ప్రారంభం కా నుంది.



Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com